




www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం


PRAJAPAKSHAM ★★★★


ఎంపి పప్పు యాదవ్ అరెస్టు రాజకీయ ప్రతీకార చర్య

ఆయుధాలు వీడిన మరో 51 మంది

05


సంపుటి 09, సంచిక: 71 | ఆదివారం | 08-02-2026 | ఖమ్మం | Published from: **Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar** | పేజీలు: 12+8 | వెల రూ. 5.00


## అమెరికా అంతర్యం ఏమిటో?

యుఎస్‌టిఆర్ మ్యాప్‌లో భారత భూభాగంగా పిఒకె

**న్యూఢిల్లీ:** ఇటీవల భారత్‌-అమెరికా వాణిజ్య ఒప్పందానికి సంబంధించి అమెరికా ట్రేడ్ ప్రతినిధి కార్యాలయం (యుఎస్‌టిఆర్) తన అధికారిక ఎక్స్ ఖాతాలో ఒక గ్రాఫిక్‌ను పోస్ట్ చేసింది. ఆ పోస్టులోని వాణిజ్య వివరాల కంటే, అందులో ఉపయోగించిన భారతదేశ పటం ఎక్కువ దృష్టిని ఆకర్షించింది. ఆ మ్యాప్‌లో భారతదేశాన్ని ఒకే, విడిపోని భూభాగంగా చూపించడమే కాకుండా, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పిఒకె), అక్సాయ్ చిన్ ప్రాంతాలను కూడా భారత దేశంలోని అంతర్భాగంగానే చూపించారు. ఈ అంశమే సోషల్ మీడియాలో విస్తృత చర్చకు దారితీసింది. ఇంతకుముందు అమెరికా ప్రభుత్వ సంస్థలు విడుదల చేసిన పటాల్లో సాధారణంగా పిఒకెను ప్రత్యేకంగా చూపించడం లేదా వివాదాస్పద ప్రాంతంగా సూచించడం జరిగేది. అది పాకిస్థాన్‌తో ఉన్న సంబంధాలు, పరిస్థితి తీవ్రత, కశ్మీర్ విషయంలో నెలకొన్న ఉద్రిక్తతలను దృష్టిలో ఉంచుకుని తీసుకున్న జాగ్రత్తగా భావించేవారు. కానీ ఈసారి యుఎస్‌టిఆర్ విడుదల చేసిన మ్యాప్‌లో అలాంటి జాగ్రత్తలేవీ లేకపోవడం గమనార్హం. దీంతో కొందరు నెటిజన్లు దీనిని పాకిస్థాన్‌కు ఒక రాజకీయ సందేశంగా తరువాయి 2లో

యుఎస్ పారిశ్రామిక, వ్యవసాయ ఉత్పత్తులపై

# సుంకం సున్నా

## భారతీయ వస్తువులపై 18% టారిఫ్

భారత్‌-అమెరికా మధ్యంతర వాణిజ్య ఒప్పందం ఖరారు

ఇరు దేశాల సంయుక్త ప్రకటన విడుదల

- వచ్చేనెల 15 లోపు తొలిదశపై సంతకాలు
- రష్యా చమురుపై 25 శాతం సుంకాల రద్దు ఉత్తర్వు జారీ
- భారత ఎగుమతిదారులకు 30 ట్రిలియన్ డాలర్ల మార్కెట్ తెరుస్తోందని మంత్రి పియూష్‌గోయల్ వెల్లడి



**వాషింగ్టన్/న్యూఢిల్లీ:** ద్వైపాక్షిక వాణిజ్యంలో మొదటిదశ అమలును భారత్‌-అమెరికా ఖరారు చేశాయి. భారత్ నుండి అమెరికాకు ఎగుమతయ్యే వస్తువులపై తగ్గించిన 18 శాతం సుంకాలు అమలు చేసేందుకు, అటునుండి దిగుమతయ్యే వస్తువులపై సుంకాల తొలగింపునకు వీలుగా మధ్యంతర (తాత్కాలిక) వాణిజ్య ఒప్పందానికి మౌలిక నిబంధనల వ్యవస్థను రూపొందించాయి. ఈ మౌలిక నిబంధనల వ్యవస్థ (ఫ్రేమ్‌వర్క్)ను ఖరారు చేస్తూ రెండు దేశాలూ శనివారం ఉమ్మడి ప్రకటన విడుదల చేశాయి. మొదటి దశ ఒప్పందంపై వచ్చే నెల (మార్చి 15లోపు) రెండోవారంలో సంతకాలు జరుగుతాయని అంచనా వేస్తున్నారు. ఈ సుంకాలలో కోతల ద్వారా పూర్తిస్థాయి ద్వైపాక్షిక ఒప్పందా(బిటిఎ)నికి రంగం సిద్ధమైనట్లయింది. ఇదిలా ఉండగా రష్యా నుండి చమురు కొనుగోలు వంకతో భారత్‌పై విధించిన 25 శాతం అదనపు సుంకాలను అనుకున్నవిధంగా రద్దు చేస్తూ అమెరికా విడిగా ఇచ్చిన ఒక ప్రత్యేక ఉత్తర్వు కూడా శనివారం నుండే అమలులోకి వచ్చింది. రష్యా నుండి చమురు కొనుగోళ్ళను తగ్గించుకునేందుకు భారత్ కట్టుబడి ఉండటంతో రష్యా సంతృప్తి చెంది ఈ ఉత్తర్వు ఇచ్చింది. మిగిలిన 25 శాతం సుంకాలలో ఏడూశాతం తగ్గింపు ఉత్తర్వు మార్చినెలలో తర్వాత జారీ అవుతుంది.
తాజా ప్రకటన తర్వాత సంతకాలు జరిగితే ఇరువైపులా ఎగుమతి వస్తువులపై సుంకాలు తగ్గడంవల్ల వాణిజ్యం గతంకంటే భారీ ఎత్తున జోరుగా సాగుతుంది. ట్రంప్ కఠిన వైఖరివల్ల ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో భారత తరువాయి 2లో

ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లో అగ్నిప్రమాదం..

# కీలక ఫైళ్లు దగ్ధం

హార్డ్‌డిస్కులు, డాక్యుమెంట్లు అగ్నికి ఆహుతి?

- మంటలు ఆర్పేందుకు ఐదు ఫైరింజన్లతో ఐదు గంటలు శ్రమించిన సిబ్బంది
- ఫోన్ ట్యాంపరింగ్‌కు సంబంధించి కీలక పత్రాలు ఉన్నట్లు అనుమానాలు
- కేసు నమోదు.. రంగంలోకి దర్యాప్తు బృందం




ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్ నడిబొడ్డున నాంపల్లిలోని ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ (ఎఫ్‌ఎస్‌ఎల్)లో శనివారం ఉదయం భారీ అగ్నిప్రమాదం సంభవించింది.అగ్నిమాపక సిబ్బంది ఐదు ఫైరింజన్లతో సుమారు ఐదు గంటల పాటు శ్రమించి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో గాయపడి అపస్మారక స్థితిలో పడిపోయిన ఉద్యోగిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మరో నలుగురు ఉద్యోగులు ఎలాంటి గాయాలు లేకుండా బయటపడ్డారు. ఈ ప్రమాదంలో ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీలో భద్రపరిచిన ఆయా కేసుల కీలక డాక్యుమెంట్లు, హార్డ్‌డిస్క్‌లు పూర్తిగా ధ్వంసం అయినట్లు సమాచారం.అగ్ని ప్రమాదం ఘటనపై పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. రోజు మాదిరిగానే ఎఫ్‌ఎస్‌ఎల్ కార్యాలయానికి శనివారం ఉదయం 10 గంటలకే ఉద్యోగులు విధుల్లో చేరారు. మొదటి అంతస్తులోని వివిధ కేసులో ఉన్న సీజ్డ్ ప్రాపర్టీ విభాగంలోని చివరి గదిలో ఉన్న స్విచ్ బోర్డ్ వద్ద 10:05 గంటలకు షార్ట్ సర్క్యూట్ అయ్యింది. అక్కడ నుండి మంటలు వ్యాపించాయి. ఆ సమయంలో అక్కడ విధుల్లో ఉన్న ఐదుగురు ఉద్యోగులు విషయాన్ని గమనించి మంటలు ఆర్పేందుకు యత్నించారు. కార్యాలయంలోని కంప్యూటర్ ల్యాబ్ విభాగంలో మొదలైన మంటలు క్షణాల్లోనే ఇతర విభాగాలకు కూడా వ్యాపించాయి. లోపల రసాయనాలు, కీలక పత్రాలు తరువాయి 2లో

నర్మెట ఆయిల్‌ఫెడ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ

# ఉత్తర తెలంగాణ వర ప్రదాయిని

నెల రోజుల్లో ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభం

వ్యవసాయ మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వెల్లడి



ప్రజాపక్షం/సిద్దిపేట

దేశంలోనే అత్యాధునిక టెక్నాలజీతో నిర్మించిన ఫ్యాక్టరీ సిద్దిపేట జిల్లాలోని నర్మెట ఆయిల్‌ఫెడ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ అని, 120 మెట్రిక్ టన్నుల వరకు ఆయిల్ గెలలను ప్రాసెస్ చేసే సామర్థ్యం ఉన్న ఈ ఫ్యాక్టరీ "ఉత్తర తెలంగాణ వరప్రదాయినిగా మారుతుందని రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు తెలిపారు. శనివారం సిద్దిపేట జిల్లా నంగునూర్ మండలం నర్మెట ఆయిల్‌ఫెడ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని రాష్ట్ర ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డితో కలసి సందర్శించారు. ఈసందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర్ మాట్లాడుతూ, ఈ నెల చివరిలో గాని, వచ్చే నెల మెదటి వారంలో గాని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని ప్రారంభించేందకు తరువాయి 12లో





# కెసిఆర్ పరాయోడు

- ఎప్పుడూ పక్క రాష్ట్రం గురించే ఆలోచన
- రంగారెడ్డి జిల్లాలోని ప్రాజెక్టులను నిర్వీర్యం చేశారు
- జిల్లాకు గోదావరి జలాలను ఎందుకు అడ్డుకున్నారు?
- కాళేశ్వరం వల్ల కెసిఆర్, కెటిఆర్, హరీశ్‌రావుకు ఫామ్‌హౌస్‌లు
- మోదీని చూసి ఓటేస్తే, గల్లీ బిజెపి నేతలు పనిచేయకపోతే ఆయనను అడుగుతామా?
- పరిగి బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిలదీత

ప్రజాపక్షం /వికారాబాద్

రెండేళ్ల ప్రజా పాలనలో సంక్షేమం, అభివృద్ధి కొనసాగిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. ఓట్లు కావాలి కానీ ప్రజా సమస్యలను ఏనాడైనా పట్టించుకున్నారా? అని గత బిఆర్‌ఎస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. శనివారం ఆయన వికారాబాద్ జిల్లా పరిగిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. ప్రాణహిత-చేవేళ్ల ప్రాజెక్టు కోసం రూ.38 వేల కోట్లతో నాటి సిఎం రాజశేఖర్‌రెడ్డి పూనుకుంటే కెసిఆర్ సిఎం అయ్యాక రంగారెడ్డి జిల్లాలోని ప్రాజెక్టులను నిర్వీర్యం చేశారని విమర్శించారు. తెలంగాణ ఉద్యమ నాయకుడని చెప్పుకునే కెసిఆర్, రంగారెడ్డి జిల్లాకు గోదావరి జలాలను ఎందుకు అడ్డుకున్నారని, కెసిఆర్ మనోడు కాదని, పరాయి వాడని, పక్క రాష్ట్రం గురించే ఆలోచిస్తారన్నారు. మాజీ ఎపి మంత్రి రోజా పెట్టిన చేపల పులుసు తిని రాయలసీమను రతనాల సీమ చేస్తానని కెసిఆర్ చెప్పారని ఆరోపించారు. లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు కట్టేందుకు ప్రణాళికలు పూర్తి చేస్తామని, కెసిఆర్ కట్టిన కాళేశ్వరం మూడేళ్లలో కూలేశ్వరం అయ్యిందని, కాళేశ్వరం వల్ల కెసిఆర్, కెటిఆర్, హరీశ్‌రావుకు ఫామ్‌హౌస్‌లు వచ్చాయని ఎద్దేవా చేశారు. రూ.లక్ష కోట్లు పెట్టి కాళేశ్వరం కట్టి ప్రజాధనం వృథా చేశారని, గోదావరి జలాల ముసుగులో వేల కోట్లు కొల్లగొట్టి ఫామ్‌హౌస్‌లు కట్టుకున్నారని విమర్శించారు. గోదావరి జలాలను తీసుకొచ్చి తాండూరు, పరిగి, వికారాబాద్, చేవేళ్లను సస్యశ్యామలం చేస్తామని హామీ ఇచ్చారు.

**మోదీని చూసి ఓటేస్తే?**

అప్పులున్నా ఎన్నో సంక్షేమ పథకాలు చేస్తున్నామని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. గత పాలకులు చేసిన తప్పులను సరిచేస్తూ పాలన కొనసాగిస్తున్నామని, రెండేళ్ల ప్రజాపాలనలో సంక్షేమం, అభివృద్ధి కొనసాగిస్తున్నామని తరువాయి 2లో

మాజీ హైకోర్టు జడ్జికి

# రూ.2.5 కోట్లు టోకరా

- నామినేటేడ్ పోస్టు, మనవళ్లకు అమెరికాలో గ్రీన్‌కార్డు, ఉద్యోగం ఇప్పిస్తామంటూ మోసం
- బిజెపి నేతల పేరు చెప్పి దోచుకున్న నేరగాళ్లు

ప్రజాపక్షం/హైదరాబాద్

మాయమాటలతో ప్రలోభాలకు గురిచేసి ఏకంగా మాజీ హైకోర్టు న్యాయమూర్తికి నిందితులు రూ.2.50 కోట్ల టోకరా వేసిన ఉదంతం హైదరాబాద్‌లో వెలుగు చూసింది. కేంద్ర ప్రభుత్వంలోని పెద్దలతో మాట్లాడి నామినేటేడ్ పోస్టు ఇప్పిస్తామని, అలాగే అమెరికాలో ఉన్న అతని మనవళ్లకు గ్రీన్‌కార్డుతో పాటు మంచి ఉద్యోగాలు ఇప్పిస్తామని నిందితులు జడ్జిని నమ్మించారు.బాధితుడైన జడ్జి ఫిర్యాదు మేరకు సిసిఎస్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ డిఎస్ఆర్ వర్మ హైదరాబాద్‌లోని ఒయు కాలనీలో నివాసముంటున్నారు. తనకు పరిచయం ఉన్న నరేంద్రన్ తన అనుచరులైన సరత్‌రెడ్డి, బెంగుళూరుకు చెందిన శ్రీనాథ్ దేసాయి, శ్రీకుమార్, చైతన్య కుమార్ 2021లో తరువాయి 12లో

అది రాజకీయ దురుద్దేశ

# ఆరోపణే



1980లోనే ఓటరు జాబితాలో నా పేరు లేదు : సోనియా

**న్యూఢిల్లీ :** భారత పౌరసత్వాన్ని పొందడానికి మూడేళ్ల ముందే, కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియాగాంధీ పేరును ఓటరు జాబితాలో చేర్చారనే అభియోగాన్ని సోనియా తరఫు న్యాయవాదులు ఖండించారు. 1980లోనే న్యూఢిల్లీ పరిధిలో ఓటర్ల జాబితాలో సోనియా పేరును చేర్చారనే ఆరోపణ పూర్తిగా రాజకీయ దురుద్దేశంతో కూడుకున్నదని ఢిల్లీ సెషన్స్ కోర్టుకు వారు తెలిపారు. ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు అడ్వకేట్, సెంట్రల్ ఢిల్లీ కోర్ట్ బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ వికాస్ త్రిపాఠి సోనియాగాంధీపై ఈ ఆరోపణ చేశారు. ఈ మేరకు అభియోగంతో తొలుత 2025 సెప్టెంబరు 11న ఆయన ఢిల్లీలోని మెజిస్టీరియల్ కోర్టులో క్రిమినల్ ఫిర్యాదు పిటిషన్ వేశారు. అయితే కోర్టు ఆ పిటిషన్‌ను కొట్టివేసింది. దీంతో ఆయన ఇదే అంశంపై ఢిల్లీలోని సెషన్స్ కోర్టులో రివిజన్ పిటిషన్‌ను దాఖలు చేశారు. తాజాగా శనివారం రోజు ఢిల్లీ సెషన్స్ కోర్టు దీనిపై వాదనలు ఆలకించింది. ఈసందర్భంగా సోనియాగాంధీ తరఫున అడ్వకేట్లు తరణ్‌నమ్ చీమా, కన్నికా సింగ్, ఆకాశ్ సింగ్‌లు కోర్టుకు అఫిడవిట్‌ను సమర్పించారు. సోనియా భారత పౌరసత్వాన్ని పొందడానికి మూడేళ్లు ముందే (1980లోనే), ఓటర్ల జాబితాలో ఆమె పేరును చేర్చారనే ఆరోపణ కేవలం రాజకీయ దురుద్దేశంతో చేసిందేనని వారు స్పష్టం చేశారు. అదొక నిరాధారమైన, పనికిమాలిన, చట్టాన్ని దుర్వినియోగం తరువాయి 12లో

# సైబర్ మోసాల బారిన పడొద్దు

- జీవితాలు నాశనం చేసుకోవద్దు
- బ్యాంకు ఖాతాలే కాదు.. మనశ్శాంతినీ హైజాక్ చేస్తున్నారు
- హైదరాబాద్ సిపి వి.సి. సజ్జనార్



ప్రజాపక్షం/హైదరాబాద్


సైబర్ నేరగాళ్లు కేవలం బాధితుల బ్యాంకు ఖాతాలను మాత్రమే ఖాళీ చేయడం లేదని, వారి భవిష్యత్తును, కుటుంబాల ఆనందాన్ని, చివరికి మనశ్శాంతిని కూడా హైజాక్ చేస్తున్నారని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ విసి సజ్జనార్ తరువాయి 12లో

సాకు సర్కారుది..

# దోపిడీ ఫర్టిలైజర్ షాపులది!

- యూరియా యాప్‌తో రైతుకు తప్పని తిప్పలు
- క్షణాల్లోనే గోదాములు ఖాళీ

రవాణా ఖర్చుల సాకు- రైతు జేబుకు చిల్లు




ప్రజాపక్షం/నకిరేకల్

దేశానికి అన్నం పెట్టే రైతన్నకు కష్టాలు కొత్తవి కావు. నేల తల్లి నమ్ముకుని ఆరుగాలం చెమట చిందిస్తూ పంట పండించే అన్నదాతకు ఈసారి యూరియా సమస్య కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది.అయితే ఒకే రాష్ట్రంలో,ఒకే రైతుకు రెండు విధానాలు అమలవుతుండటం రైతును మరింత గందరగోళానికి గురిచేస్తోంది.ఒకవైపు సహకార సంఘాల ద్వారా యూరియా సరఫరాకు ప్రభుత్వం రవాణా సదుపాయాలు కల్పిస్తుండగా, మరోవైపు ప్రైవేట్ ఫర్టిలైజర్ షాపుల ద్వారా కొనుగోలు చేసే రైతుపై అదనపు భారం మోపుతోంది. పెరుగుతున్న సాగు ఖర్చులకు ఊరటగా రైతు భరోసా అందాల్సిన సమయంలో అది లేకపోవడం రైతును ఆర్థికంగా మరింత బలహీనుడిగా మారుస్తోంది.ఈపరిస్థితుల్లో రైతుకు ఊరటనివ్వాల్సిన ప్రభుత్వ యూరియా సరఫరా విధానాలు,ఆన్‌లైన్ బుకింగ్ యాప్ లోపాలతో తరువాయి 12లో

# బంగ్లాదేశ్‌లో గెలుపు మాదే

బిఎన్‌పి ధీమా



**ఢాకా:** బంగ్లాదేశ్ సార్వత్రిక ఎన్నికల్లో గెలుపు మాదేనని బిఎన్‌పి అధ్యక్షుడు తారిఖ్ రెహ్మాన్ (60) ధీమా వ్యక్తం చేశారు. వచ్చే గురువారం బంగ్లాదేశ్ పార్లమెంటుకు ప్రతిష్ఠాత్మకమైన కీలక ఎన్నికల పోలింగ్ సమీపించిన తరుణంలో శనివారం రాయిటర్స్ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ, బిఎన్‌పి స్వతంత్రంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని, ఎవ్వరితో కలిసి కూటమి ప్రభుత్వం లేదా యూనిటీ ప్రభుత్వం ఏర్పాటు చేసే ఉద్దేశం తమ పార్టీకి లేదని స్పష్టం చేశారు. బంగ్లాదేశ్ పార్లమెంటులో 300స్థానాలు ఉండగా, 292 స్థానాలకు బిఎన్‌పి పోటీ చేస్తోంది. మూడింట రెండు వంతుల సీట్లను తమ పార్టీ గెలుచుకుంటుందని తారిఖ్ రెహ్మాన్ విశ్వాసం వ్యక్తం చేశారు. జమాత్–ఎ–ఇస్లామీ చేసిన ప్రతిపాదనను ఆయన తిరస్కరించారు. "నా రాజకీయ ప్రత్యర్థులతో కలిసి నేనెలా ఒక కూటమి ప్రభుత్వాన్ని లేదా యూనిటీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలను? ఎందుకు ఏర్పాటు చేస్తాను? అలాంటప్పుడు ఇక ప్రతిపక్షంలో ఎవరుంటారు? ఆ పాత్ర ఎవరు నిర్వహిస్తారు?" అని ఆయన ఎదురు ప్రశ్న వేశారు. వారికి ఎన్ని సీట్లు వస్తాయో నాకు తెలియదు, కానీ ఒకవేళ వారు ప్రతిపక్షంలో ఉండేట్లయితే ఒక మంచి ప్రతిపక్షంగా వారు ప్రవర్తిస్తారని భావిస్తాన్నారు. 2001, 2006 సంవత్సరాలలో రెండు పార్టీలు కలిసి ప్రభుత్వాన్ని నడిపిన విషయాన్ని రాయిటర్స్ ప్రతినిధి గుర్తుచేయగా ఇప్పుడు పరిస్థితులు మారాయని ఆయన తోసిపుచ్చారు. దేశంలో ఏ పార్టీకి మెజారిటీ సాధించినా దేశ స్థిరత్వం కోసం, 2024లో ఉద్యమాల కారణంగా తీవ్రంగా దెబ్బతిన్న దేశ గౌరవాన్ని పరిరక్షించి పునరుద్ధరించేవిధంగా యూనిటీ ప్రభుత్వం ఏర్పాటుకు తాము తోడ్పడతామని జమాత్–ఎ–ఇస్లామీ బాహాటంగా అంగీకరించి ఒక ప్రతిపాదన చేసింది. రెండు దశాబ్దాలపాటు లండన్‌లో ప్రవాస జీవితం గడిపిన తారిఖ్ రెహ్మాన్ గత ఏడాది డిసెంబరులో బంగ్లాదేశ్‌కు కుటుంబ సమేతంగా తిరిగి వచ్చారు. ఆ తర్వాత కొద్ది రోజులకే మాజీ ప్రధాన మంత్రి, ఆయన తల్లి ఖలీదా జియా కన్నుమూయడంతో ఆయన బిఎన్‌పి అధ్యక్ష బాధ్యతలు చేపట్టి ఎన్నికల్లో పార్టీని ముందుకు నడిపిస్తున్నారు.

# తకైచీ పార్టీ పూర్తి మెజార్టీ సాధిస్తుందా?

## నేడు జపాన్ పార్లమెంటుకు ఎన్నికలు



**టోక్యో:** జపాన్‌లో దిగువసభ హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్ (ప్రజా ప్రతినిధులసభ)కు ఆదివారం జరిగే ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ప్రధానమంత్రి సనే తకైచీ (65) అధికారంలోకి వచ్చిన కొద్ది నెలలకే చైనాతో ఏర్పడిన తీవ్ర ఉద్రిక్త పరిస్థితులమధ్య దిగువసభలో పూర్తి మెజారిటీ సంపాదించుకోవడం కోసం ఆమె మెరుపు ఎన్నికలకు పిలుపు ఇచ్చారు. 465 స్థానాలున్న దిగువసభలో ఎవ్వరి సహాయం లేకుండా మెజారిటీకి అవసరమైన 233 స్థానాలను లిబరల్ డెమోక్రటిక్ పార్టీ (ఎల్‌డిపి) సంపాదించుకోవాలని తకైచీ గట్టి పట్టుదలతో ఉన్నారు. ప్రస్తుతం తకైచీ ఎల్‌డిపి కి సభలో 198 స్థానాలు ఉండగా మిగిలిన 35 స్థానాల కోసం మిత్రపార్టీలపై ఆధారపడవలసి వస్తున్నది. ఈ ఎన్నికల్లో కాన్‌స్టిట్యూషనల్ డెమోక్రటిక్‌పార్టీ ఆఫ్ జపాన్ (సిడిపి) నాయకుడు యషిహికో నోడా, జపాన్ ఇన్నొవేషన్‌పార్టీ (జెఐపి) నాయకుడు హిరోఫుమి యొషిమురాలు హోరాహోరీ పోరాటం చేస్తున్నారు. తమురా తొముకో నాయకత్వాన జపనీస్ కమ్యూనిస్టుపార్టీ ఈ ఎన్నికలబరిలో పోటీ చేస్తోంది. ప్రస్తుత పార్లమెంటులో జపనీస్ కమ్యూనిస్టుపార్టీకి దిగువసభలో ఎనిమిది స్థానాలు, ఎగువసభ హౌస్ ఆఫ్ కౌన్సిలర్స్‌లో ఏడు స్థానాలు ఉన్నాయి. ఈ ఎన్నికల్లో తకైచీని ఓడించేందుకు కాన్‌స్టిట్యూషనల్ డెమోక్రటిక్‌పార్టీ ఆఫ్ జపాన్, న్యూ కొమైటో పార్టీలు రెండు విలీనమై జనవరి 15వ తేదీన జపనీస్ సెంట్రిస్ట్ రిఫామ్స్ ఎలయెన్స్ (సిఆర్ఎ)గా ఆవిర్భవించి బరిలోకి దిగాయి. తకైచీ ప్రధానమంత్రిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత ఎల్‌డిపిలో మితవాద,ఛాందసవాద పోకడలు, పార్టీ నిధులు సంపాదించుకోవడంకోసం విచ్చలవిడి అవినీతి, ప్రజాసమస్యల విస్మరణ వంటి అంశాలను ప్రధానంగా ఈ సిడిఎ కూటమి ప్రజల్లో ప్రచారం చేస్తోంది. వీరితోపాటు డెమోక్రటిక్‌పార్టీ ఫర్ ద పీపుల్ (డిపిపి)తోపాటు మరో నాలుగు పార్టీలు కూడా ఎన్నికల బరిలో ఉన్నాయి.

ఎల్‌డిపి అధికారం చేపట్టిన తర్వాత పలువురు వరుస రాజీనామాల తర్వాత గత ఏడాది అక్టోబరు 21వ తేదీన ప్రధానమంత్రిగా తకైచీ బాధ్యతలు తీసుకున్నారు. లిబరల్ డెమోక్రటిక్‌పార్టీకి ఆమే మొదటి మహిళా అధ్యక్షురాలు, దేశానికి కూడా ఆమే రెండవ మహిళా ప్రధానమంత్రి కూడా.ఒక మహిళ సహా ఇప్పటివరకూ జపాన్‌ను 66 మంది ప్రధానమంత్రులు పరిపాలించారు ఎల్‌డిపి నేత షింజో అబే ఇప్పటివరకూ దేశంలో అత్యధికంగా దాదాపు పది సంవత్సరాలపాటు రెండు విడతలుగా ప్రధానమంత్రిగా బాధ్యతలు నిర్వహించి చరిత్ర పుటల్లో నిలిచారు. ఆయన ప్రధానమంత్రిగా ఉండగా సనే తకైచీ వివిధ మంత్రి పదవులు నిర్వహించారు. తైవాన్‌పై దాడి చేస్తే జపాన్ సైన్యం కూడా ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోవాల్సి వస్తుందని తకైచీ పార్లమెంటు వేదికగా ప్రకటించడంతో చైనా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అప్పటి నుండీ రెండు దేశాలమధ్యా ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. కొన్ని విమాన రవాణా కార్యకలాపాలు స్తంభించడంతోపాటు స్నేహపూర్వకంగా జపాన్‌కు చైనా ఇచ్చిన రెండు పాండాలను కూడా ఆ దేశానికి ఇటీవలే తిరిగి ఇచ్చేయాల్సినంతగా దౌత్యసంబంధాలు దెబ్బతిన్నాయి. అమెరికాలో ఆమె సంబంధాలను పునరుద్ధరించుకోవడానికి ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారు. తైవాన్‌పై ఒకవేళ చైనా దాడి చేస్తే తైవాన్‌కు మద్దతుగా జపాన్ సైన్యాన్ని పంపించేందుకు వీలుగా దేశ రాజ్యాంగంలో ఉన్న తొమ్మిదవ అధికరణను పునరుద్ధరించాలని తకైచీ గట్టిగా వాదిస్తున్నారు. డోనాల్డ్ ట్రంప్ అనుకూల విధానాలు అనుసరిస్తున్నారు.

### ఇరాన్‌తో వ్యాపారం చేస్తే అదనపు టారిఫ్

# ట్రంప్ హెచ్చరిక ఉత్తర్వు జారీ



**వాషింగ్టన్ :** ఇరాన్‌తో వ్యాపారం చేసే దేశాలపై అదనపు సుంకాలు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. ఈ మేరకు ఒక హెచ్చరిక ఉత్తర్వుపై సంతకం చేసి విడుదల చేశారు. ఐతే అదనంగా ఎంత సుంకం విధిస్తామన్న విషయాన్ని ఆ ఉత్తర్వులో ప్రస్తావించలేదు. ఐతే సాధారణంగా ఈ అదనపు సుంకాలు 25శాతం మేరకు ఉండవచ్చునని వైట్‌హౌస్ వర్గాల సమాచారం. ఇరాన్‌ను మళ్ళీ చర్చల బల్లదగ్గరకు తీసుకురావడానికి, లొంగదీయడానికే ఈ హెచ్చరిక ఉత్తర్వు జారీ చేశారని విశ్లేషకులు పేర్కొన్నారు. ఇరాన్‌తో వ్యాపారం చేసే దేశాలు అమెరికాకు గనుక సరుకులు ఎగుమతి చేస్తుంటే వెంటనే మానుకోవాలి. లేకపోతే ఈఅదనపు సుంకాలు వర్తిస్తాయన్నది హెచ్చరిక ఉత్తర్వు సారాంశం. ఫ్లోరిడా గోల్ఫ్‌క్లబ్‌కు వెళుతూ ఎయిర్‌ఫోర్స్ ఒన్ విమానంలో పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ ఇదే విషయం చెప్పారు. ఈ ఏడాది ఆరంభంలోనే ట్రంప్ ఈ హెచ్చరిక చేశారు. ఇరాన్ వద్ద అణ్వాయుధాలు ఉండకూడదని పునరుద్ఘాటించారు.


**వచ్చేవారం మళ్ళీ చర్చలు**

ఇరాన్‌తో మస్కట్‌లో జరిగిన పరోక్ష చర్చలు బాగా జరిగాయని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అన్నారు. శుక్రవారం జరిగిన చర్చలను ప్రస్తావిస్తూ, 'వెరీ గుడ్' అన్నారు. వచ్చేవారం ఆరంభంలోనే మళ్ళీ చర్చలకు ప్రణాళిక చేస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని సంభాషణలు మెరుగైనస్థాయిలో జరుగుతాయన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఐతే ఇరాన్ తనకు అనుకూలంగా ఒప్పందం చేసుకోవాలనే చెరదు ఆలోచనలతో ఉన్నట్లు కనిపిస్తోందన్నారు. గతంలో జరిపిన చర్చలకంటే ఇరాన్ ఇంకా చాలా చాలా చేయాల్సి ఉందన్నారు. ఆ వివరాలు మాత్రమ చెప్పలేదు. మరోవైపు ఇరాన్ విదేశీమంత్రి అరాఘ్చి కూడా చర్చల పోకడ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. మస్కట్‌లో చర్చలు ముఖాముఖీగా జరగలేదు. మధ్యవర్తి దేశ ప్రతినిధిని ఇరు దేశాల ప్రతినిధులు ఒకరి తర్వాత ఒకరు వెళ్ళి కలుసుకుని మాట్లాడారు. కానీ గత ఏడాది జూన్‌లో ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా దాడుల తర్వాత మొదటిసారి మళ్ళీ అణు ఆయుధాలు, యురేనియ శుద్ధి సమస్య పరిష్కారానికి దౌత్యమార్గంలో చర్చల ప్రక్రియ ప్రారంభం కావడం సానుకూలపరిణామంగా మారింది. అమెరికా తరపున ఆ దేశ నావికాదళ అడ్మిరల్ బ్రాడ్ కూపర్ యుద్ధ దుస్తుల్లోనే ఈ చర్చలకు వెళ్ళారు. ఆయన మిలిటరీ సెంట్రల్ కమాండ్ ప్రధానాధిపతిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అరేబియా జలాల్లో అమెరికా మోహరించిన భారీ యుద్ధ నౌకలను ఆయన పర్యవేక్షిస్తున్నారు. అత్యంత శక్తిమంతమైన అబ్రహాంలింకన్ యుద్ధ విమాన వాహక నౌకను కూడా అమెరికా ఇరాన్ సమీపంలో అంతర్జాతీయ జలాల్లో మోహరించింది.

# జూన్ లోపు ఉక్రేన్ యుద్ధం ముగించాలి

## ట్రంప్ డెడ్‌లైన్ విధించారు: జెలెన్‌స్కీ

**కీవ్:** యుద్ధం ముగించేందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ జూన్ వరకూ తుది గడువు విధించచారని జెలెన్‌స్కీ అన్నారు. ట్రప్ ఈ విధంగా ఉక్రేన్ విషయంలో ఒక గడువు విధించడం ఇదే మొదటిసారి. ఈలోపు రెండు దేశాలు ఒక ఒప్పందానికి వచ్చి నాలుగు సంవత్సరాల యుద్ధాన్ని ముగించాల్సి ఉంటుందని జెలెన్‌స్కీ శనివారం పాత్రికేయులతో చెప్పారు. అబుధాబిలో రెండుసార్లు జరిగిన చర్చల స్ఫూర్తితో రెండు దేశాలు తదుపరి వరుస సమావేశాల ద్వారా సమస్య పరిష్కారానికి కృషి చేయాల్సి ఉందన్నారు. వచ్చేవారం మళ్ళీ అబుధాబిలో చర్చలకు అమెరికా ప్రతిపాదన చేసిందన్నారు. మళ్ళీ కూర్చుని మాట్లాడుకోవాలని అమెరికా యంత్రాంగం ఒత్తిడి చేసే అవకాశాలున్నాయన్నారు. ద్వైపాక్షిక చర్చల్లో భాగంగా వాణిజ్య ఒప్పందాలు కూడా ఉన్నాయన్నారు. ఈ మేరకు 12 ట్రిలియన్ డాలర్లతో కూడిన ఒక ప్రతిపాదనను అమెరికాకు రష్యా ప్రతిపాదించిందని చెప్పారు. ఈ ప్రతిపాదనను ఆయన ''దిమిత్రియేవ్ ప్యాకేజీ''గా అభివర్ణించారు. వేసవికాలం నాటికి యుద్ధం ముగించవల్సి ఉందని, అందుకు కృషి చేయాలన్నారు. ఉక్రేన్–అమెరికా–రష్యా మధ్య వచ్చేవారం అబుధాబిలో మరోసారి త్రైపాక్షిక చర్చలకు అమెరికా ప్రతిపాదన చేసినట్లు జెలెన్‌స్కీ చెప్పారు. ఐతే చర్చలు జరుగుతున్నప్పటికీ ఉక్రేన్‌పై రష్యా తాజాగా శనివారం కూడా క్షిపణులు, డ్రోన్లతో దాడి చేసిందన్నారు. 400 డ్రోన్లు, 40 క్షిపణులతో రష్యా తమ దేశ



ఇంధన వనరులపై దాడులు చేసి ధ్వంసం చేసిందన్నారు. శీతాకాలంలో ముఖ్యంగా ఇంధన కేంద్రాలపై రష్యా క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేస్తూ వ్యవస్థలను ధ్వంసం చేయడంలో లక్షలాదిమంది ప్రజలు విద్యుత్ కొరతవల్ల చలితో గజ గజా వణకిపోతున్నారని, అత్యవసరంగాఈ విషయంలో తాము పోలెండ్‌తో ఒప్పందం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టింగ్ కూడా పెట్టారు. ఈ ఏడాదిలో వరుసగా రెండోసారి తీవ్రస్థాయిలో తమ దేశ ఇంధన కేంద్రాలపై రష్యా తీవ్ర దాడులు చేసిందని పేర్కొన్నారు.

# కీలక ఫైళ్లు దగ్ధం

(మొదటి పేజీ తరువాయి)

ఉండటంతో దట్టమైన పొగ కమ్ముకుంది. ప్రమాదం జరిగిన వెంటనే అప్రమత్తమైన కార్యాలయ సిబ్బంది పరుగులు తీశారు. వెంటనే వారు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది రెండు ఫైరింజన్ల సహాయంతో మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశాయి. కార్యాలయంలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారానికి సంబంధించిన కీలక ఫైళ్లు ఉండటంతో ఘటనపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

**తీవ్ర ఆందోళనలో అధికారులు..**

ఎఫ్ఎస్ఎల్ కార్యాలయంలో నేరాలకు సంబంధించిన కీలక సాక్ష్యాధారాలు, రసాయనాలు, రికార్డులు భద్రపరచడంతో అధికారులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. ఈ ప్రమాదం వల్ల ఎంతమేర నష్టం జరిగిందనేది ఇంకా తెలియాల్సి ఉంది. ఫైర్ డీజీ విక్రమ్ సింగ్ ఘటన స్థలానికి చేరుకుని మీడియాతో మాట్లాడారు. కెమికల్ లాబ్ మెటీరియల్ అంతా రెండో అంతస్తులో ఉందన్నారు. మొదటి అంతస్తులో సెన్సిటివ్‌గా ఉన్న ప్లాస్టిక్ వస్తువులు పూర్తిగా కాలిపోయాయని, రెండో అంతస్తులో ఉన్న కెమికల్ ల్యాబ్‌కు ఎలాంటి ప్రమాదం లేదన్నారు. తెలంగాణ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్లో మంటలు అదుపులోకి వచ్చాయని, మొదటి అంతస్తులోని వివిధ కేసులో ఉన్న సీజ్డ్ ప్రాపర్టీ విభాగంలో అగ్ని ప్రమాదం సంభవించిందని వెల్లడించారు. చాలా విలువైన హార్డ్ డిస్కులు డాక్యుమెంట్స్ అగ్నికి ఆహుతయ్యాయని పేర్కొన్నారు.

**చర్చానీయాంశంగా మారిన ప్రమాదం..**

నాంపల్లిలో ఉన్న స్టేట్ ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ (ఎఫ్ఎస్ఎల్)లో భారీ అగ్నిప్రమాదం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ ప్రమాదం కేవలం ఆస్తి నష్టానికే పరిమితం కాకుండా, రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన పలు కీలక కేసుల విచారణను దెబ్బతీసే ప్రమాదం కనిపిస్తోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు పత్యేక రాష్ట్ర ఏర్పాటు అయ్యాక రాజకీయ ప్రకంపనలు సృష్టించిన అనేక కేసులకు సంబంధించిన కీలక ఆధారాలు ప్రస్తుతం ఆ ల్యాబ్‌లోనే ఉన్నాయి. ఇటీవలి కాలంలో అత్యంత వివాదాస్పదమైన ఫోన్ ట్యాపింగ్ విచారణలో భాగంగా స్వాధీనం చేసుకున్న హార్డ్ డిస్కు, డిజిటల్ డేటా విశ్లేషణ ఇక్కడే జరుగుతోంది. అదేవిధంగా గత కొన్నేళ్లుగా పెండింగ్లో ఉన్న ఓటుకు నోటు కేసులోని ఆడియో, వీడియో రికార్డింగ్ల ఒరిజినల్ ఫైల్స్ ఇక్కడి కంప్యూటర్లలోనే నిక్షిప్తమై ఉన్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల ముందు రాజకీయంగా సంచలనం రేపిన ఎమ్మెల్యేల కొనుగోలు యత్నం కేసులో స్వాధీనం చేసుకున్న మొబైల్ ఫోన్లు, సిమ్ కార్డులు, వాటికి సంబంధించిన ఫోరెన్సిక్ రిపోర్టులు ఇక్కడే ఉన్నాయి. అయితే, కీలక కేసుల విచారణ ముమ్మరంగా సాగుతున్న తరుణంలో, ఆధారాలకు నిలయమైన ఎఫ్ఎస్ఎల్‌ల్లో మంటలు చెలరేగడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవేళ ఇక్కడి కంప్యూటర్లు, సర్వర్లు పూర్తిగా దగ్ధమైతే, ఆయా కేసుల్లో నిందితులకు శిక్ష పడేలా చేసే కీలకమైన డిజిటల్ సాక్ష్యాలు పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. అయితే, ఈ ప్రమాదం యాదృచ్ఛంగా జరిగిందా.. ఎవరైనా కుట్రపూరితంగా చేశారా అన్న అనుమానాలు కూడా వ్యక్తం అవుతున్నాయి.

# ఆంతర్యం ఏమిటో? (మొదటి పేజీ తరువాయి)

అభివర్ణించారు. మరికొందరు ఇది కేవలం ఒక డిజైన్ ఎంపిక మాత్రమే కావచ్చని, దానికి అతిగా అర్థాలు ఆపాదించకూడదని అభిప్రాయపడ్డారు. అయితే, భారత ప్రభుత్వ వైఖరి మాత్రం ఈ విషయంలో స్పష్టంగానే ఉంది. భారత విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ గతంలో పార్లమెంటులో ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో, జమ్మూ కశ్మీర్, లద్దాఖ్ (అక్సాయ్ చిన్ సహా) భారతదేశానికి అవిభాజ్య భాగాలని స్పష్టం చేశారు. పాకిస్థాన్ అక్రమంగా ఆక్రమించిన ప్రాంతాలను ఖాళీ చేయాలని భారత్ ఎప్పటికప్పుడు కోరుతోందని కూడా ఆయన గుర్తు చేశారు. భారత ప్రభుత్వం విడుదల చేసే అధికారిక పటాల్లో ఈ ప్రాంతాలన్నీ భారత యూనియన్‌లో భాగంగానే చూపిస్తాయని తెలిపారు. ఈ నేపథ్యంలో యుఎస్‌టిఆర్ విడుదల చేసిన మ్యాప్ ప్రాధాన్యతను సంతరించుకుంది. అదే సమయంలో, భారత్–అమెరికా మధ్య ఒక అంతరకాలిక వాణిజ్య ఒప్పందం రూపురేఖలు కూడా వెలుగులోకి వచ్చాయి. ఈ ఒప్పందం ద్వారా భారత వస్తువులపై విధించే టారిఫ్‌లను తగ్గించాలనే లక్ష్యం ఉందని సంయుక్త ప్రకటనల్లో పేర్కొన్నారు. అయితే ఈ వాణిజ్య అంశాల కంటే, మ్యాప్ వివాదమే ప్రజల దృష్టిని ఎక్కువగా ఆకర్షించింది. ఇది అంతర్జాతీయ రాజకీయాల్లో పటాల ప్రాధాన్యం, సంకేతాత్మక చర్యల ప్రభావం ఎంత బలంగా ఉంటాయో మరోసారి చూపించిన సంఘటన. వాస్తవానికి వాషింగ్టన్‌లోని అధికార యంత్రాంగంలో మ్యాప్‌లను యాదృచ్ఛికంగా లేదా యాదాలాపంగా రూపొందించరు. ప్రతి సరిహద్దు, ప్రతి రంగు, ప్రతి భౌగోళిక గుర్తింపును న్యాయ నిపుణులు, విధానాధికారులు పరిశీలించి, ఉన్నతస్థాయిలో ఆమోదిస్తారు. అందుకే యుఎస్‌టిఆర్ విడుదల చేసిన భారత చిత్రపటం చర్చనీయాంశంగా మారింది. జేమీసన్ గ్రీర్ నేతృత్వంలో రూపొందిన ఈ పటంలో కశ్మీర్‌ను భారత భూభాగంగా చూపించడం ద్వారా, ఈ వివాదాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లాలన్న పాకిస్థాన్ ప్రయత్నాలకు స్పష్టమైన సంకేతం ఇచ్చినట్టు భావించాల్సి ఉంటుంది. ఇదే సమయంలో భారత్–అమెరికా వాణిజ్య ఫ్రేమ్‌వర్క్ వెలువడటం, ఇండో పసిఫిక్ వ్యూహంలో భారత్ అమెరికాకు కీలక భాగస్వామిగా ఎదిగిందన్న అభిప్రాయాన్ని సూచిస్తోంది. ఏదిఏమైనా భారత్, పాకిస్థాన్ మధ్య దశాబ్దాలుగా తీవ్ర ఉద్రిక్తతలకు, గతంలో యుద్ధాలకు కారణమైన కశ్మీర్ విషయంపై భారత ప్రభుత్వం అనుసరించిన విధానం, తాజా పరిణామం సందేహాలకు తావిస్తున్నది. కశ్మీర్‌పై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బడ్జెట్ సమావేశాల సందర్భంగా చేసిన ప్రసంగంలో ఎక్కడా ప్రస్తావించలేదు. పాకిస్థాన్‌ను బహిరంగంగా మందలించిన సందర్భం కూడా లేదు. దౌత్యపరమైన ఆర్భాటం సైతం కనిపించలేదు. బదులుగా, అమెరికా తన స్థితిని వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన కథనంలో నిశ్శబ్దంగా నిక్షిప్తం చేసింది. పైపై చూస్తే ఇది సాంకేతిక పరమైన అంశంలా అనిపించవచ్చు, కానీ వాషింగ్టన్ విధాన సంకేతాల భాషను అర్థం చేసుకునే వారికి మాత్రం అది సందేశం స్పష్టమే. ఇది మౌన దౌత్యం అయినప్పటికీ, దాని ప్రభావం మాత్రం తీవ్రంగానే ఉంటుంది. ఈ మ్యాప్ పర్యవసానం ఎలా ఉంటుందో చూడాలి.




# కెసిఆర్ పరాయోడు

(మొదటి పేజీ తరువాయి)

పేర్కొన్నారు. స్థానిక సమస్యలు పరిష్కరించేందుకు బిఆర్ఎస్, బిజెపి ప్రయత్నించలేదని, ప్రధాని మోదీని చూసి ఓటేయాలని బిజెపి నేతలు అడుగుతున్నారని, పెళ్లి పెద్దను చూసి పిల్లను ఇస్తే పిల్లగాడు పనికి రాకపోతే ఏం చేయాలని ఎద్దేవా చేశారు. మోదీని చూసి ఓటేస్తే, గల్లీ బిజెపి నేతలు పని చేయకపోతే, మోదీని అడగలేము కదా అని ప్రశ్నించారు.

**ఆ 2 పార్టీల మధ్య చీకటి ఒప్పందం :**

బిఆర్ఎస్‌ను ప్రజలు బొందపెట్టారని, కాంగ్రెస్‌తో పోరాడటం మా వల్ల కాదని, బిజెపితో బిఆర్ఎస్ కలిసిపోయిందని, కాంగ్రెస్‌ను ఓడించేందుకు బిజెపి, బిఆర్ఎస్ చీకటి ఒప్పందం చేసుకున్నాయని విమర్శించారు. పదేళ్లలో సమస్యలు పరిష్కరించి ఉంటే బిఆర్ఎస్ నేతలు అడగకుండానే ఓటేసేవారన్నారు. సమస్యలు పరిష్కరించి ఉంటే బిఆర్ఎస్, బీజేపీ నేతలు వంగి వంగి దండాలు పెట్టాల్సిన పరిస్థితి ఉండేది కాదని హితవు పలికారు.

**కృష్ణానదిలో తేలేవాళ్లు :**

కెసిఆర్ దళితులను మోసం చేస్తే దళితుడైన గడ్డం ప్రసాద్ ప్రస్తుతం స్పీకర్‌గా ఉన్నారని, దళిత వ్యక్తిని సిఎం చేస్తానని చెప్పి కెసిఆర్ మోసం చేశారని సిఎం తెలిపారు. తాండూర్‌కు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ఇస్తామని, పరిగి, వికారాబాద్ మున్సిపాల్టీలను అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. మూసీని ప్రక్షాళన చేస్తామంటే బిఆర్ఎస్, బిజెపి అడ్డుకుంటున్నాయని ఆరోపించారు. మూసీ సమీపంలోని ఇళ్లలో బిజెపి నేతలు ఒకరోజు నిద్రపోయారని, వరదలు వచ్చినప్పుడు మూసీ సమీపంలోని ఇళ్లకు వెళ్లాలని బిజెపి నేతలను కోరానని, వరదలు వచ్చినప్పుడు బిజెపి నేతలు వెళ్లి ఉంటే మూసీలో కొట్టుకుపోయి కృష్ణానదిలో తేలేవాళ్లని అన్నారు. 70 వేల ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలు చేపట్టి నిరుద్యోగ సమస్యను తొలగించామని పేర్కొన్నారు.

**ఎవరెవరు అడ్డొస్తారో చూద్దాం :**

కెసిఆర్, అతని బంధువులందరికీ పదవులు ఉండాలి కాని నిరుద్యోగ పిల్లలకు ఉద్యోగాలు వద్దా అని ప్రశ్నించారు. రాసిపెట్టుకో కెసిఆర్, కిషన్‌రావు ఇంకోసారి కూడా కాంగ్రెస్ ప్రభుత్వమే వస్తుందని, ఇప్పటి నుంచి 8 ఏళ్ల వరకు కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని, కాంగ్రెస్ హయాంలో దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దుతామని సవాల్ విసిరారు. ఎన్నికల్లో ఏం కుట్రలు చేస్తారో చేయండని, ఎవరెవరు అడ్డొస్తారో చూద్దామన్నారు.

ఈ కార్యక్రమంలో, స్పీకర్ ప్రసాద్‌కుమార్, మంత్రి శ్రీధర్‌బాబు, మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, యాదయ్య, ప్రకాష్‌గౌడ్, కల్వ సుజాత, గ్రాంథాయల చైర్మన్ మదుసూదన్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సుంకం సున్నా

(మొదటి పేజీ తరువాయి)

ఎగుమతిదారులు తీవ్ర నష్టాలు చవిచూశారు. అదే సమయంలో ఈ ఒప్పందం ప్రకారం భారతదేశ రైతుల ప్రయోజనాలు కాపాడేందుకు, వారికి రక్షణలు కల్పించేందుకు ఏర్పాట్లు ఉన్నాయి. జమొక్కజొన్న, గోధుమలు, బియ్యం, సోయా, కోళ్ళపరిశ్రమ, పాడి పరిశ్రమ ఉత్పత్తులు, వెన్న ఇథనాల్, పొగాకు, కొన్ని రకాల కూరగాయలు, మాంసం వంటివాటికి రక్షణలు ఉన్నాయి. అదేవిధంగా కొన్ని అమెరికా వస్తువులపై భారత్ దిగుమతి సుంకాలను రద్దు చేస్తుంది.

ఖరారు చేసిన నిబంధనల ప్రకారం ఇరువైపులా నిర్దేశిత ప్రణాళికల ప్రకారం అమెరికా ఇచ్చిన అవకాశం మేరకు భారత్ నుండి ఎగుమతి చేసే తోలు, రత్నాలు వంటి పలు వస్తువులపై టారిఫ్‌లు తగ్గుతాయి. భారత్‌కు దిగుమతయ్యే అమెరికా సరుకులపై సుంకాలను కేంద్ర ప్రభుత్వం తొలగిస్తుంది. పరస్పర దిగుమతుల్లో ఇరు దేశాలు లబ్ధి పొందడానికి వీలుగా ఈ నిబంధనల వ్యవస్థను రూపొందించారు. 2014లో నరేంద్రమోదీ అధికారం చేపట్టినప్పటి నుండీ రెండు దేశాలమధ్యా జరిగిన తొమ్మిదో వాణిజ్య ఒప్పందమిది. గత ఏడాది ఫిబ్రవరి 13న ప్రధానమంత్రి నరేంద్రమోదీ–అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మధ్య ద్వైపాక్షిక ఒప్పందంపై చర్చలు ప్రారంభమయ్యాయి. అప్పటినుండీ అనేక మలుపులు తిరిగిన 'ఒప్పందం కథ' తాజాగా ఒక కొలిక్కి వచ్చింది. విస్తారమైన ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై సంప్రదింపులకు రెండు దేశాలూ కట్టుబడ ఉన్నట్లు భారత్–అమెరికా మధ్య ఖరారైన ఈ నిబంధనల వ్యవస్థ ఉద్ఘాటించింది.

భారత్ నుండి వచ్చే సరుకులను తీసుకునే అమెరికాలోని కంపెనీల నుండి ట్రంప్ యంత్రాంగం 50 శాతానికి బదులుగా ఇకమీదట 18శాతం సుంకాలు వసూలు చేస్తుంది. భారత్ కూడా అమెరికా నుండి వచ్చే పారిశ్రామిక వస్తువులు, విస్తారమైన ఆహార వస్తువులు, వ్యవసాయ ఉత్పత్తులపై దిగుమతి సుంకాలను పూర్తిగా రద్దు చేయడం లేదా బాగా తగ్గించే చర్యలు అమలు చేస్తుంది. ఇథనాల్ నుండి తీసిన చాలా అత్యధికంగా ప్రోటీన్ విలువలుగల ఉప ఉత్పత్తులు, పశువులకోసం ఆహార ఉత్పత్తులతోపాటు శుద్ధి చేసిన పండ్లు, సోయాబీన్ ఆయిల్, వైన్, స్పిరిట్స్ కూడా అమెరికా నుండి వచ్చే వస్తువుల జాబితాలో ఉంటాయి. కాగా భారతదేశం కూడా 500 బిలియన్ డాలర్లు విలువైన అమెరికా ఇంధన ఉత్పత్తులను కొనుగోలు చేయాలనే ఉద్దేశాన్ని ఇప్పటికే వ్యక్తం చేసిందని రెండు దేశాల సంయుక్త ప్రకటన పేర్కొంది. ఎయిర్‌క్రాఫ్ట్, ఎయిర్‌క్రాఫ్ట్ విడిభాగాలు, విలువైన ఖనిజాలు, సాంకేతిక ఉత్పత్తు, వంట బొగ్గు వంటి ఇంధన ఉత్పత్తులను రాబోయే ఐదు సంవత్సరాలపాటు మనదేశం దిగుమతి చేసుకుంటుంది.

రష్యా చమురు కొనకుండా

**భారత్‌ను ఓ కంట కనిపెడుతూనే ఉంటాం**

భారతదేశం ప్రత్యక్షంగానో, పరోక్షంగానో రష్యా నుండి చమురు కొనుగోలు పునరుద్ధరిస్తుందా? దిగుమతి చేసుకోవడం పూర్తిగామానేసిందా? అనే విషయాన్ని అమెరికా ప్రభుత్వ యంత్రాంగం ఒక కంట కనిపెట్టే ఉంటుందని ట్రంప్ జారీ చేసిన ఉత్తర్వు స్పష్టం చేసింది. భారత్‌పై విధించిన 25 శాతం అదనపు సుంకాల రద్దు ఉత్తర్వు ఫిబ్రవరి ఏడోతేదీ తెల్లవారకముందే గడియారం ముల్లు ప్రకారం అర్థరాత్రి 12 గంటల నుండి అమలులోకి వచ్చింది. ఐతే పరస్పర ప్రాతిపదికపై ఇరుదేశాల మధ్యా ఇంకా మిగిలిఉన్న 25 శాతం సుంకాన్ని 18శాతం మేరకు తగ్గించేందుకు మరో కార్యనిర్వాహక ఉత్తర్వు వస్తుంది. వచ్చేనెల సంతకాలు జరిగాక ఈ కార్యాచరణ మొదలవుతుంది. ఇప్పటివరకూ మాత్రం భారతదేశం రష్యా చమురు దిగుమతుల విషయంలో అమెరికా అనుకున్నవిధంగా కట్టుబడి ఉందని ఉత్తర్వు తెలియజేసింది. ఈ పరిస్థితులలో వచ్చే తేడాపాడాలను బట్టి భారత్‌నుండి దిగుమతి చేసుకునే వస్తువులపై ఒకవేళ బహుశా తిరిగి 25శాతం సుంకాలు పునరుద్ధరించే విషయాన్ని కూడా ఈ ఉత్తర్వు చాలా స్పష్టంగా తెలియజేసింది. ''భారత్–అమెరికా పరస్పరం ఇచ్చిపుచ్చుకునే, ప్రయోజనాత్మక వాణిజ్యానికి మధ్యంతర ఒప్పందంకోసం మౌలిక నిబంధనల వ్యవస్థను రూపొందించామని ప్రకటించేందుకు చాలా ఆనందం కలుగుతోంది' అని ప్రకటన పేర్కొంది.

**మేక్ ఇన్ ఇండియాకు మరింత ఊతం**

**యువతకు ఉద్యోగాల సృష్టి : మోదీ**

మేక్ ఇన్ ఇండియా కార్యాక్రమానికి అమెరికా–భారత్ మధ్యంతర ఒప్పందం మరింత బలాన్ని, ఊతాన్ని ఇస్తుందని, దేశ యువతరానికి, మహిళలకు ఉద్యోగాల సృష్టి జరుగుతుందని, రైతులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలులకు కొత్త అవకాశాలు వస్తాయని ప్రధానమంత్రి నరేంద్రమోదీ వ్యాఖ్యానించారు. తొలిదశ ఒప్పందంపై సంతకాలు జరగడానికి ముందుగా మధ్యంతర ఒప్పందానికి మౌలిక నిబంధనల వ్యవస్థను ఖరారు చేస్తూ ఒక సంయుక్త ప్రకటన విడుదలయ్యాక మోదీ వ్యాఖ్యానిస్తూ, భారత్–అమెరికా మధ్య బంధం బలంగా వేళ్ళూనుకోవడానికి వ్యక్తిగతంగా ఎంతో చిత్తశుద్ధి ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. 'భారతదేశానికి, అమెరికాకు ఇదెంతో గొప్పవార్త! మధ్యంతర ఒప్పందంపై మౌలిక నిబంధనల వ్యవస్థను ఏర్పాటు చేస్తూ మేం ఒక అంగీకారానికి వచ్చాం, రెండు గొప్ప దేశాలమధ్య ఈ ఒప్పందం జరిగింది' అని ఎక్స్ వేదికగా మోదీ పోస్టింగ్ పెట్టారు. ఈ మౌలిక నిబంధనలు భారతదేశ వృద్ధిని మరింత లోతుల్లోకి విస్తరిస్తాయి, రెండు దేశాల భాగస్వామ్యంలో ఒక సరికొత్త చలనశీలత వస్తుందని పేర్కొన్నారు. 'ఈ ఒప్పందం మేక్ ఇన్ ఇండియాను చాలా దృఢపరుస్తుంది, దేశంలో తయారైన వస్తువులకు కొత్త మార్కెట్ లభిస్తుంది, కొత్త అవకాశాలు వస్తాయి, భారతదేశ రైతులు ఎంతో కష్టపడి శ్రమిస్తారు, వారికి ఇంకా మంచి అవకాశాలు వస్తాయి, సూక్ష్మ ,చిన్న, మధ్యతరహా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు కొత్త బాటలు పరుచుకుంటాయి, అంకుర సంస్థలకు చెందిన నవకల్పనలకు, నవీన ఆవిష్కరణలకు కొత్త అవకాశాలు వస్తాయి, జాలరులకు మరిన్ని అవకాశాలు పెరుగుతాయి' అని మోదీ తన పోస్టింగ్‌లో పేర్కొన్నారు.

## భారత ఎగుమతిదారులకు 30 ట్రిలియన్ డాలర్ల మార్కెట్

భారత ఎగుమతి దారులకు ఈ మధ్యంతర ఒప్పందం వల్ల 30 ట్రిలియన్ డాలర్ల మార్కెట్‌కు అవకాశాలు తెరచుకుంటాయని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖామంత్రి పీయూశ్ గోయల్ చెప్పారు. ప్రత్యేకించి సూక్ష్మ ,చిన్న,మధ్యతరహా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు, రైతులు, జాలరులకు ఈ ఎగుమతి అవకాశాలు పెరుగుతాయన్నారు. అదేవిధంగా భారత ఉత్పత్తులపై అమెరికా విధించే సుంకాలు 50 శాతం నుండి 18 శాతానికి తగ్గిపోతాయన్నారు. రష్యా నుండి చమురు దిగుమతి సమస్య గురించి ప్రశ్నించగా, ఈ విషయంపై విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ ప్రతిస్పందిస్తుందని తాను మాట్లాడబోనని చెప్పారు. దేశంలో శ్రామికులు, నైపుణ్యంగల కార్మికులు చాలా ఎక్కువగా పనిచేసే టెక్స్‌టైల్స్, రెడీమేడ్ దుస్తులు, తోలు ఉత్పత్తులు, చెప్పులు, ప్లాస్టిక్, రబ్బరు, సేంద్రీయ రసాయనాలు, గృహోపకరణాలు, హస్తకళా ఉత్పత్తు, కొన్ని యంత్రాలకు మంచి గిరాకీ పెరగుతుందని, వాటికి కొత్త మార్కెట్ అందుబాటులోకి వస్తుందని చెప్పారు. అదనంగా సుంకాలు కూడా విస్తారమైన వస్తువులపై శూన్యస్థానానికి చేరుకుంటాయని, సుంకాల వసూళ్ళే ఉండవని చెప్పారు. వీటిలో జనరిక్ ఫార్మాస్యూటికల్స్, రత్నాలు, వజ్రాలు, ఎయిర్‌క్రాఫ్ట్ విడిభాగాలు వంటివన్నీ ఉన్నాయని చెప్పారు. 232వ సెక్షన్ కింద భారతదేశానికి ఎయిర్‌క్రాఫ్ట్ విడిభాగాలపై మినహాయింపులు లభించాయని, ఆటో విడిభాగాలపై టారిఫ్ రేటు కోటా గురించి సంపప్రదింపులు చేశామని, మంచిస్థాయిలో ఎగుమతులకు అవకాశాలు వచ్చాయన్నారు. అదేసమయంలో భారతదేశ రైతుల ప్రయోజనాలు కాపాడేందుకు, వారికి రక్షణలు కల్పించేందుకు కూడా కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు.

అమెరికా వాణిజ్య ప్రతినిధి జమైసన్ గ్రీర్ ఈ ఒప్పందంపై ప్రశంసలు కురిపించారు.

## మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పర్యవేక్షణ కమిటీ ఏర్పాటు

● టిపిసిసి అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్ గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికలను పర్యవేక్షించేందుకు ఎఐసిసి ఆదేశాల మేరకు 'ఎన్నికల పర్యవేక్షణ కమిటీ'ని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టిపిసిసి) ఏర్పాటు చేసింది. టిపిసిసి సీనియర్ నాయకులు కటకం మృత్యుంజయం చైర్మన్‌గా, కన్వీనర్లుగా ఎం.సునీత ముదిరాజ్, యడవల్లి వెంకటస్వామి, మిద్దెల జితేందర్, సభ్యులుగా ఎ.సదాలక్ష్మి, జువ్వాడి ఇందిరారావు, ప్రియాంక కామెల్, దుర్గం భాస్కర్, బిజ్జి శత్రు రావు, ఎస్తార్ రాణి, మచ్చ వరలక్ష్మి, మహమ్మద్ ఇర్ఫాన్ అలీ, పత్తి కుమార్, కోట్య నాయక్‌లను నియమించినట్లు టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్ గౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

## 12న దేశవ్యాప్త సమ్మెలో ఆర్‌టిసి కార్మికులు పాల్గొనాలి

● టిజిఎస్ ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ పిలుపు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సెంట్రల్ ట్రేడ్ యూనియన్ల పిలుపు మేరకు ఈ నెల 12న దేశవ్యాప్త సమ్మెలో ఆర్‌టిసి కార్మికులు కూడా పాల్గొనాలని ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ పిలుపునిచ్చింది. ఇందుకు సంబంధించి ఆర్‌టిసి యాజమాన్యానికి జనవరి 27న సమ్మె నోటీసు కూడా అందజేశామని యూనియన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్.బాబు, ఈదురు వెంకన్న తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆర్‌టిసి కార్మికులు ఈ సమ్మెలో పాల్గొనాలని వారు కోరారు. కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను మార్చి 4 లేబర్ కోడ్‌లుగా తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నదని, దీన్ని కార్మికవర్గం తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. 4 కోడ్‌లు అమలైతే కార్మికుల హక్కులని హరించబడుతాయన్నారు. కోడ్‌లలో ఉన్న సెక్షన్లను యాజమాన్యాలకు అనుకూలంగా మార్చటం వల్ల కార్మిక వర్గాన్ని శ్రమ దోపిడీకి గురి కానుందని తెలిపారు. ప్రభుత్వరంగసంస్థల్లో పెట్టుబడుల వాటాలను ఉపసంహరించుకోవడంతో ఆ సంస్థలు కుదేలయ్యే పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయాలని గత ప్రభుత్వం జీవో జారీ చేసినా, నేటివరకు ఉద్యోగుల విలీనం పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉందన్నారు. 12న జరగబోయే దేశవ్యాప్త సమ్మెలో యూనియన్ల కతీతంగా కార్మికులందరూ పాల్గొంటూ సమ్మెను జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు.

# కమ్యూనిస్టుల గెలుపు - అభివృద్ధికి మలుపు



● సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డా.కె.నారాయణ

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం/పాల్వంచ :** కొత్తగూడెం కార్పొరేషన్ ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థులను గెలిపించడం ద్వారా కార్పొరేషన్ అభివృద్ధి శరవేగంగా జరుగుతుందని, సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డా.కె.నారాయణ తెలిపారు. కొత్తగూడెం కార్పోరేషన్ ఎన్నికల్లో భాగంగా ఆయన శనివారం రామవరంలోని 6 డివిజన్లు, బర్మాక్యాంపు, ప్యూన్‌బస్తీ, పాత కొత్తగూడెం ఏరియాల్లోని డివిజన్లలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు భాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషాతో కలిసి రోడ్‌షోలు, బస్తీ కార్నర్ మీటింగ్‌లలో పాల్గొన్నారు. ఆయా ప్రాంతాల్లో ప్రజలు ఎర్రజెండాలతో ఎదురేగి పెద్ద ఎత్తున హారతులు పట్టారు. 'సిపిఐ జిందాబాద్', 'ఎర్రజెండా వర్ధిల్లాలి' అంటూ నినాదాలు చేయడంతో పాటు పలువురు మహిళలు విజిల్స్ వేస్తూ, డప్పు వాయిద్యాల నడుమ నృత్యాలు చేస్తూ ప్రచారాన్ని ఉర్రూతలూగించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సిపిఐ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించడం ద్వారానే పాల్వంచతో కలిపి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయడం జరిగిందనే విషయాన్ని ఓటర్లకు గుర్తు చేశారు. మూడు దశాబ్దాలుగా ఎన్నికలు జరగని, పాల్వంచకు ఎన్నికలు జరిపించడమే కాకుండా కొత్తగూడెంను కార్పొరేషన్‌గా మార్చిన ఘనత సిపిఐదే అన్నారు. కార్పొరేషన్ ఎన్నికల వేళ ఊరు పేరు, అడ్రస్ లేని గుంట నక్కలు ఓట్ల కోసం వస్తున్నాయని, అలాంటి వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. స్థానిక సిపిఐ నేతలే కార్పొరేషన్ ఎన్నికల్లో నిలబడ్డారని, మన వారు, మనతో నిత్యం ఉండే వారిని గెలిపించుకోవడం అంటే మనల్ని మనం గెలిపించుకున్నట్లే అన్నారు. కమ్యూనిస్టులు అధికారం ఉన్నా లేకున్నా పేదలు, బడుగు బలహీన వర్గాలు, కార్మికులు, కర్షకుల వెంట ఉంటూ వారి సమస్యల కోసం పోరాటాలు చేస్తారని గుర్తు చేశారు. అనంతరం సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు భాగం హేమంతరావు మాట్లాడుతూ కార్పొరేషన్ ఎన్నికల్లో సిపిఐ, టిడిపి ప్రజా సంఘాల పోరాటం సత్ఫలితం దిశగా దూసుకుపోతున్నదని, ఈ కార్పొరేషన్ ఎన్నికల్లో సిపిఐ ఘన విజయం సాధించి ఎర్ర జెండా ఎగురవేయడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమాల్లో సిపిఐ జిల్లా నాయకులు కంచర్ల జమలయ్య, సలిగంటి శ్రీనివాస రావు, దుర్గరాశి వెంకటేశ్వర్లు, ఎస్‌కే ఫహీమ్, జీ.వీరస్వామి, వాసిరెడ్డి మురళీ, వై.ఉదయ్ భాస్కర్, కందుల భాస్కర్, జిల్లా సమితి సభ్యులు మునిగడప వెంకటేశ్వర్లు, విద్యానగర్ గ్రామపంచాయితీ సర్పంచ్ భూక్యా శాంతి ప్రియ, తదితరులు పాల్గొన్నారు.

## కల్లబొల్లి మాటలు చెప్పేవాడిని కాను

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



'కల్లబొల్లి మాటలతో పబ్బం గడుపుకొనే వాడిని కాను నేను మీ వాడిని. మీకు అందుబాటులో ఉండేవాడిని నేను, నన్ను ఆశీర్వదించండి. పాల్వంచ అభివృద్ధి సిపిఐతోనే సాధ్యం' అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మున్సిపల్ ఎన్నికలలో కంకి కొడవలి గుర్తుపై ఓట్లేసి తెలుగుదేశం, సిపిఐలు బలపరిచిన ఉమ్మడి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించి మరింత ఆత్మస్థైర్యాన్ని కలిగించాలని ఆయన కోరారు. కొత్తగూడెం మున్సిపాలిటీ కార్పొరేషన్ పాల్వంచ డివిజన్‌లో సిపిఐ, తెలుగుదేశం పార్టీల ఉమ్మడి అభ్యర్థులైన అడుసుమిల్లి సాయిబాబ, మడకం కమల, వల్లపు లలిత కుమారి, పగిడపల్లి ఆదిలక్ష్మి, గుగులోత్ కల్పన, భట్టు విజయ, ఏ.ప్రసాద్, నామా కీర్తి, జి.వెంకటేష్, బి.శారద, రావుల స్వాతి, ఉప్పుశెట్టి రాహుల్‌ల గెలుపును కాంక్షిస్తూ శనివారం పాల్వంచలోని 40, 37, 01, 02, 03, 04, 05, 06, 07, 43, 35, 34 తదితర డివిజన్‌ల పరిధి రాంనగర్, మార్కెట్ ఏరియా, శాస్త్రీరోడ్, ఎంజి రోడ్, బ్రాహ్మణ బజార్, రాజీవ్‌గాంధీ మార్కెట్ ఏరియా, సీతారామపట్నం, మారుతీ నగర్, ప్రియదర్శిని కాలనీ, బొల్లోరుగూడెం, కేఎస్‌పి రోడ్, కేటిపిఎస్ అంబేద్కర్ సెంటర్, ప్రశాంత్ నగర్, యాష్ కాలనీ, ఇంటర్ మీడియెట్ కాలనీ, ఏ కాలనీ, హమాలి కాలని, జయమ్మ కాలని, కాంట్రాక్టర్స్ కాలనీ, ఇందిరా కాలనీ, వెంగళరావు కాలని, నెహ్రూనగర్, దమ్మపేట సెంటర్‌లలో శనివారం జోరుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యకర్తలు, అభిమానులు ఎర్రజెండాలు, పసుపు జెండాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. దీనితో పట్టణం ఎరుపు, పసుపు వర్ణాలతో కళకళలాడింది. అంబేద్కర్ సెంటర్ నుండి ప్రారంభమైన ర్యాలీ, పోలీస్ పెట్రోల్ బంక్, నటరాజ్ సెంటర్, శాస్త్రీరోడ్ మీదుగా బొల్లోరుగూడెం నుండి ప్రశాంత్‌నగర్ కాలనీ వరకు సాగింది. కూనంనేని మాట్లాడుతూ.. సైనిక్ స్కూల్, కేంద్రీయ విశ్వవిద్యాలయాల స్థాపన, ఎన్ఎండిసి పునరుద్ధరణ కోసం ప్రయత్నాలు చేస్తున్నామని అన్నారు. డివిజన్‌లలో నెలకొన్న పలు సమస్యలు ఎమ్మెల్యే కూనంనేని సహకారంతో పరిష్కరిస్తామని పోటీ చేస్తున్న టిడిపి, సిపిఐ అభ్యర్థులు అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ముత్యాల విశ్వనాథం, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## కార్మికుల హక్కులను కాలరాస్తున్న లేబర్ కోడ్స్



● తెలంగాణ మున్సిపల్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఏసురత్నం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కార్మికుల శ్రమ దోపిడీకి చట్టబద్ధత కల్పించేందుకే మోదీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందని తెలంగాణ మున్సిపల్ స్టాఫ్ అండ్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఏసురత్నం తీవ్రంగా విమర్శించారు. కార్మికుల ఉద్యోగ భద్రతను పూర్తిగా హరించి, యజమానుల ఇష్టారాజ్యానికి తలుపులు తెరవడమే లేబర్ కోడ్‌ల అసలు ఉద్దేశమన్నారు. ట్యాంక్ బండ్ లిబర్టీ ఎఐటియుసి కార్యాలయంలో వాల్ పోస్టర్‌లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏసురత్నం మాట్లాడుతూ కార్మికులు రక్తం కార్చి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో లేబర్ కోడ్‌లను అమలు చేయడం ద్వారా కార్మికులను నిర్బంధిత బానిసలుగా మార్చే కుట్ర జరుగుతోందని మండిపడ్డారు. లేబర్ కోడ్‌లు అమల్లోకి వస్తే ఉద్యోగ భద్రత పూర్తిగా లేకుండా పోతుందని, జీతాల పెంపు, పని గంటల పరిమితి, కార్మిక హక్కుల రక్షణ వంటి అంశాలు నిర్వీర్యమవుతాయని ఏసురత్నం హెచ్చరించారు. ఇవి పెద్ద కార్పొరేట్ సంస్థలు, ఆర్థిక నేరగాళ్లకు లాభపడేలా రూపొందించారన్నారు. దీని ప్రభావంతో ప్రజల కొనుగోలు శక్తి తగ్గి దేశ ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుందన్నారు. రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు వ్యాపారాల్లోకి దిగిన తరువాతే కార్మిక వ్యతిరేక చట్టాలు పుట్టుకొస్తున్నాయని ఆయన విమర్శించారు. లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేసే వరకు కార్మిక ఉద్యమం ఆగదని, అవసరమైతే మరింత ఉధృతంగా పోరాటం చేస్తామన్నారు. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 12న దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను కార్మికులంతా ఏకమై జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మున్సిపల్ సంఘం రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి, హైదరాబాద్ జిల్లా ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కమతం యాదగిరి, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ సంఘం అధ్యక్షుడు కె.రవికిశోర్, ప్రధాన కార్యదర్శి ఎం.శివకుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.జయకిశోర్, కోశాధికారి మహేష్ కుమార్, బాలకృష్ణ, ఉపాధ్యక్షుడు బండారి శ్రీకాంత్, పోచయ్య, ఖాలీద్ పాల్గొన్నారు.

## వాతావరణ మార్పులపై అవగాహన పెంపొందించడంలో ఈపిటిఆర్ఐది కీలకపాత్ర

● రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ, వాతావరణ మార్పులపై అవగాహన పెంపొందించడంలో ఈపిటిఆర్ఐ కీలక పాత్ర పోషించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు అన్నారు. పర్యావరణ మార్పులపై పరిశోధన, ఇంటర్న్‌షిప్ కార్యక్రమాలు, పర్యావరణ పరిరక్షణపై అవగాహన తరగతులు, జెఎన్‌టియు, ఉస్మానియా యూనివర్సిటీలలో విద్యార్థులతో అవగాహన కార్యక్రమాలు, పబ్లికేషన్స్ ప్రచురణలు మరింత బలోపేతం చేయాలని అధికారులకు సూచించారు. ఈపిటిఆర్ఐ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ సమావేశం శనివారం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో జరిగింది. ఈ సమావేశానికి బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ చైర్మన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ రాష్ట్రంలో పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ, వాతావరణ మార్పులపై అవగాహన పెంపొందించడంలో ఈపిటిఆర్ఐ పరిశోధన, శిక్షణ, సామర్థ్య వృద్ధి కార్యక్రమాలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. ఈపిటిఆర్ఐ ద్వారా అమలవుతున్న ప్రస్తుత కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలు, శిక్షణా కార్యక్రమాలు, పరిశోధన ప్రాజెక్టులు, మానవ వనరుల అభివృద్ధి, ఆర్థిక అంశాలపై బోర్డ్ సభ్యులతో విస్తృతంగా చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు అనుగుణంగా పర్యావరణ అనుకూల కార్యక్రమాలను వేగవంతం చేయాలని, వివిధ శాఖలతో సమన్వయం పెంచాలని ఆయన సూచించారు. పరిశ్రమలు, పట్టణాభివృద్ధి, ఘన వ్యర్థాల నిర్వహణ, నీటి, వాయు కాలుష్య నియంత్రణ, పచ్చదనం పెంపకం వంటి అంశాల్లో ఈపిటిఆర్ఐ మరింత చురుకైన పాత్ర పోషించాలని సమావేశంలో చర్చించారు. నూతన సాంకేతిక పరిజ్ఞానం వినియోగంతో పర్యావరణ పరిరక్షణ చర్యలను సమర్థవంతంగా అమలు చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో రాష్ట్ర అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శి టి.కె.శ్రీదేవి, బోర్డ్ సభ్యులు, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్ర బడ్జెట్‌లో ఆర్‌టిసికి రూ.10 వేల కోట్లు కేటాయించాలి

● బోర్డు మాజీ డైరెక్టర్ ఎం.నాగేశ్వరరావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర బడ్జెట్‌లో ఆర్‌టిసికి రూ.10 వేల కోట్లు కేటాయించాలని ఆర్‌టిసి బోర్డు మాజీ డైరెక్టర్ ఎం.నాగేశ్వరరావు అన్నారు. ప్రభుత్వానికి ప్రతిష్ట తెచ్చిన మహాలక్ష్మి పథకం రీయింబర్స్‌మెంట్‌తో పాటు లక్షలాది విద్యార్థులు, జర్నలిస్టులు, ఉద్యోగులతో సహా ఇతర వర్గాలు బస్‌పాస్ రియింబర్స్‌మెంట్ కొరకు, పెరిగిన లక్షల మహిళ ప్రయాణికుల సౌకర్యార్థం కొత్త బస్సుల కొనుగోళ్లకు 2026— 27 బడ్జెట్‌లో ఆర్‌టిసికి కనీసంగా రూ. 10 వేల కోట్లు కేటాయించాలని ఎం.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## పరేడ్ ప్రతినిధులకు గవర్నర్ అభినందనలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రిపబ్లిక్ డే పరేడ్ 2026లో న్యూఢిల్లీ వేదికగా తెలంగాణ రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించిన నేషనల్ క్యాడెట్ కారప్స్ (ఎన్‌సిసి) అధికారులు, క్యాడెట్లను గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అభినందించారు. శనివారం లోక్ భవన్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన వారికి సత్కారం నిర్వహించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, యువతలో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యతను పెంపొందించడంలో ఎన్‌సిసి కీలకపాత్ర పోషిస్తోందని ప్రశంసించారు. ఎన్‌సిసి శిక్షణ శిబిరాలు విద్యార్థులను బాధ్యతాయుతమైన, అవగాహన కలిగిన పౌరులుగా తీర్చిదిద్దుతాయని పేర్కొన్నారు.

## కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

● ఫిబ్రవరి 12న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొనాలి

● ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ పిలుపు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 12న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ పిలుపునిచ్చారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డ్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం పికెట్ గార్డెన్‌లో సమ్మె పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నరసింహ మాట్లాడుతూ కంటోన్మెంట్ బోర్డులో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనంగా రూ.26,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఐరన్ ఫైర్ సిస్టంను వెంటనే తొలగించాలని, కార్మికులకు బోనస్, పండగ సెలవులు, జాతీయ, ఆర్జిత సెలవులు అమలు చేయాలని కోరారు. కార్మికుల శ్రమను దోపిడీ చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందని తెలిపారు. వాటికి వ్యతిరేకంగా కార్మిక వర్గం పోరాటాలకు సిద్ధం కావాల్సిన సమయం వచ్చిందన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానాన్ని రద్దు చేసి, కొత్త చట్టాల ద్వారా 12 గంటల పని విధానాన్ని అమలు చేయడం తీవ్రమైన అన్యాయమని విమర్శించారు. లేబర్ కోడ్‌లు కార్మికుల సమ్మె హక్కును, యూనియన్లు ఏర్పాటు చేసుకునే హక్కును హరించే విధంగా ఉన్నాయని, ఇలాంటి చట్టాలను కార్మిక వర్గం ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించదని నరసింహ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డుకు చెందిన కాంట్రాక్ట్ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని, కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని, బోనస్ చెల్లించాలని, పండగలు, జాతీయ, ఆర్జిత సెలవులు అమలు చేయాలని నినాదాలు చేశారు.

## కార్పొరేట్ విద్యాసంస్థలకు పోలీసుల ప్రచారమా?

అశోక్ పవార్‌పై చర్యలు తీసుకోవాలి : ఎఐవైఎఫ్ డిమాండ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల ప్రయోజనాల కోసం పోలీసు వ్యవస్థను వాడుకోవడంపై అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఫిట్జీ విద్యాసంస్థకు ప్రచారం నిర్వహించిన పోలీస్ అధికారి అశోక్ పవార్‌పై తక్షణమే విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర సమితి బృందం అడిషనల్ డిజిపి మహేష్ భగవత్‌కు ఫిర్యాదు చేసింది.

**ప్రభుత్వ హోదాను వ్యాపారాలకు వాడుకోవడం సిగ్గుచేటు**

ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రీ, కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీస్ శాఖను వ్యాపార కేంద్రాలుగా మార్చడం గర్హనీయమన్నారు. ప్రభుత్వ హోదాలో ఉండి ప్రైవేట్ విద్యాసంస్థలకు ప్రచారం చేయడం చట్టవిరుద్ధమని, ఇది ప్రభుత్వ ఉద్యోగుల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించడమేనని వారు విమర్శించారు. ప్రజల రక్షణ కోసం ఉన్న పోలీస్ యంత్రాంగాన్ని విద్యా మాఫియాకు అనుకూలంగా మార్చడం ప్రజాస్వామ్య విలువలపై దాడి అని ఆవేదన వ్యక్తం చేశారు.

**ప్రజా విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసే కుట్ర..**

'పోలీస్ అధికారులు ముందుండి ప్రచారం చేయడం వల్ల తల్లిదండ్రులు భయాందోళనలకు గురై, ఒత్తిడితో కార్పొరేట్ సంస్థల వైపు వెళ్లే అవకాశం ఉంది. ఇది ప్రభుత్వ పాఠశాలలను నిర్లక్ష్యం చేస్తూ, ప్రైవేట్ సంస్థలను లాభపడటానికి చేసే కుట్ర' అని వారు అభివర్ణించారు. పోలీస్ అధికారి అశోక్ పవార్‌పై తక్షణమే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన ఫిట్జీ యాజమాన్యంపై చట్టపరమైన విచారణ జరపాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పాఠశాల విద్యా శాఖ పర్యవేక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు శ్రీమాన్, రాష్ట్ర సమితి సభ్యులు కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు ఆర్‌టిసి భరోసా

● ఉచిత ప్రమాద బీమా ద్వారా ఒక్కో కుటుంబానికి రూ.కోటి ఆర్థిక సహాయం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రోడ్డు ప్రమాదంలో మరణించిన ఉద్యోగులకు కుటుంబానికి టిజిఎస్ ఆర్‌టిసి అండగా నిలిచింది. ప్రమాదవశాత్తు అకాల మృత్యువు వెంటాడిన ఇద్దరు డ్రైవర్స్ కుటుంబాలకు ఆర్థికసాయాన్ని అందించి భరోసా కల్పించింది. కుషాయిగూడ, ఉప్పల్ డిపోలకు చెందిన డ్రైవర్స్ వెంకటేశ్, డి.ఆర్.గౌడ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ ఆపద సమయంలో యూబీఐ సూపర్ శాలరీ సేవింగ్ అకౌంట్ బాధిత కుటుంబాలకు అక్కరకొచ్చింది. ఆర్థిక ప్రయోజనంతో కూడిన సూపర్ సాలరీ సేవింగ్ అకౌంట్ కలిగి ఉండటంతో ఉచిత ప్రమాద బీమా పథకం వర్తించింది. సంస్థలోని ఉద్యోగులందరూ వారు నివసిస్తున్న ప్రాంతాల్లోని యూబీఐ బ్రాంచీల్లో సంస్థ సూచించిన ఖాతాను తెరిచి రూపే కార్డులను తీసుకున్నారు. ఈ ఖాతా ద్వారా ఉచిత ప్రమాద బీమా సౌకర్యం ఉండటంతో ఉద్యోగులకు ఎంతో ఆర్థిక ప్రయోజనం చేకూరుతోంది. ప్రమాదాలు జరిగిన సమయంలో సూపర్ సాలరీ సేవింగ్ అకౌంట్ కింద యూబీఐ రూ. కోటి అందజేస్తోంది. ఈ మేరకు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఇద్దరు బాధిత కుటుంబాలు ఒక్కొక్కరికి రూ. కోటి విలువైన చెక్కులను యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇ.డి అమ్రేష్ ప్రసాద్, ఆర్‌టిసి ఎండి వై.నాగిరెడ్డి, శనివారం బస్‌భవన్‌లో అందజేశారు. ఈ సందర్భంగా ఎండి నాగిరెడ్డి మాట్లాడుతూ.. వేరు వేరు సమయాలలో జరిగిన ఈ రోడ్డు ప్రమాద ఘటనలో కుషాయిగూడ డిపో, ఉప్పల్ డిపోకు చెందిన ఇద్దరు డ్రైవర్లు మరణించడం విచారకరమన్నారు. తమ తప్పు ఏమీ లేకపోయినా రోడ్డు ప్రమాదంలో డ్రైవర్స్ అకాల మరణం చెందటం దురదృష్టకరమన్నారు. ఉద్యోగుల సంక్షేమానికి సంస్థ అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు గుర్తు చేశారు. కుటుంబ సభ్యులకు సంస్థ అండగా నిలుస్తుందని, ఆత్మ స్థైర్యం, ధైర్యం కోల్పోకుండా ఉండేందుకు బాధిత కుటుంబానికి ఉచిత ప్రమాద బీమా సౌకర్యం ఎంతో ఉపకరిస్తుందన్నారు. కొన్ని పథకాలు ఆపద సమయంలో అక్కరకు వస్తాయని, ఇందుకు ఇదే ఉదాహరణ అని, వాటిని వినియోగించుకోవడంలో ఎట్టి పరిస్థితుల్లోనూ అలసత్వం వహించకూడదని సూచించారు. ఈ అవకాశాన్ని కల్పించిన యూబీఐకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు మునిశేఖర్, వెంకన్న, ఫైనాన్స్ అడ్వైజర్ పుష్పకుమారి, సిపిఎం ఉషాదేవి, యూబీఐ అధికారులు చీఫ్ జనరల్ మేనేజర్ ఎం.రవీంద్రబాబు, డిప్యూటీ జనరల్ మేనేజర్ బి.భాస్కర్, ఆర్.సత్యనారాయణ, ఇతర అధికారులు గోపాలకృష్ణ, రజనీష్ కుమార్ పాండే తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ మార్షల్స్‌కు... రూ.లక్ష ప్రమాద బీమా

● సైబరాబాద్ సిపి డాక్టర్ ఎం.రమేష్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ట్రాఫిక్ నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తున్న ట్రాఫిక్ మార్షల్స్ భద్రతకు పెద్దపీట వేస్తున్నట్లు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం.రమేష్ తెలిపారు. ట్రాఫిక్ మార్షల్స్‌కు రూ.లక్ష ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పిస్తున్నామని సిపి ప్రకటించారు. ఈ మేరకు సైబరాబాద్ కమిషనరేట్‌లో జరిగిన కార్యక్రమంలో ట్రాఫిక్ మార్షల్స్‌కు ఇన్సూరెన్స్ కార్డులను సిపి రమేష్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రాఫిక్ నిబంధనల అమలులో ట్రాఫిక్ మార్షల్స్ పోలీసులతో సమానంగా బాధ్యతలను నిర్వహిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో స్కోర్ 10 చైర్మన్ నారాయణ స్వరూప్, మాదాపూర్ ట్రాఫిక్ డిసిపి రంజన్‌రతన్‌కుమార్, సిఎఆర్ హెడ్‌క్వార్టర్స్ డిసిపి సంజీవ్, ఎడిసిపి హనుమంత రావు, ఎస్‌సీఎస్‌సీ సీఈఓ నవేద్‌ఖాన్ పాల్గొన్నారు.

## భారత జట్టుకు మంత్రుల అభినందనలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అండర్–19 క్రికెట్ ప్రపంచకప్‌లో విజేతలుగా నిలిచిన భారత పురుషుల జట్టుకు యువజన సర్వీసులు శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ఐటి శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావులు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. యువ ఆటగాళ్లు ప్రదర్శించిన ప్రతిభ, క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తి దేశానికి గర్వకారణమని మంత్రి పేర్కొన్నారు. ఈ ఘన విజయం దేశ యువతకు స్ఫూర్తినిస్తుందని ఆయన అన్నారు.

GHMC గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్
పటాన్‌చెరు సర్కిల్-46, శేరిలింగంపల్లి జోన్.
షార్ట్ టెండర్ నోటీసు నెం. Engg-32/GHMC/PTC-C-46/2025-26, తేది: 05.02.2026
NIT No. Engg-32/GHMC/PTC-C-46/2025-26, తేది: 05.02.2026, పని పేరు: 4 పనులు, రంజాన్ పండుగ ఏర్పాట్లు. అంచనా విలువ/ఇసివి: రూ.10.48లక్షలు, డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 07.02.2026న ఉ.10.30గం.ల నుండి, బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం: 13.02.2026న మ.3.00గం.ల వరకు, అధికారి పేరు & చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, పటాన్‌చెరు సర్కిల్-46. సెల్ నెం. 9154167950. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @https://www.tender.telangana.gov.inలో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, పటాన్‌చెరు సర్కిల్-46, ఎస్ఎల్‌పి జోన్, జిహెచ్ఎంసి.
DIPR R.O. No. : 15086-PP/CL/ADVT/1/2025-26, Date: 07-02-2026



## రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన ఘనుడు కెసిఆర్

ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కెతావత్ శంకర్‌నాయక్

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పదేండ్ల పాటు రాష్ట్రాన్ని పరిపాలించిన కేసీఆర్ అప్పుల పాలు చేశారని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కెతావత్ శంకర్‌నాయక్ ఆరోపించారు. శనివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా 42, 43, 44, 48, 27, 28, 24 వార్డుల అభ్యర్థుల గెలుపుకు విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు వాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను చక్కదిద్దుతూ ఇచ్చిన వాగ్ధానాలను దశలవారీగా అమలు జరుపుతూ ప్రజా మన్ననలను పొందుతున్నామన్నారు. ప్రజా ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్‌కే అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో ఆయా వార్డుల అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజాసమస్యలపై పోరాడే జెల్లా ధనమ్మ శ్రీనివాస్‌కి పట్టం కట్టండి

సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రావణ్ కుమార్



**ప్రజాపక్షం/చండూరు:** చండూరు మున్సిపాలిటీలోని 4వ వార్డులో కాంగ్రెస్ బలపర్చిన సిపిఐ అభ్యర్థి జెల్లా ధనమ్మశ్రీనివాస్ కంకి కొడవలి గుర్తుపై ఓటువేసి గెలిపించాలని సిపిఐ నల్గొండ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రావణ్ కుమార్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. శనివారం 4వ వార్డులో సిపిఐ ,కాంగ్రెస్ నాయకులతో కలిసి ముమ్మరంగా ఇంటింటి ప్రచారం నిర్వహించి సిపిఐ అభ్యర్థి జెల్లా ధనమ్మశ్రీనివాస్‌ను గెలిపిస్తే ప్రభుత్వ సహకారంతో వార్డును అబివృద్ధి చేస్తారని ఓటర్లను అన్నారు. వార్డు అభివృద్ధి ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిజాయితిపరులైన జెల్లా ధనమ్మశ్రీనివాస్ కంకికొడవలి గుర్తుపై అత్యధిక ఓటర్లు వేసి భారీమెజార్టీతో గెలిపించుకోవాలని ఆయన ఓటర్లను కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నల్పరాజు రామలింగయ్య , సిపిఐ చండూరు మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్, సిపిఐ జిల్లా సమితి సభ్యుడు తిప్పర్తి రాములు, మండల పార్టీ సహాయ కార్యదర్శులు పల్లె యాదయ్య, బొడ్డు వెంకటేశ్వర్లు, మండల కార్యవర్గ సభ్యులు బరిగెల వెంకటేశ్ , దోటి వెంకన్న,సిహెచ్ ఊషయ్య పాల్గొన్నారు.

## విద్యార్థినితో అసభ్య ప్రవర్తన

ఉపాధ్యాయుడికి దేహశుద్ధి

**ప్రజాపక్షం/చింతపల్లి** : ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించిన ప్రభుత్వ ఉపాధ్యాయుడికి దేహశుద్ధి చేసిన ఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. మండల పరిధిలోని గొడకొండ్ల వెంకటేశ్వరనగర్ ప్రాథమిక పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్న ఓ విద్యార్థినితో అదే పాఠశాల ఉపాధ్యాయుడు అసభ్యంగా ప్రవర్తించాడని ఆరోపిస్తూ విద్యార్థిని తల్లిదండ్రులు, గ్రామస్తులు శనివారం పాఠశాలకు వెళ్లి సదరు ఉపాధ్యాయుడిని నిలదీశారు. అభం శుభం తెలియని చిన్నారి విద్యార్థినితో ఉపాధ్యాయుడు అసభ్యంగా ప్రవర్తించాడనే విషయాన్ని తట్టుకోలేక విద్యార్థిని తల్లిదండ్రులు, గ్రామస్తులు ఉపాధ్యాయుడికి దేహశుద్ధి చేశారు. ఈ విషయంపై మండల విద్యాధికారి అంజయ్య వివరణ కోరగా ఇప్పటికే ఉపాధ్యాయుడిని జిల్లా విద్యాధికారి సస్పెండ్ చేయడం జరిగిందని, అదే విధంగా విచారణ జరిపి పూర్తి నివేదికను జిల్లా విద్యాధికారికి అందజేస్తానని ఆయన తెలిపారు.

## చెరువుగట్టు జాతర హుండీ ఆదాయం లెక్కింపు

**ప్రజాపక్షం/నార్కట్ పల్లి** : మండలంలోని చెరువుగట్టు శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించిన అనంతరం ఉండి లెక్కింపు కార్యక్రమం చేపట్టారు. వారం రోజులపాటు ఘనంగా నిర్వహించిన స్వామివారి బ్రహ్మోత్సవాలలో స్వామి,అమ్మవార్లకు భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా రూ.26,14,237 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి సల్వాది మోహన్ బాబు తెలిపారు.అదేవిధంగా అన్నదానం ద్వారా రూ.46,739 వచ్చినట్లు తెలిపారు. ఇట్టి ఆదాయం గత సంవత్సర బ్రహ్మోత్సవాల ఆదాయంతో పోల్చి చూడగా తొమ్మిది లక్షలు అధికంగా వచ్చినట్లు వివరించారు.హుండి లెక్కింపు కార్యక్రమంలో దేవాదాయ శాఖ అధికారి కే భాస్కర్, స్థానిక సర్పంచ్ నేతగాని కృష్ణ,ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ వారాల రమేష్,సేవా సమితి సభ్యులు,బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

## కోర్టు ప్రాంగణంలో ప్రథమ చికిత్స కేంద్రం, డిస్పెన్సరీ ఏర్పాటు

జిల్లా పోర్ట్ పోలియో జడ్జి జస్టిస్ టి మాధవి దేవి

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : కోర్టుకు వివిధ కేసుల కోసం హాజరయ్యే కక్షిదారులతో పాటు న్యాయవాదుల కొరకు జిల్లా కోర్టు ప్రాంగణంలో ప్రథమ చికిత్స కేంద్రం, డిస్పెన్సరీని ఏర్పాటు చేసినట్లు సూర్యాపేట జిల్లా పోర్ట్‌పోలియో జడ్జి జస్టిస్ టి మాధవిదేవి తెలిపారు. శనివారం కోర్టు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రథమ చికిత్స కేంద్రం, మెడికల్ డిస్పెన్సరీని జస్టిస్ టి మాధవి దేవి వర్చువల్‌గా ప్రారంభించి మాట్లాడారు. జిల్లా కోర్టులో వివిధ కేసులలో హాజరయ్యే కక్షిదారులతోపాటు న్యాయవాదులు, కోర్టు సిబ్బంది కొరకు కోర్టు ప్రాంగణంలో ప్రథమ చికిత్స కేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కేంద్రంలో ఒక డ్యూటీ డాక్టర్, ఒక స్టాఫ్ నర్స్ అందుబాటులో ఉంటారన్నారు. అత్యవసర చికిత్సతోపాటు దీనిలో 105 రకాల రక్తపరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి శనివారం ఫిజియోథెరపీ డాక్టర్ కూడా అందుబాటులో ఉంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మి శారద, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్‌పి కె నరసింహ, సీనియర్ సివిల్ జడ్జి పర్వీన్ కౌసల్, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎన్ అపూర్వ రవళి, రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి మంచాల మమతా, కోదాడ, తుంగతుర్తి, హుజూర్‌నగర్ న్యాయమూర్తులు, బార్‌అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



# అధికారంలో ఉన్న అభ్యర్థులను గెలిపిద్దాం

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తేనే అభివృద్ధి సాధ్యం





**ప్రజాపక్షం/నల్లగొండ:** అధికారంలో ఉన్న అభ్యర్థులను గెలిపిస్తే డివిజన్ అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతాయని రాష్ట్ర రోడ్లు భవనాల సినీమా ఫోటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. నల్లగొండ మున్సిపల్ కార్పొరేట్ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని 6 వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ అభ్యర్థి సునంద కరుణాకర్ రెడ్డిని, అదేవిధంగా ఏడవ డివిజన్లో అయిత గోని రాధా స్వామి ల ని గెలిపించాలని డివిజన్ పరిధిలోని ఏ ఆర్ నగర్, అబ్బాసియా కాలనీ,సాయి నగర్ నిర్వహించిన రోడ్ షో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తొ పాటు సిపిఐ రాష్ట్ర నాయకులు మల్లెపల్లి ఆదిరెడ్డి,సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి,పట్టణ కార్యదర్శి కర్ర సైదిరెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ లో రూ.2,200 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు వేగంగా ప్రగతి పథంలో ఉన్నాయని తెలిపారు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ నిధులతో మున్సిపల్ కార్పొరేషన్ ను మరింత అభివృద్ధి చేస్తానని అడుగుతారు పేర్కొన్నారు.నల్లగొండలో ప్రభుత్వ నిధులతో పాటు తన కుమారుడు ప్రతీక్ రెడ్డి జ్ఞాపకార్థం ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా కోట్లాది రూపాయలు వెచ్చించి విద్య, వైద్య సౌకర్యాలు కల్పించడం జరిగిందని తెలిపారు. రూ.8.50కోట్లతో కోమటిరెడ్డి ప్రతీక్ ప్రభుత్వ బొట్టుగూడ ఉన్నత పాఠశాలను కార్పొరేటర్ స్థాయి పాఠశాలను మించి నిర్మించి అదే స్థాయిలో సౌకర్యాలు కల్పించడం జరిగిందని అన్నారు. నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్‌ను సూపర్ స్మార్ట్ సిటీగా చేయడమే తన ధ్యేయమన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ లోని 8వ వార్డును దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తానని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు.ఈ ప్రచార కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ ఎంఎ హాఫీజ్ ఖాన్,మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి,పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి,పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు,సిపిఐ నాయకులు ఎస్‌కె మదర్,యుసుఫ్,నారాయణ,శివ,పారిజాత పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌తోనే సమగ్రాభివృద్ధి సాధ్యం

రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క



**ప్రజాపక్షం/చిట్యాల** : కాంగ్రెస్ పార్టీ పాలనలోనే పేదలకు సంక్షేమం,పట్టణాలకు అభివృద్ధి సాధ్యమని తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క స్పష్టం చేశారు. చిట్యాల మున్సిపాలిటీ ఎన్నికల సందర్భంగా శనివారం నిర్వహించిన ఎన్నికల ప్రచార కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇండ్లు కేటాయించామని తెలిపారు.మహిళా సంఘాల తరపున చిట్యాల పట్టణానికి రైస్ మిల్లును తప్పకుండా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.మహిళలకు వడ్డీ లేని రుణాలు,ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని పేర్కొన్నారు.కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. చిట్యాల మున్సిపాలిటీని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ నకిరేకల్ నియోజకవర్గంలో ఇంకా 850 మంది పేదలకు ఇందిరమ్మ ఇండ్లు అవసరం ఉందన్నారు. మహిళా సంఘాల వారు రైస్ మిల్లును మంజూరు చేయాలని కోరుతున్నారని తెలిపారు.గత పది సంవత్సరాల పాలనలో పేదలకు సరైన ఇండ్ల కేటాయింపులు జరగలేదని విమర్శించారు. ఈ నెల 11వ తేదీన జరిగే మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చెయ్యి గుర్తుకు ఓటు వేసి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కొరారు. ఈఎన్నికల ప్రచార కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పున్న కైలాష్ నేత,పార్టీ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# యాదగిరిగుట్టలో 'మిత్ర'గర్జన

12వ వార్డులో శ్రీధర్ గెలుపు దిశగా దూకుడు!

వార్డు వార్డునా ఎర్రజెండా.. అండగా నిలిచిన కాంగ్రెస్ శ్రేణులు.. ప్రభుత్వ విప్ బీర్ల, మాజీ మంత్రి మోత్కుపల్లి, ఎమ్మెల్సీ సత్యంల ప్రచారంతో మారిన సమీకరణాలు!



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట** : ఆధ్యాత్మిక క్షేత్రం యాదగిరిగుట్ట మున్సిపల్ ఎన్నికల వేళ రాజకీయంగా సెగలు పుట్టిస్తోంది. ముఖ్యంగా 12వ వార్డులో రాజకీయం రసవత్తరంగా మారింది. కాంగ్రెస్ బలపరిచిన సిపిఐ అభ్యర్థి బబ్బూరి శ్రీధర్ విజయమే లక్ష్యంగా మిత్రపక్షాల అగ్రనేతలు క్షేత్రస్థాయిలో కదం తొక్కడంతో, ఇక్కడ 'కంకి కొడవలి' విజయం ఖాయమనే సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

**హేమాహేమీల ప్రచారం.. ప్రజల నీరాజనం!**

యాదగిరిగుట్ట వీధులు రాజకీయ సందడిగా మారాయి. రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, సీనియర్ నేత మోత్కుపల్లి నరసింహులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంలు స్వయంగా రంగంలోకి దిగి శ్రీధర్ తరపున ఇంటింటికీ తిరుగుతూ ఓట్లను అభ్యర్థించారు. అగ్రనేతలు స్వయంగా తమ వాడల్లోకి రావడంతో ఓటర్లు ఘనస్వాగతం పలికారు.

**అభివృద్ధి – సంక్షేమం.. ఇదే కూటమి నినాదం**

ఈ ప్రచారంలో నాయకులు ప్రజల మనసు గెలుచుకునేలా గత చరిత్రను, భవిష్యత్తు ప్రణాళికలను వివరించారు: యాదగిరిగుట్టలో పేదలకు ఇంటి స్థలాలు, బంజరు భూముల పంపిణీ కోసం సిపిఐ చేసిన పోరాటాలు సామాన్య జనం మదిలో ఇంకా సజీవంగా ఉన్నాయని నెల్లికంటి సత్యం గుర్తు చేశారు. గతంలో బబ్బూరి శ్రీధర్ సతీమణి కౌన్సిలర్గా చేసిన అభివృద్ధి పనులే ఇప్పుడు శ్రీధర్కు శ్రీరామరక్షగా నిలుస్తాయని స్థానికులు చర్చించుకుంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న ఆరు గ్యారంటీలు ప్రతి గడపకూ చేరుతున్నాయని, అభివృద్ధి నిరంతరాయంగా సాగాలంటే 'చేయి' 'కంకి కొడవలి' కలవాలని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య నొక్కి చెప్పారు.

**ఏకపక్షంగా మారుతున్న ఫలితం?**

నాయకుల ప్రచారంతో 12వ వార్డుతో పాటు పరిసర 2, 3 వార్డుల్లో కూడా మిత్రపక్షాల గాలి బలంగా వీస్తోంది. కాంగ్రెస్ కార్యకర్తల అండ,



సిపిఐ కేడర్ పట్టుదల వెరసి బబ్బూరి శ్రీధర్ గెలుపు ఒక ఫార్మాలిటీ మాత్రమేనని విశ్లేషకులు భావిస్తున్నారు 'మిత్రపక్షాల ఐక్యత ప్రజాపక్షం నిరంతర పోరాటం' అనే నినాదంతో యాదగిరిగుట్టలో కొత్త రాజకీయ చరిత్రకు ఈ ఎన్నికలు వేదిక కాబోతున్నాయి. ఈ ప్రచార పర్వంతో ప్రత్యర్థుల్లో వణుకు మొదలవ్వగా, మిత్రపక్షాల శ్రేణుల్లో మాత్రం విజయోత్సాహం వెల్లివిరుస్తోంది.

## ఎన్నికల నిర్వహణకు కట్టుదిట్టమైన భద్రత

జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్



**ప్రజాపక్షం/నల్లగొండ:** జిల్లాలో మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా,స్వేచ్ఛాయుతంగా నిర్వహించేందుకు జిల్లా పోలీస్ శాఖ పకడ్బందీ చర్యలు చేపట్టింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో భాగంగా మద్యం, నగదు,ఇతర విలువైన వస్తువుల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు జిల్లా వ్యాప్తంగా విస్తృత తనిఖీలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ స్వయంగా చెక్‌పోస్టులు,తనిఖీ కేంద్రాలను పరిశీలించి పోలీసు అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. అనుమానాస్పద వాహనాలు, వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించిన ఎస్‌పి,ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛాయుతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

## ఓటర్లు సజావుగా ఓటు హక్కు వినియోగం

**ప్రజాపక్షం/సూర్యాపేట** : ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూర్యాపేట డిఎస్‌పి ప్రసన్నకుమార్ అన్నారు. శనివారం సూర్యాపేట నుంచి కుడకుడ వరకు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. శనివారం సూర్యాపేట నుండి కుడకుడ వరకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఆటంకాలు కలిగించిన వ్యక్తులకు బైండోవర్ చేశామని, రూ.5లక్షల పూచికత్తు ఉన్నదని దాన్ని అతిక్రమిస్తే రూ.5లక్షలతోపాటు జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కాబట్టి ప్రతి ఒక్కరూ ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. సూర్యాపేట టౌన్, రూరల్ సిఐలు వెంకటయ్య, రాజశేఖర్ పాల్గొన్నారు.

# రోగులకు ఇబ్బంది లేకుండా వైద్యం

నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్



**ప్రజాపక్షం/దేవరకొండ:** ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు ఇబ్బంది కలగకుండా మెరుగైన వైద్య సేవలు అందించాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ వైద్యులకు సూచించారు. శనివారం దేవరకొండ ఏరియా ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని ఓట్ పేషేంట్ విభాగం, ఇన్ పేషేంట్ వార్డులు, ఎమర్జెన్సీ విభాగం, ఎస్ఎన్సీవి వార్డు , భోజనశాల, స్టోర్ రూం సౌకర్యాలను కలెక్టర్ పరిశీలించారు. విధుల్లో ఉన్న నర్సులు, డాక్టర్లతో మాట్లాడి రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో రోగులకు అందుబాటులో ఉన్న బెడ్లు, ఆక్సిజన్ సౌకర్యం, వైద్య పరికరాల పనితీరును పరిశీలించారు. అనంతరం ఆసుపత్రి సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. ఎవరెవరు లీవ్‌లో ఉన్నారు. ఎవరెవరు హాజరయ్యారని సూపరింటిండెంట్‌ను అగిగి తెలుసుకున్నారు. ఎమర్జెన్సీ వార్డులోని రోగులతో జిల్లా కలెక్టర్ ముఖాముఖి మాట్లాడారు. పెద్దబాయి తండాకు చెందిన బలరాంతో మాట్లాడుతూ ఆరోగ్యం ఎలా ఉంది, ఏమైంది, ఆసుపత్రికి ఎందుకు వచ్చారని అడగగా జ్వరం తో ఆసుపత్రికి వచ్చారని ఆసుపత్రి వైద్యులు తెలిపారు. సిబ్బంది బాగానే చూసుకుంటున్నారని , జనరల్ వార్డు ఫిమేల్ కాన్పుల వార్డు తిరిగి ఆసుపత్రిలో సౌకర్యాలు ఏవిధంగా అందుతున్నాయని ప్రజల ద్వారా అడిగి తెలుసుకున్నారు. కాన్పుల వార్డులో భోజనం ఎలా ఉందని, మంచిగా పెడుతున్నారా, గుడ్లు అందిస్తున్నారా, డాక్టర్లు ఎన్ని సార్లు చెక్ చేస్తున్నారు, చిన్న పిల్లలకు దోమలు కుట్టుకుండా కిటికిలను మూసివేయాలని, బాత్రూం కూడా శుభ్రంగా ఉంచాలని సూచించారు. అనంతరం కలెక్టర్ కిచెన్‌ను పరిశీలించారు. వంటలు వండే వంట సామాగ్రి నూనె, కారం, అల్లం, పప్పులు, పసుపులను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలని ఆదేశించారు. ఆసుపత్రి సిబ్బందికి సెలవులు ఆన్‌లైన్‌లో చేసుకోవాలని అందరూ బయోమెట్రిక్ వాడాలని, ఆన్‌లైన్ ద్వారా సెలవులు పొందాలని, ఆఫ్‌లైన్ ద్వారా పొందే అవకాశం లేదన్నారు. ఐసియూ వార్డును జనరల్ వార్డును సపరేట్ చేయాలని, ఐసియూ వార్డును జాగ్రత్త వాడుకోవాలని, మందుల కొరత లేకుండా చూడాలని అన్నారు. ఎక్కడైనా లోపాలు ఉంటే వెంటనే సరిదిద్దాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో సౌకర్యాలు ప్రజలకు పూర్తిస్థాయిలో అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కలెక్టర్ వెంట ఆర్డిఓ రమణారెడ్డి, తహశీల్దార్ మధుసూధన్‌రెడ్డి, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ రవిప్రకాష్, డా. శంకర్, డా. మోతిలాల్,నర్సింగ్ సూపరింటెండెంట్ అంబాదేవి తదితరులు ఉన్నారు.



## కాంగ్రెస్ జైత్రయాత్ర ఎవరూ ఆపలేరు

భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి** : మున్సిపాలిటీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ జైత్రయాత్రను ఎవరూ ఆపులేరని భువనగిరి ఎమ్మెల్యే కుంభ అనిల్ కుమార్ రెడ్డి పునరుద్ఘాటించారు. మరో మూడు రోజుల్లో జరగనున్న రెండవ పురపాలక సంఘం సాధారణ ఎన్నికల్లో భాగంగా శనివారం ఆయన పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 13 వార్డులకు కాంగ్రెస్ పార్టీ బలపరిచి పోటీలో నిలిచిన అభ్యర్థుల కౌన్సిలర్ చైర్మన్ అభ్యర్థుల గెలుపు కోసం ఇంటింటి విస్తృత ప్రచారం చేశారు. అడుగడుగునా ఓటర్లు ఆయనకు మద్దతు తెలుపుతూ బ్రహ్మరథం పట్టారు. ప్రజలకు మరింత ప్రయోజనం చేకూరాలంటే చెయ్యి గుర్తుపై ఓటు వేసి కౌన్సిలర్ చైర్మన్ అభ్యర్థులను దీవించి గెలిపించాలని దండం పెట్టారు. ఆయన వెంట 12వ వార్డు కౌన్సిలర్ చైర్మన్ అభ్యర్థి తడక వెంకటేశ్వర్లు, 13వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి సూరేపల్లి రాధిక రమేష్, 11వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి కుడికాల రామనరసింహ, పదవ వార్డ్ అభ్యర్థి కొయ్యడ రజిని శ్రీనివాస్, 9వ వార్డ్ కౌన్సిలర్ అభ్యర్థి భోగ అనుమతి విష్ణు, 8వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి దేవరాయ కుమార్, 7వ వార్డు మంగళంపల్లి లావణ్య రమేష్, 4వ వార్డ్ నల్ల నాగేశ్వర్, 5వ బాత్క శంకర్, 6వ గంజి జయమ్మ గణేష్ పాల్గొన్నారు.

## 12న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె సక్సెస్ చేద్దాం



**ప్రజాపక్షం/దేవరకొండ:** ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు నూనె రామస్వామి పిలుపునిచ్చారు. శనివారం దేవరకొండ పట్టణంలోని సిపిఐ పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో సమ్మె వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, విద్యుత్ సవరణ చట్టం 2005, వి బి రామ్ జి చట్టం, విత్తన సవరణ బిల్లు, ఎల్‌ఐసిలో 100శాతం విదేశీ పెట్టుబడులను అనుమతించడం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ కార్మిక ప్రజా, రైతు వ్యతిరేక విధానాలను వెనక్కి తీసుకోవాలని, 10 కేంద్ర కార్మిక సంఘాలతో రైతు సంఘాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులు, బ్యాంక్ ఇన్సూరెన్స్, పబ్లిక్ సెక్టార్‌లో పని చేసే వారికి వ్యతిరేకంగా ఉన్న విధానాలు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 12న జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో తెలంగాణ రాష్ట్ర కార్మిక వర్గం మొత్తం పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు, డివిజన్ కోశాధికారి వెంకటరాములు, డివిజన్ నాయకులు నీలా వెంకటయ్య, మైనోద్దిన్, నగేష్, శ్రీనివాస్, దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది

యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు

జిల్లావ్యాప్తంగా ఘనంగా 'స్వీప్' అవగాహన కార్యక్రమాలు

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట** : మున్సిపాలిటీలు అభివృద్ధి పథంలో నడవాలంటే వార్డు సమస్యల పట్ల అవగాహన ఉండి, ప్రజల కోసం పాటుపడే నాయకులను ఎన్నుకోవాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు పిలుపునిచ్చారు. శనివారం యాదగిరిగుట్ట పట్టణంలో జరగనున్న రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో, రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ఓటు హక్కుపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. డబ్బు, మద్యానికి ఆశపడితే అభివృద్ధి శూన్యం ఈ సందర్భంగా కలెక్టర్ ఓటర్లతో కలిసి ప్రత్యేక ప్రతిజ్ఞ చేశారు. 'మా ఓటును డబ్బుకు, మద్యానికి, ఇతర ప్రలోభాలకు అమ్ముకోం. నిజాయితీ గల అభ్యర్థినే ఎంచుకుంటాం' అని ఓటర్లచే ప్రమాణం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఓటు హక్కు అనేది కేవలం ఒక గుర్తు కాదని, అది ప్రజాస్వామ్యానికి పునాది అని స్పష్టం చేశారు.'డబ్బులకు, గిఫ్టకు ఆశపడి ఓటు వేస్తే, గెలిచిన అభ్యర్థిని వార్డు అభివృద్ధి గురించి ప్రశ్నించే హక్కును మనం కోల్పోతాం. జిల్లావ్యాప్తం గా ముమ్మరంగా అవగాహన ర్యాలీలు జిల్లాలోని పలు మున్సిపాలిటీల్లో అధికారుల ఆధ్వర్యంలో 'స్వీప్' కార్యక్రమాలు డి.ఆర్.డి.ఓ నాగిరెడ్డి పర్యవేక్షణలో..

మున్సిపల్ కమిషనర్ రామలింగం నేతృత్వంలో..

ఆర్డీఓ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో..అడిషనల్ డి.ఆర్.డి.ఓ సురేష్ ఆధ్వర్యంలో. తహసిల్దార్ శ్రీనివాస్, కమిషనర్ అంజన్ రెడ్డి నేతృత్వంలో..ఆర్డీఓ శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ ర్యాలీలు నిర్వహించారు.నేటి విద్యార్థులే రేపటి ఓటర్లని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటు హక్కు వినియోగించుకున్నప్పుడే మార్పు సాధ్యమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో తాసిల్దార్ గణేష్ నాయక్, ఎంపీడీవో నవీన్ కుమార్, పంచాయతి రాజ్ డి ఈ గంట శ్రీరామ్ పాల్గొన్నారు.



## ఒప్పందంలో ప్రధాన అంశాలు

**న్యూఢిల్లీ :** అమెరికాతో భారత్ చేసుకున్న మధ్యంతర ఒప్పందంపై ఇరు దేశాలు సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. అందులోని ప్రధాన అంశాలు...

* భారతదేశంపై సుంకాలను అమెరికా గతంలో ఉన్న 50 శాతం నుండి 18 శాతానికి తగ్గించింది.
* ఇది భారత ఎగుమతిదారులకు, ముఖ్యంగా ఎంఎస్ఎంఇలు, రైతులు, మత్స్యకారులకు యుఎస్‌డి 30 ట్రిలియన్ల మార్కెట్‌ను తెరుస్తుంది.
* ఎగుమతుల పెరుగుదల మహిళలు, యువతకు లక్షలాది కొత్త ఉద్యోగ అవకాశాలను సృష్టిస్తుంది.
* ఈ ఒప్పందంలో భాగంగా, అమెరికా భారతీయ వస్తువులపై పరస్పర సుంకాలను 18 శాతానికి తగ్గిస్తుంది.
* వస్త్రాలు, దుస్తులు, తోలు, పాదరక్షలు, ప్లాస్టిక్, రబ్బరు ఉత్పత్తులు, సేంద్రీయ రసాయనాలు, గృహాలంకరణ, చేతివృత్తుల ఉత్పత్తులు, ఎంపిక చేసిన యంత్రాలు వంటి కీలక రంగాలలో ఈ ఒప్పందం భారీ మార్కెట్ అవకాశాన్ని అందిస్తుంది.
* జనరిక్ ఔషధాలు, రత్నాలు, వజ్రాలు, విమాన భాగాలతో సహా విస్తృత శ్రేణి వస్తువులపై సుంకాలు సున్నాకి తగ్గుతాయి.
* భారతదేశం విమాన భాగాలపై సెక్షన్ 232 కింద మినహాయింపులు, ఆటో భాగాలపై సుంకం రేటు కోటా, జనరిక్ ఔషధాలపై చర్చల ఫలితాలను పొందుతుంది.
* మొక్కజొన్న, గోధుమ, బియ్యం, సోయా, పౌల్ట్రీ, పాలు, చీజ్, ఇథనాల్ (ఇంధనం), పొగాకు, కొన్ని కూరగాయలు, మాంసం వంటి సున్నితమైన వ్యవసాయ, పాల ఉత్పత్తులను భారతదేశం పూర్తిగా రక్షిస్తుంది.
* అన్ని రకాల అమెరికా పారిశ్రామిక వస్తువులు, విస్తృత శ్రేణి అమెరికా ఆహార, వ్యవసాయ ఉత్పత్తులపై సుంకాల తగ్గింపు, తొలగింపు ఉండనుంది. వాటిలో ఎండిన డిస్టిలర్ల ధాన్యాలు, పశుగ్రాసం కోసం ఎర్ర జొన్న, చెట్ల గింజలు, తాజా, ప్రాసెస్ చేసిన పండ్లు, సోయాబీన్ నూనె, వైన్, స్పిరిట్స్, అదనపు ఉత్పత్తులు ఉన్నాయి.
* రెండు దేశాలు స్థిరమైన ప్రాతిపదికన సంబంధిత ఆసక్తి ఉన్న రంగాలలో ఒకదానికొకటి ప్రాధాన్యత మార్కెట్ ప్రాప్యతను అందించడానికి కట్టుబడి ఉన్నాయి.
* అమెరికా, భారతదేశం ద్వైపాక్షిక వాణిజ్యాన్ని ప్రభావితం చేసే నాన్‌టారిఫ్ అడ్డంకులను పరిష్కరిస్తాయి.
* అమెరికా వైద్య పరికరాల వాణిజ్యానికి దీర్ఘకాలిక అడ్డంకులను పరిష్కరించడానికి భారతదేశం అంగీకరిస్తుంది; యుఎస్ ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ వస్తువులకు మార్కెట్ యాక్సెస్‌ను ఆలస్యం చేసే లేదా వాటిపై పరిమాణాత్మక పరిమితులను విధించే నిర్బంధ దిగుమతి లైసెన్సింగ్ విధానాలను తొలగించనుంది.
* అమెరికా, భారతదేశం పరస్పరం అంగీకరించిన రంగాలకు సంబంధించిన వాటి ప్రమాణాలు, అనుగుణ్యత అంచనా విధానాలను చర్చించాలని భావిస్తున్నాయి.
* ఏదైనా దేశం అంగీకరించిన సుంకాలలో ఏవైనా మార్పులు జరిగితే, యుఎస్, భారతదేశం ఇతర దేశం దాని నిబద్ధతలను సవరించవచ్చని అంగీకరిస్తున్నాయి.
* ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం ప్రకారం చర్చల ద్వారా మార్కెట్ యాక్సెస్ అవకాశాలను మరింత విస్తరించడానికి ఇరు దేశాలు కృషి చేయనున్నాయి.
* భారతదేశం రానున్న సంవత్సరాలలో యుఎస్‌డి 500 బిలియన్ల యుఎస్ ఇంధన ఉత్పత్తులు, విమానం, విమాన భాగాలు, విలువైన లోహాలు, సాంకేతిక ఉత్పత్తులు, కోకింగ్ బొగ్గును కొనుగోలు చేయాలని భావిస్తోంది.
* భారతదేశం, యుఎస్ గ్రాఫిక్స్ ప్రాసెసింగ్ యూనిట్లు, డేటా సెంటర్లలో ఉపయోగించే ఇతర వస్తువులతో సహా సాంకేతిక ఉత్పత్తులలో వాణిజ్యాన్ని గణనీయంగా పెంచుతాయి. ఉమ్మడి సాంకేతిక సహకారాన్ని విస్తరిస్తాయి.
* యుఎస్, భారత్ వివక్షత లేదా భారమైన పద్ధతులు, డిజిటల్ వాణిజ్యానికి ఇతర అడ్డంకులను పరిష్కరించడానికి కట్టుబడి ఉంటాయి.

## ఎంపి పప్పు యాదవ్ అరెస్టు
# రాజకీయ ప్రతీకార చర్య

### లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ
### ప్రభుత్వాన్ని జవాబుదారీగా ఉండాలని డిమాండ్ చేసే ప్రతీ గొంతునూ అణచివేస్తున్నారని మండిపాటు



**న్యూఢిల్లీ :** బిహార్ ఎంపి పప్పు యాదవ్‌ను అరెస్టు చేయడాన్ని రాజకీయ ప్రతీకార చర్యగా లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ప్రభుత్వాన్ని జవాబుదారీగా ఉండాలని డిమాండ్ చేసే ప్రతి గొంతును బెదిరించి, అణచివేయడానికే ఈ చర్య అని మండిపడ్డారు. పాట్నాలో ఇటీవల అనుమానాస్పద పరిస్థితుల్లో మరణించిన ఒక నీట్ అభ్యర్థికి న్యాయం కోసం యాదవ్ తన గళం విప్పారని రాహుల్ ఎక్స్‌లో పేర్కొన్నారు. ఇది రాజకీయం కాదని, న్యాయానికి సంబంధించిన ప్రశ్న అని అన్నారు. బిహార్ ఆడబిడ్డల గౌరవం, భద్రతకు సంబంధించిన ప్రశ్నని ఉద్ఘాటించారు. పప్పు యాదవ్ అరెస్టు ముమ్మాటికీ రాజకీయ కక్ష సాధింపు చర్యే అని, జవాబుదారీతనం కోరే ప్రతి గొంతును బెదిరించి, అణచివేయడమే దీని లక్ష్యమని మండిపడ్డారు. పాట్నాలో నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) అభ్యర్థి అనుమానాస్పద మరణం, ఆ తర్వాత జరిగిన పరిణామాలన్నీ వ్యవస్థలోని లోపాలను మరోసారి బట్టబయలు చేశాయని గాంధీ అన్నారు. బాధితురాలి కుటుంబం నిష్పక్షపాత విచారణ, న్యాయం కోరినప్పుడు, బిజెపి – ఎన్‌డిఎ పాత పద్ధతి మళ్లీ తెరపైకి తెస్తూ కేసును పక్కదారి పట్టించడం, కుటుంబాన్ని వేధించడం, ప్రభుత్వ అధికారాన్ని ఉపయోగించి నిందితులను రక్షించడం చేస్తుందని దుయ్యబట్టారు. అత్యంత ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే, ఈ ఘటన ఒకే కేసుకే పరిమితమైనట్లు కనిపించడం లేదని, ఇది ఒక భయంకరమైన కుట్ర, ప్రమాదకరమైన పద్ధతిని సూచిస్తోందన్నారు. మరింత మంది ఆడబిడ్డలు బాధితులుగా మారుతున్నారని, అధికారంలో ఉన్న వారు ఈ భయంకరమైన వాస్తవాన్ని చూసి కూడా కళ్లు మూసుకుని కూర్చున్నారని రాహుల్ గాంధీ తీవ్ర అగ్రహం వ్యక్తం చేశారు. జహానాబాద్‌కు చెందిన ఆ నీట్ అభ్యర్థి గత నెలలో పాట్నాలోని చిత్రగుప్త నగర్‌లోని ఒక బాలికల హాస్టల్‌లో అపస్మారక స్థితిలో కనిపించింది. రోజుల తరబడి కోమాలో ఉన్న ఆమె జనవరి 11న ఒక ప్రైవేట్ ఆసుపత్రి లో మరణించింది. ఆమెపై లైంగిక దాడి జరిగిందని ఆ మె కుటుంబం ఆరోపించింది. అధికారులు ఈ విషయాన్ని కప్పిపుచ్చడానికి ప్ర యత్నిస్తున్నారని ఆరోపించింది. ఈ కేసుపై సిబిఐ విచారణకు బిహార్ ప్రభుత్వం ఇటీవల సిఫార్సు చేసింది. ఈ కేసును ఒక ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారిస్తోంది. అయితే బిహార్‌కు చెందిన స్వతంత్ర ఎంపి రాజేష్ రంజన్ (పప్పు యాదవ్‌గా ప్రసిద్ధి)ను 1995 నాటి ఒక కేసు సంబంధించి శుక్రవారం రాత్రి ఆయన నివాసంలో పాట్నా పోలీసులు అరెస్టు చేశారని అధికారులు తెలిపారు. భారత శిక్షాస్మృతిలోని సెక్షన్ 467 (పత్రాల ఫోర్జరీ) కింద నమోదైన కేసులో ఎంపీపి–ఎమ్మెల్యే కోర్టు జారీ చేసిన వారెంట్‌ను అమలు చేయడానికి పోలీసు బృందం పాట్నాలోని మండిరి ప్రాంతంలో ఉన్న యాదవ్ ఇంటికి చేరుకున్నప్పుడు హై డ్రామా చోటుచేసుకుంది. పూర్నియా లోక్‌సభ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న యాదవ్ పోలీసులు తన అరెస్టుకు కాకుండా ఆస్తి జప్తుకు వారెంట్ తెచ్చారని పేర్కొంటూ మొదట పోలీసు బృందంతో వెళ్లడానికి నిరాకరించారు. బిహార్‌లోని ఎన్‌డిఎ ప్రభుత్వంపై విమర్శనాత్మక అంశాలను లేవనెత్తుతున్నందుకే తనను లక్ష్యంగా చేసుకుంటున్నారని కూడా ఆయన ఆరోపించారు.

**పప్పు యాదవ్‌కు రెండు రోజుల కస్టడీ**

ఇదిలా ఉండగా, పప్పు యాదవ్ శనివారం పాట్నాలోని ఓ కోర్టు రెండు రోజుల జ్యుడీషియల్ కస్టడీకి విధించింది. అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు ఆయన బెయిల్ పిటిషన్‌పై సోమవారం విచారణ జరుపుతామని, అప్పటి వరకు చికిత్స కోసం ఆయనను పాట్నా మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌లో ఉంచుతామని తెలిపింది. యాదవ్ తరపున కోర్టులో హాజరైన న్యాయవాది శివనందన్ భారతి మాట్లాడుతూ యాదవ్‌ను జ్యుడీషియల్ కస్టడీలోకి తీసుకున్నారని, జైలుకు పంపే బదులు, యాదవ్ స్వచ్ఛందంగా అరెస్టుకు లొంగిపోయారని, అయితే పోలీసు ల విధులకు ఆటంకం కలిగించారనే ఆరోపణతో ఆయనపై తప్పుడు కేసు పెట్టారని న్యాయవాది ఆరోపించారు.

## ఆయుధాలు వీడిన
## మరో 51 మంది




### లొంగిపోయిన నక్సల్స్‌పై సమష్టిగా రూ. 1.61 కోట్ల రివార్డు

**బిజాపూర్/సుక్మా:** ఛత్తీస్‌గఢ‌లో మరో నక్సల్స్ బృందం ఆయుధాలను వీడింది. బస్తర్ డివిజన్‌లోని రెండు జిల్లాల్లో శనివారం రూ. 1.61 కోట్ల సమష్టి రివార్డు కలిగిన మొత్తం 51 మంది నక్సలైట్లు పోలీసుల ఎదుట లొంగిపోయారని ఒక సీనియర్ అధికారి తెలిపారు. బస్తర్ జిల్లా కేంద్రమైన జగదల్‌పూర్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బస్తర్ పండమ్ 2026 ఉత్సవాన్ని ప్రారంభించడం, కేంద్ర హోంమంత్రి అమిత్ షా మూడు రోజుల పర్యటన నిమిత్తం రాయ్‌పూర్‌కు చేరుకోవడం వంటి పరిణామాల మధ్య ఈ లొంగుబాటు జరిగింది. లొంగిపోయిన వారిలో 34 మంది మహిళలు ఉన్నారు. బస్తర్ రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సుందర్‌రాజ్ పట్టిలింగం మాట్లాడుతూ బిజాపూర్ జిల్లాలో 20 మంది మహిళలతో సహా 30 మంది నక్సల్స్ లొంగిపోగా, పొరుగున ఉన్న సుక్మా జిల్లాలో బస్తర్ పోలీసుల 'పూనా మార్గెం' పునరావాస కార్యక్రమం కింద 14 మంది మహిళా సభ్యులతో సహా మరో 21 మంది ప్రధాన స్రవంతిలో కలిశారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ లొంగుబాటు, పునరావాస విధానం తమను ఆకట్టుకుందని ఆ తీవ్రవాదులు చెప్పారని ఆయన పేర్కొన్నారు.

### బిఎంసి మేయర్ ఎన్నిక..
## బిజెపి అభ్యర్థిగా రితూ తావ్డే

**ముంబయి :** బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బిఎంసి) మేయర్ పదవికి మహాయుతి కూటమి తమ అభ్యర్థిని ఖరారు చేసింది. బిజెపి కార్పొరేటర్ శ్రీమతి రితూ తావ్డేను తమ అభ్యర్థిగా నిర్ణయించినట్టు ఆ పార్టీ నేత అమిత్ సతమ్ ప్రకటించారు. షిండే శివసేన నేత సంజయ్ శంకర్ ఘాడిని డిప్యూటీ మేయర్ అభ్యర్థిగా ఎంపిక చేశామని తెలిపారు. రితూ తావ్డే మూడుసార్లు కార్పొరేటర్‌గా ఎన్నికయ్యారు. బిఎంసి విద్యా కమిటీ అధ్యక్షురాలిగా కూడా పని చేశారు. సంజయ్ శంకర్ ఘాడి 15 నెలలుగా 5వ నెంబర్ వార్డు మెంబర్‌గా ఉన్నారు. 2022లో శివసేనలో చీలిక ఏర్పడినప్పుడు ఏక్‌నాథ్ షిండే వర్గంలో చేరిన వారిలో ఆయన కూడా ఉన్నారు. బిఎంసితో సహా అన్ని మున్సిపల్ కార్పొరేషన్లకు గత జనవరి 15న ఎన్నికలు జరుగగా, 16న ఫలితాలు వెలువడ్డాయి. 227 మంది సభ్యుల బిఎంసికి జరిగిన ఎన్నికల్లో బిజెపి–శివసేన కూటమి 118 స్థానాలతో మెజారిటీ కంటే నాలుగు స్థానాలు ఎక్కువగా గెలుచుకుంది. మహాయుతి కూటమిలో నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సిపి) భాగస్వామిగా ఉన్నప్పటికీ ఈసారి ఎన్నికల్లో మాత్రం ఒంటరిగా పోటీ చేసి 3 సీట్లు గెలుచుకుంది. వీటితో కలిపి మహాయుతి కూటమి బలం 121కి చేరింది. కాగా, గత 25 ఏళ్లుగా బిఎంసిని ఏలిన ఉద్ధవ్ థాక్రే శివసేన 65 సీట్లు గెలుచుకుంది. కాంగ్రెస్ 24, రాజ్ థాక్రే మహారాష్ట్ర నవ్‌నిర్మాణ్ సేన (ఎంఎన్‌ఎస్) 6 సీట్లు దక్కించుకున్నాయి.

## చర్చలు, సంప్రదింపులు ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగం

### ఎమ్మెల్యేలు, ఎంపీలు సభా మర్యాదలు పాటించాలి
### లోక్‌సభ స్పీకర్ ఓమ్ బిర్లా సూచన



**పాట్నా:** ప్రజాస్వామ్య ప్రక్రియలో చర్చ, సంప్రదింపులు ఒక భాగమని లోక్‌సభ స్పీకర్ ఓమ్ బిర్లా పేర్కొన్నారు. అయితే ఎట్టి పరిస్థితుల్లో సభా మర్యాదలను కాపాడాలన్నారు. శనివారం బిర్లా బిహార్ అసెంబ్లీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ప్రసంగించారు. అక్కడ కాగిత రహిత శాసన కార్యకలాపాలు సాగించాలనే లక్ష్యంతో రూపొందించిన జాతీయ ఇ–విధాన్ అప్లికేషన్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఎన్నికైన ప్రజా ప్రతినిధులు సభ మర్యాదను కాపాడాలన్నారు. అసెంబ్లీలు, పార్లమెంటు సభ్యులు తమ అభిప్రాయాలను వ్యక్తీకరించే అధికారం కలిగి ఉంటారని, వారు తమ అభిప్రాయాలను పంచుకోవాలి. కానీ వారు తమ అభిప్రాయాలను పంచుకునేటప్పుడు గౌరవాన్ని కాపాడుకోవాలి సూచించారు. చర్చ, సంప్రదింపులు ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగం, సభ మర్యాదను ఎలాగైనా కొనసాగించాలని, శాసనసభ పనితీరు నియమాలను కూడా నేర్చుకోవాలన్నారు. సాధికారత కలిగిన శాసనసభ్యులు బలమైన ప్రజాస్వామ్యానికి పునాది అని బిర్లా అన్నారు. ప్రజల విశ్వాసంతో అధికారం పొందిన ప్రజా ప్రతినిధులు సమస్యలను వారి తీర్మానానికి తీసుకెళ్లడం ద్వారా, చట్టాన్ని రూపొందించడాన్ని అర్థవంతంగా చేయడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని శక్తివంతం చేస్తారని ఆయన అన్నారు. ప్రస్తుతం శాసనసభల మర్యాదలు క్షీణించడాన్ని చూస్తున్నామని, సభలో నినాదాలు చేయడం, సభకు అంతరాయం కలిగిస్తున్న దృశ్యాలు కనిపిస్తున్నాయన్నారు. అందుకు బదులుగా చర్చలు, హేతుబద్ధమైన సంప్రదింపుల ద్వారా తమ అభిప్రాయాలను ప్రదర్శించాలని సభ్యులకు విజ్ఞప్తి చేశారు. ఒక శాసనసభ్యుడికి నిజమైన బలం నైతిక విలువలు, బాధ్యతాయుత భావం, రాజ్యాంగ విధానాల పరిజ్ఞానం నుండి వస్తుందని, సమర్థవంతమైన శాసనసభ్యుడు పాలనను మరింత పారదర్శకంగా, జవాబుదారీగా, ప్రజలను కేంద్రీకృతం చేస్తాడని బిర్లా పేర్కొన్నారు. బిహార్ ప్రజాస్వామ్య సంప్రదాయాలకు జన్మస్థలం అని, దాని వారసత్వం దేశ పార్లమెంటరీ వ్యవస్థకు సైద్ధాంతిక పునాదిని అందించిందని బిర్లా అన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్ మాట్లాడుతూ బిహార్ వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. రూ. 3.47 లక్షల కోట్ల రాష్ట్ర బడ్జెట్ బిహార్ పురోగతి అద్భుతమైనది, ప్రశంసనీయమైనదన్నారు. కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు కూడా హాజరైన ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి నితీష్ కుమార్, ప్రతిపక్ష నాయకుడు తేజస్వి యాదవ్ గైర్హాజరు అయ్యారు.

## ఆ ఆదేశాలను కేంద్రం వెంటనే ఉపసంహరించుకోవాలి

### వరిధాన్యం సేకరణకు అదనపు బోనస్ ఇవ్వొద్దనడం సరికాదు
### ఈ చర్య దేశ ఆహార భద్రతకు ముప్పు కలిగిస్తుంది : ఎల్‌డిఎఫ్ కన్వీనర్ రామకృష్ణన్



**తిరువనంతపురం:** వరి సేకరణ కోసం కేరళ ప్రభుత్వం అందిస్తున్న అదనపు ప్రోత్సాహక బోనస్‌ను నిలిపివేయాలని కేంద్రం ఇచ్చిన ఆదేశాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని ఎల్‌డిఎఫ్ కన్వీనర్ టిపి రామకృష్ణన్ డిమాండ్ చేశారు.ఈ చర్య దేశ ఆహార భద్రతకు ముప్పు కలిగిస్తుందని ఎల్‌డిఎఫ్ కన్వీనర్ పేర్కొంటూ ఈ చర్యకు వ్యతిరేకంగా తీవ్ర నిరసనలు తెలపాలని పిలుపునిచ్చారు. రాష్ట్రాలు ఇస్తున్న అదనపు బోనస్‌ను ఉపసంహరించుకోవాలని కోరుతూ కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ వ్యయ కార్యదర్శి రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి లేఖ రాశారని రామకృష్ణన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అదనపు ప్రోత్సాహకం దేశవ్యాప్తంగా గోధుమలు, బియ్యం అధికంగా సేకరించడానికి దారితీస్తోందని, ఇది ప్రభుత్వ ఖజానాపై ఆర్థిక భారాన్ని సృష్టిస్తోందని కేంద్రం వాదిస్తోందని ఆయన అన్నారు. ఈ అదనపు బోనస్ ఆహార ధాన్యాల సాగును ప్రోత్సహిస్తుందని, ఉత్పత్తిని పెంచుతుందని కూడా ఆ లేఖలో పేర్కొన్నారు. ఇటువంటి జోక్యం దేశ ఆహార స్వావలంబనను బలహీనపరుస్తుందని రామకృష్ణన్ ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం వరి సేకరణకు కిలోకు రూ. 6.31 అదనపు ప్రోత్సాహకాన్ని అందిస్తోందని, అయితే కేంద్రం వాటా తరచుగా సకాలంలో విడుదల కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. ఇటువంటి పరిస్థితుల్లో రాష్ట్రం ఇస్తున్న అదనపు ప్రోత్సాహకాన్ని ఉపసంహరించుకోవాలనే డిమాండ్ ఆమోదయోగ్యం కాదని ఆయన అన్నారు. జనవరి 9న, కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖలోని కార్యదర్శి (వ్యయం) వి. వల్నామ్, కేరళ ప్రధాన కార్యదర్శి ఎ. జయతిలక్‌కు లేఖ రాస్తూ, రాష్ట్రం తన ప్రస్తుత బోనస్ విధానాన్ని సమీక్షించాలని, గోధుమలు, వరిపై ఇస్తున్న అదనపు ప్రోత్సాహకాన్ని నిలిపివేయడాన్ని పరిశీలించాలని కోరారు. పోషకాహార భద్రత, ఆత్మనిర్భరత, సుస్థిర వ్యవసాయంపై జాతీయ ప్రాధాన్యతలకు అనుగుణంగా, పప్పుధాన్యాలు, నూనెగింజలు, చిరుధాన్యాల సాగును ప్రోత్సహించే ప్రోత్సాహకాల వైపు దృష్టి సారించాలని కూడా ఆ లేఖలో అభ్యర్థించారు. గోధుమలు, వరి అధిక ఉత్పత్తి కారణంగా, ప్రజా పంపిణీ వ్యవస్థ, బఫర్ నిబంధనలు, ఇతర సంక్షేమ, ఆకస్మిక అవసరాలకు అవసరమైన దాని కంటే గోధుమలు, బియ్యం నిల్వలు చాలా ఎక్కువగా ఉన్నాయని అందులో పేర్కొన్నారు.

## బైక్ ట్యాక్సీలపై నిషేధం విధించాలి

### యాప్ ఆధారిత ట్యాక్సీలు, ఆటోరిక్షాల డ్రైవర్ల దేశ వ్యాప్త సమ్మె




**ముంబయి:** యాప్ ఆధారిత టాక్సీలు, ఆటోరిక్షాల డ్రైవర్లు శనివారం దేశవ్యాప్తంగా సమ్మెకు దిగారు. అక్రమ బైక్ టాక్సీ సేవలపై చర్యలు తీసుకోవడం, పానిక్ బటన్ ఇన్‌స్టాలేషన్‌లపై ఫిర్యాదుల పరిష్కారం వంటి వివిధ డిమాండ్ల కోసం నిరసనకు యూనియన్ పిలుపునిచ్చింది. అయితే డ్రైవర్లతో అన్యాయంగా ప్రవర్తిస్తే, వారికి అన్యాయం చేస్తే, ప్రభుత్వం కంపెనీలపై తగిన చర్యలు తీసుకుంటుందని మహారాష్ట్ర రవాణా మంత్రి ప్రతాప్ సర్నాయక్ రైడ్ అగ్రిగేటర్లను హెచ్చరించారు. డ్రైవర్ల వాస్తవ సమస్యలన్నింటిపై వారికి అండగా నిలబడటానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. మహారాష్ట్ర, దేశంలోని ఇతర ప్రాంతాలలో ఉదయం సమ్మె ప్రారంభమైందని మహారాష్ట్ర కామ్‌గర్ సభ అధిపతి డాక్టర్ కేశవ్ క్షీర్‌సాగర్ పిటిఐకి తెలిపారు. చాలా మంది ఆటోరిక్షాలు, టాక్సీ డ్రైవర్లు సమ్మెకు మద్దతు ఇచ్చారని ఆయన అన్నారు. డ్రైవర్లు తమ వాహనాలను రోడ్లపైకి రాకుండా నిలిపివేసినట్లు యూనియన్ పేర్కొన్నప్పటికీ, టాక్సీలు, ఆటోరిక్షాలు ఉదయం నుండి ఉబర్, ఓలా, రాపిడోతో సహా ప్రధాన కంపెనీల యాప్ ఆధారిత ప్లాట్‌ఫామ్‌లలో బుకింగ్ కోసం అందుబాటులో ఉన్నాయి. లైసెన్స్ పొందిన క్యాబ్, ఆటోరిక్షా డ్రైవర్ల జీవనోపాధిని ప్రభావితం చేస్తున్న చట్టవిరుద్ధమైన బైక్ టాక్సీ కార్యకలాపాలపై కఠినంగా చర్యలు తీసుకోవాలని రైడ్ అగ్రిగేటర్ల ఏకపక్ష ఛార్జీల విధానాలను వ్యతిరేకించడం లక్ష్యంగా ఈ సమ్మె నిర్వహిస్తున్నట్లు మహారాష్ట్ర కామ్‌గర్ సభ గతంలో తెలిపింది. పానిక్ బటన్‌లను తప్పనిసరిగా అమర్చడం ఆపరేటర్లకు ఆర్థిక భారంగా మారిందని గిగ్ కార్మికులకు ప్రాతినిధ్యం వహిస్తున్న యూనియన్ ఆరోపించింది. కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన 140 పానిక్ బటన్ పరికర ప్రొవైడర్లు ఉన్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం ఈ కంపెనీలలో దాదాపు 70 శాతం కంపెనీలను అనధికారికంగా ప్రకటించింది. ఫలితంగా, క్యాబ్ డ్రైవర్లు గతంలో అమర్చిన పరికరాలను తొలగించి, కొత్త పరికరాలను అమర్చడానికి అనవసరంగా సుమారు రూ. 12, 000 ఖర్చు చేయవలసి వస్తుంది, దీనివల్ల తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయి అని యూనియన్ ప్రకటనలో పేర్కొంది. ఓపెన్ పర్మిట్ పాలసీ కింద ఆటోరిక్షాల సంఖ్య పెరగడం వల్ల ఆదాయం కోల్పోవడంపై డ్రైవర్ల సంఘం ఆందోళన వ్యక్తం చేసింది. అక్రమ బైక్ టాక్సీలతో ప్రమాదాల బాధితులకు బీమా ప్రయోజనాలు నిరాకరించబడుతున్నాయని కూడా ఆరోపించింది. థానేలో మంత్రి సర్నాయక్ విలేకరులతో మాట్లాడుతూ ఆందోళన సాధారణ పౌరులను ఇబ్బంది పెట్టకూడదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం డ్రైవర్ యూనియన్లతో నిరంతరం సంప్రదింపులు జరుపుతోందని ఆయన అన్నారు. అగ్రిగేటర్ కంపెనీలు డ్రైవర్ల పట్ల అన్యాయంగా ప్రవర్తిస్తే, ప్రభుత్వం చర్య తీసుకోవడానికి వెనుకాడదని ఆయన హెచ్చరించారు.

## సిఎం పదవిపై కాలమే సమాధానం చెబుతుంది

### ఉప ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్



**మంగళూరు:** తనకు ఎప్పుడు సిఎం పదవి వరిస్తుందో కాలమే సమాధానం చెబుతుందని, ఈ విషయంలో కాంగ్రెస్ అధిష్టానం తీసుకునే నిర్ణయానికి ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాల్సిందేనని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ అన్నారు.ముఖ్యమంత్రి సిద్ధరామయ్యతో ముఖ్యమంత్రి పదవిపై మరోసారి తలెత్తిన అధికార పోరు నేపథ్యంలో శివకుమార్ ఈ వ్యాఖ్యలు చేశారు. సిద్ధరామయ్య కుమారుడు యతీంద్ర, తన తండ్రి ఐదేళ్ల పదవీకాలాన్ని పూర్తి చేస్తారని, ఈ విషయంలో పార్టీ అధిష్టానం కూడా సంకేతాలు ఇచ్చిందని చెబుతున్నారు. కాగా, తాను ఎక్కడికి వెళ్లినా ప్రజలు, తన మద్దతుదారులు తాను ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారని విలేకరులు అడిగిన ప్రశ్నకు శివకుమార్ సమాధానమిస్తూ, 'ప్రజలకు, శాసనసభ్యులకు, మీకు (మీడియాకు), ప్రతి ఒక్కరికీ ఆ కోరిక ఉంది. కానీ పార్టీ చెప్పిన దానికి మనమందరం కట్టుబడి ఉండాలి' అని అన్నారు. కొన్ని రోజుల్లో ప్రవేశపెట్టనున్న రాష్ట్ర బడ్జెట్ తర్వాత తాను ముఖ్యమంత్రి అవుతారని ఆశించవచ్చా అని అడిగిన ప్రశ్నకు శివకుమార్ అందుకు 'కాలమే సమాధానం చెబుతుంది' అని అన్నారు. చిక్కమగళూరు పర్యటన సందర్భంగా హోంమంత్రి జి. పరమేశ్వర ముఖ్యమంత్రి కావాలని కొన్ని దళిత సంఘాలు డిమాండ్ చేయడంపై అడిగిన ప్రశ్నకు ఆయన స్పందిస్తూ అందులో తప్పేముంది అని అన్నారు. మద్దతుదారులు (తమ నాయకులు ముఖ్యమంత్రి కావాలని) కోరిక వ్యక్తం చేస్తారని, అలా చేయవద్దని వారికి చెప్పలేం కదా అని అన్నారు. ఇదిలా ఉండగా, ఆర్థిక శాఖను కూడా నిర్వహిస్తున్న సిద్ధరామయ్య, వివిధ శాఖలతో బడ్జెట్‌కు ముందు వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. అధికారిక వర్గాల ప్రకారం, 2026–27 బడ్జెట్‌ను మార్చిలో ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ఇది సిద్ధరామయ్య ప్రవేశపెట్టనున్న రికార్డు స్థాయిలో 17వ బడ్జెట్ అవుతుంది. ఆయన గత ఏడాది మార్చిలో తన 16వ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన ఐదేళ్ల పదవీకాలంలో సగం పూర్తి చేసుకున్న తర్వాత, నవంబర్ 20, 2025న ముఖ్యమంత్రి మార్పుపై ఊహాగానాలు వెలువడిన నేపథ్యంలో అధికార పార్టీలో నాయకత్వ పోరు తీవ్రమైంది.

### బ్రిటీష్ వలస పాలనలోని...
## రాజకీయ వాస్తవికతకు దర్పణం పట్టిన పుస్తకం

### 'భారతదేశంలో వలసరాజ్యాల ప్రస్థానం – స్వేచ్ఛ'
### సీనియర్ న్యాయవాది ద్వివేది పుస్తకావిష్కరణలో మాజీ సిజెఐ డి.వై.చంద్రచూడ్ కితాబు

**న్యూఢిల్లీ:** భారతదేశంలో బ్రిటీష్ వలసపాలన చుట్టూ ఉన్న రాజకీయ వాస్తవికతకు దర్పణం పట్టిన పుస్తక రచయిత ద్వివేదీ అభినందనీయుడని భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి డి.వై.చంద్రచూడ్ అన్నారు. సీనియర్ న్యాయవాది, రాజ్యాంగ నిపుణుడు ద్వివేదీ రచించిన 'భారతదేశంలో వలసరాజ్యాల ప్రస్థానం– స్వేచ్ఛ' పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రూప పబ్లికేషన్ ఈ పుస్తకాన్ని వెలువరించింది. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ ప్రసంగిస్తూ 'ప్రాంతాలవారీగా వలసవాద చరిత్రను జాగ్రత్తగా చదివితే (వలసవాదానికి సమర్థనాత్మక నమూనాలు స్థానికంగా లేదా వేరుగా ఉన్నాయని తెలుస్తోంది. ఒక్కోసారి భాషాపరమైన క్రమం, నాగరికత, పురోగతి సంబంధిత భాషను పదేపదే ఎదురుదాడులను ఎదుర్కొంటోంది. వలసవాద జోక్యాన్ని ఉద్దేశపూర్వక విస్తరణ కేసుగా కాకుండా అయిష్టతతో కూడిన పాలన, నివేదించడం, ఒక క్రమానికి ప్రతిస్పందించడం'గా ఆయన అభివర్ణించారు. 'భారతదేశంలో వలసరాజ్యాల క్రూసేడ్, స్వేచ్ఛ' పుస్తకాన్ని చంద్రచూడ్ ప్రశంసిస్తూ ప్రత్యేకంగా నిలిపేది రాజకీయ పురాణాల (బ్రిటీష్ సామ్రాజ్యం ఆవశ్యకత లేదా దాతృత్వం) ద్వారా వెలుగులోకి తీసుకొచ్చే పద్ధతి అన్నారు. ఇది సాంప్రదాయ కాలక్రమానుసార కథనాన్ని అనుసరించడం లేదా ఒంటరి చారిత్రక ఉదంతాల చుట్టూ విశ్లేషణను నిర్వహించదని, ఈ విధానం ఒక ప్రముఖ సీనియర్ న్యాయవాది విధానాన్ని ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు. వందల ఏళ్లనాటి సామ్రాజ్యవాద రచనల నుంచి పునరావృతమయ్యే ప్రతిపాదనలను రచయిత గుర్తించడం జరిగిందన్నారు. అంతేకాకుండా ఆర్థిక చరిత్ర, భౌగోళిక రాజకీయాలు, తులనాత్మక వలస అనుభవం నుంచి సేకరించిన ఆధారాలలతో ఆ ప్రతిపాదనలను పరీక్షించారని చంద్రచూడ్ అన్నారు. తిరస్కరించడం ఈ పుస్తకంలోని మరో విశిష్ట లక్షణమన్నారు. చరిత్ర ఒంటరి సంఘటనల చుట్టూ కాకుండా వాదనలు, ప్రతిపాదనల చుట్టూ వ్యవస్థీకృతమై ఉందన్నారు. ఈ పుస్తక రచన దేశ వలసరాజ్యాలను అర్థం చేసుకునే దిశను మార్చడం ప్రశంసనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది, రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్ ప్రసంగిస్తూ వలసరాజ్యాల అనాగరికులను నాగరికంగా మారుస్తున్నారని సిబల్ వివరించారు. ఈ కార్యక్రమంలో సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కూడా ఉపన్యసించారు.

## ప్రభుత్వ ప్రయత్నాల ఫలితంగా మావోయిస్టుల భయం దూరమై..

### బస్తర్‌లో ఒక సరికొత్త 'అభివృద్ధి ఉషోదయం'
### రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

**జగదల్‌పూర్ (ఛత్తీస్‌గఢ్):** మావోయిస్టుల విషయంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాత్మక చర్య అపనమ్మక వాతావరణాన్ని అంతం చేసిందని, ఫలితంగా అభివృద్ధికి సంబంధించి ఒక కొత్త ఉషోదయం ఆవిష్కరించబడుతోందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. బస్తర్ జిల్లా కేంద్రం జగదల్‌పూర్‌లో మూడు రోజుల డివిజన్‌స్థాయి బస్తర్ 'పాండుమ్' ఉత్సవాలను ఆమె శనివారం ప్రారంభించారు. హింసను త్యజించి ప్రధాన స్రవంతిలో చేరిన వారు రాజ్యాంగం, ప్రజాస్వామ్యాన్ని విశ్వసించాలన్నారు. శాంతిమార్గంలో నడవకుండా వారిని హింసవైపునకు మళ్లించే ప్రయత్నాల ద్వారా మోసపోకూడదని హితవు పలికారు. బస్తర్ ప్రాంత సహజ సౌందర్యం, గొప్ప సాంస్కృతిక సంప్రదాయాలు ఎల్లప్పుడూ ప్రజలను అమితంగా ఆకర్షించేవన్నారు. కానీ దురదృష్టవశాత్తు బస్తర్ ప్రాంతం మావోయిజం ముప్పు కారణంగా ఏళ్ల తరబడి బాధపడుతోందని ముర్ము ఆవేదన వ్యక్తం చేశారు. నక్సలిజం యువత, దళితులు, గిరిజనులకు పూడ్చలేని నష్టాన్ని మిగిల్చిందని, గతంలో మావోయిస్టు కార్యకలాపాలతో సంబంధం ఉన్నటువంటి ప్రజలంతా ప్రస్తుతం హింసకు దూరంగా ఉన్నారని, ఫలితంగా బస్తర్ ప్రాంతంలో శాంతి పునరుజ్జీవనం దిశగా పురోగమిస్తోందన్నారు. ప్రభుత్వం ఇప్పుడు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. గ్రామస్తులకు సాధికారికత కల్పించడంలో ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం 'నియాద్ నెల్లనార్' చొరవ పాత్రను ఇది హైలెట్ చేస్తున్నదని రాష్ట్రపతి పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం చేపడుతోన్న అభివృద్ధి చర్యలను రాష్ట్రపతి ప్రశంసించారు. 2026లో పద్మ అవార్డులకు ఎంపికైన డాక్టర్ బుధ్రి టటి, డాక్టర్ రామచంద్ర గాడ్‌బోలే ఆయన సతీమణి సునిత గాడ్‌బోలేలు ఛత్తీస్‌గఢ్‌లోని మారుమూల గిరిజన గ్రామాలకు నిస్వార్థంగా సేవలు అందించినందుకు రాష్ట్రపతి ఈ సందర్భంగా వారిని అభినందించారు. ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయి మాట్లాడుతూ బస్తర్ ఒకప్పుడు నక్సలిజంతో భయాందోళనకు గురయ్యేదని, శీఘ్రగతిన అభివృద్ధి దిశగా దూసుకుపోతున్నందున ఇప్పుడు ఆ పరిస్థితి లేదని అన్నారు. ఛత్తీస్‌గఢ్ గవర్నర్ రామేన్ డే, ఇతరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**LOST PASSPORT**

I, **NAKKA NIKITHA,** D/O. **LATE NAKKA BALA MALLESH**, Plot No. 79, Sai Enclave, Kindibasthi, JJ Nagar Colony, Alwal Mandal, Medchal Malkajgiri Dist. - 500087. I lost my Passport No. **P3802491**. If anybody found return to the above mentioned address.

## పాప్‌కార్న్

### అలిస్సా 'అంగారక యాత్ర' కల్పితమే..



సోషల్ మీడియాలో ఇటీవల అలిస్సా కార్సన్ అనే యువతి అంగారక గ్రహానికి వన్‌వే టికెట్ పొందిందని, భూమిని విడిచి అక్కడ శాశ్వతంగా నివసించబోతుందన్న కథ విస్తృతంగా ప్రచారం అవుతోంది. అయితే ఈ సమాచారం పూర్తిగా అవాస్తవం. ఇది నిజాలపై ఆధారపడని, ప్రజలను తప్పుదారి పట్టించే ఒక వైరల్ కథ మాత్రమే. ప్రస్తుతం అలిస్సా కార్సన్‌ను 'నాసా' గానీ, ఇతర ఏ ప్రధాన అంతరిక్ష సంస్థ గానీ అంగారక గ్రహ మిషన్ కోసం అధికారికంగా ఎంపిక చేయలేదు. ఆమెను ప్రత్యేకంగా 'నాసా' ఎంపిక చేసిందన్న వాదన కూడా నిజం కాదు. వాస్తవానికి 'నాసా' ఇప్పటి వరకు మానవులను అంగారక గ్రహానికి పంపే మిషన్‌కు సంబంధించి సిబ్బంది ఎంపికపై ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. అంతేకాదు, 'నాసా' మిషన్లు సాధారణంగా వెళ్ళి తిరిగి వచ్చే విధంగా ప్రణాళిక ఉంటాయి. ఒకవైపు మాత్రమే ప్రయాణం చేసి తిరిగి రాని మిషన్‌ను 'నాసా' తన ప్రణాళికల్లో పెట్టలేదు. అలిస్సా తన జీవితాన్ని పణంగా పెట్టి, మార్స్‌పైకి వెళుతున్నదని, ఆమె సాహసం అద్వితీయమని సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్న నేపథ్యంలో ఆమె గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అలిస్సాకు చిన్ననాటి నుంచి అంగారక గ్రహంపై ఆసక్తి ఎక్కువ. అంతరిక్ష శాస్త్రానికి సంబంధించిన విద్య అభ్యసిస్తున్నది. స్పేస్ క్యాంపులు, వర్క్‌షాప్‌లలో పాల్గొంటున్నది. భవిష్యత్తులో అంగారక గ్రహ మిషన్‌లో భాగం కావాలన్నది ఆమె వ్యక్తిగత ఆశయం. కానీ ఈ ఆశయాన్ని సోషల్ మీడియాలో ఆమె ఇప్పటికే ఎంపిక అయింది అన్నట్టు ప్రచారం చేయడం తప్పుదారి పట్టించే విషయం. అంగారక గ్రహానికి మానవ ప్రయాణం ఇప్పటికీ ప్రణాళిక దశలోనే ఉంది. అలాంటి మిషన్ జరిగితే అది 'నాసా', యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ (ఇఎస్ఎ), స్పేస్‌ఎక్స్ వంటి పెద్ద అంతర్జాతీయ అంతరిక్ష సంస్థల సహకారంతోనే జరుగుతుంది. ప్రస్తుతం అలాంటి మిషన్‌కు సంబంధించి అధికారిక షెడ్యూల్ గానీ, ఆమోదిత ప్రణాళికలు గానీ లేవు. కాబట్టి, అలిస్సా భూమిని వదిలి శాశ్వత నివాసంకోసం అంగారక గ్రహానికి వెళ్తోందనే ప్రచారం నిజం కాదు. ఆమె ఒక అంతరిక్ష రంగంపై ఆసక్తి ఉన్న విద్యార్థిని మాత్రమే, అధికారిక వ్యోమగామి ఎంపికతో దీనికి సంబంధం లేదు.

### వెరైటీ ఐడియా..



డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వారు లేదా పట్టుబడతామన్న భయం ఉన్నవారు సహజంగా తప్పించుకునే ప్రయత్నాలు చేస్తారు. అమెరికాలోని కొలరాడో రాష్ట్రం, కొలరాడో స్ప్రింగ్స్ నగరంలో ఒక వ్యక్తి కూడా ఇలాంటి ప్రయత్నమే చేసినప్పటికీ, ఫలితం దక్కకపోగా, నవ్వులపాలయ్యాడు. అంతర్జాతీయ మీడియాలో వచ్చిన ఈ ఘటనకు సంబంధించిన వివరాల్లోకి వెళితే, రాత్రి సమయాల్లో ఎవరైనా మద్యం తాగి వాహనం నడుపుతున్నారా అని పోలీసులు రొటీన్‌గా డ్రైవ్ నిర్వహిస్తున్నప్పుడు, ఎస్‌యువి నడుపుతున్న వ్యక్తిపై అనుమానం వచ్చింది. అతను మద్యం తాగి ఉంటాడని అనుమానించి, కారును ఆపారు. అయితే, డ్రంక్ డ్రైవింగ్ కేసు తప్పించుకోవాలన్న ఆందోళనతో ఆ డ్రైవర్ ఒక విచిత్రమైన ప్లాన్ చేశాడు. పోలీసులు వాహనం దగ్గరకు రాగానే, తన పక్క సీట్లో ఉన్న పెంపుడు కుక్కను డ్రైవర్ సీట్లో కూర్చోబెట్టి, తాను పక్కకు మారేందుకు ప్రయత్నించాడు. అంటే, డ్రైవింగ్ చేసింది కుక్కే అన్నట్టు చూపించాలన్నదే అతని ఆలోచన. అయితే ఈ ప్రయత్నాన్ని పోలీసులు వెంటనే గుర్తించారు. ఒక మనిషి బాధ్యతను నాలుగు కాళ్ల జంతువుపై నెట్టేయాలన్న ఈ ప్రయత్నం వారిని ఆశ్చర్యానికి గురిచేసింది. ఈ ఘటన పూర్తిగా విఫలమైంది. డ్రైవర్‌ను పోలీసులు అరెస్ట్ చేసి, కేసు నమోదు చేశారు. ఈ సంఘటన వీడియోలు, వివరాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ ఘటన ఒక విషయం స్పష్టంగా చెబుతోంది. తప్పు చేసినప్పుడు బాధ్యత తీసుకోవడం మానవుల పని. మానవ తప్పులకు జంతువులను కారణంగా చూపడం హాస్యాస్పదమే కాక, ప్రమాదకరం కూడా.

### ప్రశ్న అడిగితే.. పోలీసులకు ఫోన్!



ఒక ప్రశ్న అడిగినందుకు ఎవరైనా పోలీసులను పిలుస్తారా? అనే అనుమానం రావచ్చు. కానీ, ఒక మహిళ అక్షరాలా అదే పనిచేసింది. సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన ఒక వీడియో ప్రకారం, ఒక మహిళను 'మీరు ప్రముఖ హాలీవుడ్ నటుడు శామ్యుయెల్ ఎల జాక్సన్ సోదరేనా' అని అడిగాడు. కాదని ఆమె స్పష్టం చేసినప్పటికీ, పోలికలు ఉన్నాయి కాబట్టి, తన అనుమానం నిజమేనంటూ వాదించడం మొదలు పెట్టాడు. దీనితో విసుగు చెందిన ఆమె పోలీసులకు ఫోన్ చేసింది. కొద్ది సేపటికే అక్కడికి పోలీసు వాహనాలు చేరుకోవడం, సైరన్‌ల శబ్దం వినిపించడం వీడియోలో కనిపిస్తుంది. ఈ మొత్తం సంఘటనను రికార్డ్ చేసిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. ఈ వీడియో పై నెటిజన్లు విభిన్న అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. కొందరు మహిళ ప్రతిస్పందన సమంజసమని అంటున్నారు. అనుకోకుండా అడిగిన ప్రశ్న అయినా, అపరిచితులు అలా ప్రశ్నించడం అసహజమని అభిప్రాయపడుతున్నారు. — బిఎస్ఎస్ మైత్రేయి

# ట్రంప్ వ్యూహాత్మక వాణిజ్య ఒప్పందం

ఫిబ్రవరి 2న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించిన, భారత ప్రధాని నరేంద్రమోదీ ధృవీకరించిన వాణిజ్య ఒప్పందంలోని వివరాలను ఇరుదేశాలు శనివారం ప్రకటించాయి. ఇది తుది ఒప్పందం కాదు. దానికి దారితీసే మధ్యంతర ఒప్పందం చట్రం. ఇది కేవలం వాణిజ్య ఒప్పందం కాదు – అమెరికాతో భారతదేశ సంబంధాలలో వాణిజ్యం, భద్రత, సార్వభౌమత్వం పునర్‌నిర్దేశించబడుతున్నాయి. ఈ ఒప్పందం వాణిజ్య సుంకాల్లో ఉపశమనం కలుగజేస్తున్నట్లు పైకి కనిపిస్తున్నా, వాణిజ్య స్వయం ప్రతిపత్తి, నియంత్రణలు, వ్యూహాత్మక వెసులుబాటును కట్టడి చేస్తున్న అంశాలు దానిలోపల దాగి ఉన్నాయి. వచ్చే ఐదు సంవత్సరాల్లో భారత్ అమెరికా నుంచి 500 బిలియన్ డాలర్ల విలువైన అమెరికా చమురు వగైరా, విమానాలు, విమాన భాగాలు, వజ్రాభరణాలు, టెక్నాలజీ ఉత్పత్తు లు, కోకింగ్ కోల్ కొనుగోలు చేస్తుంది.

అధ్యక్షుడు ట్రంప్ గత సంవత్సరం ఆగస్టులో మనదేశం నుంచి దిగుమతులపై విధించిన 25 శాతం సుంకాలను, రష్యా నుంచి ఆయిలు కొనుగోలు చేస్తున్నందుకు శిక్షాత్మకంగా విధించిన మరో 25శాతం సుంకాలను రద్దుచేసి, దిగుమతులపై సుంకాన్ని 18 శాతానికి తగ్గించారు. కాని అందుకు మోదీ ప్రభుత్వం చెల్లిస్తున్న మూల్యం అమెరికా నుంచి దిగుమతులపై సుంకం పూర్తిగా మినహాయించింది. అంతకుమించి ప్రమాదకరంగా ఆయిలు కొనుగోలులో తన 'వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తి'ని కోల్పోయింది. సర్వకాలాల్లో మన దేశ రక్షణకు, ఆర్థిక పురోభివృద్ధికి అండగా నిలబడిన రష్యా నుంచి ఆయిలు కొనుగోలును నిలుపు చేస్తున్నట్లు ప్రభుత్వం బహిరంగంగా చెప్పదు. డిసెంబర్ నాటికే రష్యన్ ఆయిలు దిగుమతులు గణనీయంగా తగ్గిపోయాయి; అమెరికా నుంచి ఆయిలు దిగుమతులు ఇబ్బెడుముబ్బెడుగా పెరిగాయి.

అమెరికాతో ఈ ఒప్పందంపట్ల మోదీ ప్రభుత్వం ఉబ్బితబ్బిబ్బవుతున్నట్లు ప్రభుత్వ ప్రచారం తెలియజేస్తున్నది. వస్త్రాలు, దుస్తులు, చర్మం, పాదరక్షలు, ప్లాస్టిక్, రబ్బర్, ఆర్గానిక్ కెమికల్స్, గృహాలంకరణ, హస్తకళా ఉత్పత్తులు, కొన్ని యంత్రాల ఎగుమతులు పెరుగుతాయని, దీనివల్ల లక్షలాదిమందికి ఉపాధి దొరుకుతుందని, అంతేగాక జనరిక్ ఔషధాలు, వజ్రాలు, రంగురాళ్లు, విమాన విడిభాగాలపై సుంకమే ఉండదని ప్రభు త్వం చెబుతోంది. మన వ్యవసాయ రంగాన్ని, రైతుల ప్రయోజనాల రక్షణకై వ్యవసాయోత్పత్తులు, పాల ఉత్పత్తులను ఒప్పందంలో చేర్చలేదని చెబుతోంది. ఇది అర్థసత్యం.

భారతదేశంతో వాణిజ్య ఒప్పందం కింద అధ్యక్షుడు ట్రంప్ అమెరికన్ వ్యవసాయదారులు, ఉత్పత్తిదారులకు ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో ఒకటైన భారతదేశ మార్కెట్‌తో సంబంధం ఏర్పరిచారని అమెరికా వాణిజ్య ప్రతినిధి జెమీసన్ గ్రీర్ చెప్పారు. అమెరికన్ కార్మికులు, ఉత్పత్తిదారులకు భారత్ ఆర్థిక వ్యవస్థ ద్వారాలు తెరుస్తున్నదని ఆయన వ్యాఖ్యానించారు. కాగా మొక్కజొన్న, గోధుమలు, బియ్యం, సోయా, పౌల్ట్రీ, పాలు, వెన్న, ఎథనాల్, పొగాకు, కొన్ని రకాల కూరగాయలు, మాంసం వగైరా దిగుమతులు ఉండబోవని మన వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ చెబుతున్నారు. ఉప్పునీటిని శుద్ధిచేసే ఎండు గుళికలు, జంతువుల మేతకు వాడే ఎర్రజొన్నలు, చెట్టు బెరడుకాయలు, తాజా–శుద్ధి చేయబడిన ఫలాలు, సోయాబిన్ ఆయిలు, వైన్, స్పిరిట్లు వగైరా అనేకానేక అమెరికన్ ఆహార, వ్యవసాయ ఉత్పత్తులపై, అనేక పారిశ్రామిక ఉత్పత్తులపై సుంకాలను భారత్ రద్దు చేస్తుంది, కనీస స్థాయికి తగ్గిస్తుందని ఒప్పంద చట్రం చెబుతోంది.

భారత వస్తువులపై సుంకాలను అమెరికా 18శాతానికి తగ్గించటం వల్ల భారత్ ఎగుమతిదారులకు, ముఖ్యంగా చిన్న–మధ్య తరహా పరిశ్రమలు, రైతులు, మత్స్యకారులకు 30 ట్రిలియన్ డాలర్ల అమెరికన్ మార్కెట్ తలుపులు తెరుస్తుందని కూడా గోయల్ గొప్పలు చెబుతున్నారు.

వాణిజ్యం ఒప్పందం అన్నాక ఇచ్చిపుచ్చుకోవటాలు తప్పదని కొందరు వాదించవచ్చు. అయితే భారత్‌పై కారాలు మిరియాలు నూరుతున్న ట్రంప్ ఇంత ఆకస్మికంగా ఈ ఒప్పందానికి రావటంలోని ఆంతర్యమేమిటని కొందరు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. జనవరి 27న యూరోపియన్ యూనియన్‌తో భారత్ సంతకం చేసిన దీర్ఘకాలిక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ఇందుకొక అంశంగా చెబుతున్నారు. అంతకన్నా మించి తన చైనా వ్యతిరేక వ్యూహంలో భారత్‌ను కట్టడిచేయటం ట్రంప్ ప్రధాన వ్యూహంగా కొందరు వ్యాఖ్యానిస్తున్నారు. దాదాపు రెండు దశాబ్దాలుగా ఎంతో శ్రమించి భారత్‌ను అమెరికా చేరువకు తీసుకురాగా ట్రంప్ తన సుంకాలపెంపు నిర్ణయంతో దూరం చేశారని అమెరికన్ దౌత్యవేత్తలు, సీనియర్ సెనెటర్లు విమర్శించారు. రానున్న కాంగ్రెస్ మధ్యంతర ఎన్నికల్లో ప్రతికూలత చూపుతుందని హెచ్చరికలు చేశారు.

ఈ ఒప్పందం కారణంగా భారత్ తమ వాణిజ్యంలో 'వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తి' కోల్పోయింది. మన దేశ రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నప్పటికీ మన వ్యవసాయరంగంలోకి అమెరికాను దొడ్డిత్రోవన ప్రవేశపెడుతోంది. రష్యా, ఇరాన్‌ల నుంచి ఆయిలు దిగుమతులు గణనీయంగా తగ్గించుకుంటూ, అంతిమంగా అమెరికాపై ఆధారపడే స్థితి తెస్తూ మన సార్వభౌమాధికారానికి ముప్పు తెస్తున్నది. ఒకవైపు చైనాతో సంబంధాలను మెరుగుపరుచుకునే ప్రయత్నాలు చేస్తున్నట్లు కనిపిస్తూనే, దానికి వ్యతిరేకంగా అమెరికా వ్యూహంలోకి ప్రవేశిస్తున్నది. గ్లోబల్ సౌత్ (వర్ధమాన దేశాలు)కు నాయకత్వ పాత్రను కోల్పోతున్నది. అత్యంత కీలకమైన, వ్యూహాత్మకమైన, అరుదైన భూగర్భలోహాల్లో చైనా ఆధిపత్యాన్ని ఎదుర్కొనేందుకు అమెరికా ఏర్పాటు చేస్తున్న 50దేశాల శిబిరంలోకి భారత్‌ను ట్రంప్ ఆహ్వానిస్తున్నారు. అదే విధంగా గాజా పునర్నిర్మాణం పేరు తో ట్రంప్ తన అధ్యక్షతన ఏర్పాటుచేసిన 'బోర్డ్ ఆఫ్ పీస్'లోకి భారత్‌కు ఆహ్వానం ఉంది. మోదీ ప్రభుత్వ దిగజారుడుకు వ్యతిరేకంగా, భారతదేశ సాంప్రదాయక విదేశాంగ విధానాలకోసం దేశ ప్రజలు నడుం కట్టాలి. దేశ సార్వభౌమత్వాన్ని, అంతర్జాతీయ ప్రతిష్టను కాపాడుకోవాలి. ●

# బంగ్లాదేశ్ గమనాన్ని పునర్నిర్వచించే ఎన్నికలు

బంగ్లాదేశ్ భవిష్యత్తును నిర్దేశించబోయే కీలకమైన ఎన్నికలు ఫిబ్రవరి 12వ తేదీన జరగనున్నాయి. మొత్తం 350 స్థానాలు కలిగిన జాతీయ సంగ్‌సద్ (నేషనల్ పార్లమెంట్)లోని 300 స్థానాలకు ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహిస్తున్నారు. మిగతా 50 స్థానాలు మహిళలకు రిజర్వు చేయబడ్డాయి. వాటికి సాధారణ ఎన్నికల్లో ఆయా పార్టీలకు లభించిన ఓట్ల ఆధారంగా దామాషా పద్ధతిలో మహిళలను నామినేట్ చేస్తారు. గత ఏడాది విద్యార్థుల తిరుగుబాటుతో ఆగస్టులో ప్రధాన మంత్రి పదవికి షేక్ హసీనా రాజీనామా చేసి, భారతదేశంలో తలదాచుకుంటున్నారు. అనిశ్చిత పరిస్థితుల నేపథ్యంలో జాతీయ సంగ్‌సద్‌ను బంగ్లాదేశ్ దేశాధ్యక్షుడు మహమ్మద్ షహాబుద్దీన్ రద్దు చేశారు. విద్యార్థి సంఘాలు, మిలిటరీ మధ్య జరిగిన చర్చల ఫలితంగా నోబెల్ బహుమతి గ్రహీత మహ్మద్ యూనుస్ ప్రధాన సలహాదారుడిగా మధ్యంతర ప్రభుత్వం ఏర్పాటైంది. ఇప్పుడు అప్పుడు అంటూ ఎన్నికల నిర్వహణను ఆయన తాత్సారం చేశారు. చివరకు 2026 ఏప్రిల్‌లో నిర్వహిస్తామని ప్రకటించినప్పటికీ, రాజకీయ పార్టీలు వ్యతిరేకించడంతో ఫిబ్రవరి 12న నిర్వహించేందుకు అంగీకరించారు. ఈ ఎన్నికలతో పాటుగా జూలై చార్టర్‌కు అనుగుణంగా రాజ్యాంగ సవరణపై రెఫరెండం కూడా నిర్వహిస్తారు. ఎన్నికల్లో 300 స్థానాలకు పోటీ పడుతున్న 1,981 అభ్యర్థుల భవితవ్యాన్ని 12.76 కోట్లమంది ఓటర్లు తేల్చనున్నారు. ఫిబ్రవరి 12న పోలింగ్ ముగిసిన వెంటనే, అదే రోజు ఓట్ల లెక్కింపు కూడా జరుగుతుంది. ఈ ఎన్నికల్లో 'నో ఓట్' విధానాన్ని పునరుద్ధరించారు. అభ్యర్థులు ఎవరికీ ఓటు వేయడం ఇష్టం లేకపోతే, మన దగ్గర నోటా తరహాలో బ్యాలెట్‌పై 'నో ఓట్' అనే కాలమ్ ఉంటుంది. ఒక స్థానంలో 'నో ఓట్'కు అభ్యర్థుల కంటే ఎక్కువ ఓట్లు పోలైతే ఆ స్థానంలో మరోసారి ఎన్నికలు నిర్వహిస్తారు. అలాగే బంగ్లాదేశ్‌లో జన్మించి, ఇతర దేశాల్లో ఉంటున్న వారికి కూడా ఓటు హక్కును కల్పించే పోస్టల్ బ్యాలెట్ విధానాన్ని తొలిసారిగా ప్రవేశపెట్టారు. ఈసారి బంగ్లాదేశ్‌లో రెండవ తరం ప్రధాన రాజకీయ నాయకుల ప్రమేయం, పాత్ర లేకుండానే తొలిసారిగా ఎన్నికలు జరుగుతుండడం విశేషం.

**రెండు కూటముల మధ్య ప్రధాన పోటీ**

మాజీ ప్రధాని షేక్ హసీనా వాజెద్‌కు చెందిన అవామీ లీగ్ పార్టీని ఎన్నికల్లో పాల్గొనకుండా మధ్యంతర ప్రభుత్వం నిషేధించింది. దీంతో మొదటిసారి ఆ పార్టీ పోటీలో లేకుండా పోయింది. ఎన్నికల బరిలో ఐదు కూటములు ఉన్నప్పటికీ, ప్రధాన పోటీ బిఎన్‌పి నేతృత్వంలోని కూటమి, బంగ్లాదేశ్ జమాత్ ఎ ఇస్లామీ నేతృత్వంలోని 11 పార్టీ కూటమి మధ్యే కేంద్రీకృతమైంది. బంగ్లాదేశ్ కమ్యూనిస్టు పార్టీ (సిపిబి) నేతృత్వంలో ఐదు పార్టీలు డెమోక్రాటిక్ యునైటెడ్ ఫ్రంట్‌గా ఏర్పడి పోటీ చేస్తున్నాయి. మాజీ అధ్యక్షుడు ఎర్షాద్‌కు సంబంధించిన జాతీయ పార్టీ (ఎర్షాద్) నేతృత్వంలో నేషనల్ డెమోక్రటిక్ ఫ్రంట్ సైతం బరిలో ఉంది.

షేక్ హసీనా వాజెద్‌కు ప్రధాన ప్రత్యర్థిగా ఉన్న బిఎన్‌పి అధ్యక్షురాలు, మాజీ ప్రధాని బేగం ఖలేదా జియాను అవినీతి కేసులో 2018 నుంచి జైల్లో ఉంచారు. షేక్ హసీనా బంగ్లాదేశ్‌ను వీడిపోగానే మధ్యంతర ప్రభుత్వం ఖలేదాను కేసుల నుంచి విముక్తి చేసి, జైలు నుంచి విడుదల చేసింది. అయితే, తీవ్ర అనారోగ్యం కారణంగా గత డిసెంబర్‌లో ఆమె కన్నుమూశారు. దీంతో 17 ఏళ్లుగా లండన్ ప్రవాస జీవితం నుంచి ఆమె కుమారుడు తారీఖ్ రెహమాన్ బంగ్లాదేశ్‌కు తిరిగి వచ్చారు. బిఎన్‌పికి తాత్కాలిక అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టి, ఎన్నికలకు నేతృత్వం వహిస్తున్నారు. ఆ పార్టీ అందరికంటే ఎక్కువగా 289 సీట్లలో పోటీ చేస్తోంది. షఫీక్ ఉర్ రెహమాన్ నేతృత్వంలోని మత ఛాందసవాద పార్టీ బంగ్లాదేశ్ జమాత్ ఎ ఇస్లామీ పాకిస్థాన్ అనుకూల వైఖరితో పాటు, మైనారిటీల వ్యతిరేకంగా వ్యవహరిస్తోంది. తిరుగుబాటులో ప్రధాన పాత్ర పోషించిన విద్యార్థి సంస్థలు నేషనల్ సిటిజన్ పార్టీ (ఎన్‌సిపి)గా రాజకీయ రూపం తీసుకున్నాయి. తొలుత స్వతంత్రంగానే పోటీ చేయాలని భావించినప్పటికీ, చివరకు జామాత్ ఎ ఇస్లామీ ఆధ్వర్యంలో 11 పార్టీల కూటమిలో భాగస్వామిగా మారింది.




**నిరుద్యోగం, అవినీతే ప్రధాన ప్రచారాంశాలు**

ఈ ఎన్నికల్లో అన్ని పార్టీలు ప్రధానంగా నిరుద్యోగం, అవినీతి, బలవంతపు వసూళ్ళకు సంబంధించిన అంశాలను ప్రచారం చేసుకుంటున్నాయి. అలాగే దామాషా విధానంలో ఎన్నికలు, రాజ్యాంగ సవరణ కూడా ప్రచారం లో చోటు చేసుకుంటున్నాయి. బిఎన్ పి ప్రచారం తమ నూతన అధ్యక్షుడు తారీఖ్ అన్వర్ వ్యక్తిత్వం చుట్టే సాగుతోంది. అతివాద ధోరణి నుంచి ఆ పార్టీ ఉదారవాదిగా తన వైఖరిని మార్చుకుంది. తద్వారా మధ్యేవాద, వామపక్ష ఓట్లను మలుపుకోవాలనేది బిఎన్‌పి ఉద్దేశ్యం. తాము అధికారంలోకి వస్తే ప్రజాస్వామ్యం, పౌర హక్కుల పునరుద్ధరిస్తామని చెబుతోంది. 40 లక్షల కుటుంబాలకు ఫ్యామిలీ కార్డులు ఇచ్చి, నెల ఖర్చులకు సరిపోయే మొత్తాన్ని అందిస్తామని, 18 మాసాల్లో కోటి ఉద్యోగాలు కల్పిస్తామని ఎన్నికల హామీలను గుప్పించింది. రైతులకు ఫార్మర్ కార్డులు ఇస్తామని చెబుతోంది. జమాత్ ఎ ఇస్లామీ అవినీతి రహిత పాలన అందిస్తామని, వడ్డీ రహిత రుణాలు, పన్నుల తగ్గింపు, సోషల్ సెక్యూరిటీ కార్డు వంటి హామీలను మ్యానిఫెస్టోలో పొందుపరిచింది. ఐదేళ్ళలో కోటి మంది యువతకు శిక్షణ ఇచ్చి, 15 లక్షల మందిని వ్యాపారులుగా తీర్చిదిద్దుతామని పేర్కొంది. ఎన్‌సిపి 'నవ బంగ్లాదేశ్' పేరుతో మ్యానిఫెస్టోను ప్రకటించింది. కొత్త రాజ్యాంగం, జూలై తిరుగుబాటుకు జాతీయ గుర్తింపు, రాజకీయాలలో నల్లధనం పాత్రను తగ్గించడం, విలేజ్ పార్లమెంట్ తదితర వాగ్దానాలను చేసింది.

**వామపక్ష కూటమి**

కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ బంగ్లాదేశ్ (సిపిబి) నేతృత్వంలో గత నవంబర్ 29న ఏడు సూత్రాలతో రాజకీయ డియుఎఫ్ ఏర్పాటైంది. భావ ప్రకటనా స్వేచ్ఛ, వ్యక్తీకరణను, సాంస్కృతిక, సాహిత్య, ప్రజాస్వామ్య ఆకాంక్షలు, యువ శక్తి అభివృద్ధి, విద్యా వ్యవస్థ పునరవ్యవస్థీకరణ తదితర హామీలతో మ్యానిఫెస్టో విడుదల చేసింది. 'వ్యవస్థ మార్పు కోసం..' పేరు తో సిపిబి విడిగా 18 అంశాలతో మ్యానిఫెస్టో విడుదల చేసింది. ప్రజాతంత్ర పునర్నిర్మాణం, చట్టబద్ధ పాలన, ఎన్నికల సంస్కరణలు, అసమానతలు, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం తగ్గింపు, మీడియా, సమాచార హక్కు తదితర హామీలతో పాటు ప్రపంచ శాంతి ఆధారిత విదేశాంగ విధానాన్ని స్థాపిస్తామని పేర్కొంది.

**కీలకంగా 'జెన్ జీ', అవామీ లీగ్, మైనారిటీల ఓట్లు**

బంగ్లాదేశ్ ఎన్నికల్లో యువత ఓట్లు ప్రభావితం చేసే అవకాశాలు ఉన్నాయి. మొత్తం 12.70 కోట్ల ఓట్లలో 64.81లక్షలమంది పురుషులు, 62.87లక్షల మహిళా ఓటర్ల ఉండగా, థర్డ్ జెండర్ ఓట్లు 1,234గా ఉన్నాయి. అలాగే ఓటర్లలో 18–37 వయసు ఉన్న వారు 5.6 కోట్లు జనరేషన్ జీ (జెన్ జీ) ఓటర్లు ఉన్నా రు. జూలై తిరుగుబాటులో ఈ వర్గమే ప్రధాన పాత్ర పోషించింది. యువతను ఆకట్టుకునేందుకు అన్ని పార్టీలు సకల ప్రయత్నాలు చేస్తున్నాయి. ఎన్‌సిపి ఒకడుగు ముందుకేసి ఓటు హక్కు అర్హత వయస్సును 16 సంవత్సరాలకు తగ్గిస్తామని వాగ్దానం చేసింది. మరోవైపు ప్రస్తుత ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధానికి గురైన ఆవామీ లీగ్ పార్టీ ఓట్లపై అన్ని పార్టీలు గురిపెట్టాయి. వారిని తమ వైపు తిప్పుకునేందుకు వేధింపు చర్యలు ఉండబోవని హామీలను గుప్పిస్తున్నాయి. అలాగే మైనారిటీలు, ముఖ్యంగా పెద్ద సంఖ్యలో, అంటే జనాభాలో 8 శాతం హిందువులు ఉంటారు. గతంలో వీరిలో అత్యధికులు అవామీ లీగ్‌కు ఓట్లు వేశారు. ఇటీవల హిందూ యువకుడి హత్యోదంతం వారిలో భయాందోళనను కలిగిస్తోంది. అయితే, వారిని ఆకట్టుకునేందుకు అన్ని పార్టీలు ప్రయత్నిస్తున్నాయి. బిఎన్‌పి ఇద్దరు హిందువులను పోటీలో పెట్టింది. తమ ప్రభుత్వం ఏర్పడితే మైనారిటీల రక్షణకు ప్రత్యేక ట్రిబ్యూనల్, సెక్యూరిటీ సెల్‌ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చింది. జమాత్ ఎ ఇస్లామీ సైతం ఒకరిని తమ పార్టీ తరుపున నిలబెట్టింది. అయితే, ఆ పార్టీ అధికారంలోకి వస్తే షరియాను అమలు చేస్తుందనే ప్రచారం ఉంది. అలాంటిదేమి ఉండబోదని జమాత్ ఎ ఇస్లామీ తాజాగా చెబుతోంది. మరోవైపు ఎన్నికల సందర్భంగా రాజకీయ హింస ఆందోళన కలిగిస్తోంది. ఈ కారణంగా కొంత మంది తమ ఓటు హక్కును వినియోగించుకోలేరేమోనని సందేహం వ్యక్తమవుతోంది.

**భారతదేశంతో దూరం తగ్గేనా?**

భారతదేశం, బంగ్లాదేశ్‌లు చారిత్రక, సాంస్కృతిక సంబంధాలు, 4 వేల కిలోమీటర్లకు పైగా సరిహద్దు కలిగి ఉన్నాయి. బంగ్లాదేశ్ ఏర్పాటు లో మన దేశం కీలక సహకారం అందించింది. దశాబ్దాలుగా ఇరు దేశాల మధ్య మంచి సంబంధాలే కొనసాగాయి. అయితే, ఇటీవల పెనుమార్పు లు సంభవించాయి. మొదటి నుంచి మతఛాందసవాద పార్టీ జమాత్ ఎ ఇస్లామీ పాకిస్థాన్ అనుకూల వైఖరి, మైనారిటీల వ్యతిరేక వైఖరి ప్రదర్శిస్తుంది. ఆ పార్టీ హసీనా హయాంలో నిషేధానికి కూడా గురైంది. జూలై తిరుగుబాటులో జమాత్ ఎ ఇస్లామీ కూడా ప్రముఖ పాత్ర పోషించడంతో, ఆ పార్టీ ప్రాబల్యంతో పాటు భారతదేశం వ్యతిరేకత కూడా పెరిగింది. మరోవైపు బిఎన్‌పి కూడా షేక్ హసీనాపై ఉన్న వ్యతిరేకతతో ఆమెకు ఆశ్రయం ఇవ్వడం పట్ల భారతదేశం పట్ల విముఖతతో ఉంది. ఈ ధోరణిని ప్రస్తుత మధ్యంతర ప్రభుత్వ ప్రధాన సలహాదారుడు మహమ్మద్ యూనుస్ పెంచి పోషించారు. చైనా పర్యటనలో ఆయన భారతదేశాన్ని ఈశాన్య రాష్ట్రాలతో అనుసంధానం చేసే చికెన్ నెక్ కారిడార్ స్వాధీనంపై చేసిన వ్యాఖ్యలు భారత్‌పై వ్యతిరేకతను చాటాయి. ప్రస్తుతానికైతే బంగ్లాదేశ్ భారతదేశం పట్ల వ్యతిరేక ధోరణితోనే వ్యవహరిస్తోంది. తాజాగా భారతదేశంలో జరిగే టి 20 ప్రపంచ కప్ క్రికెట్ టోర్నమెంట్‌లో తమ టీమ్ పాల్గొనదని బంగ్లాదేశ్ ప్రభుత్వం ప్రకటించింది. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తరువాత పాలక పార్టీ ఎలాంటి వైఖరిని తీసుకుంటుందనే దానినిబట్టి ఇరు దేశాల మధ్య సంబంధాలు ఆధారపడి ఉంటాయి.

బి.కె.

# మీడియా స్వేచ్ఛ దారితప్పిందా?

## రాజధాని సందడి

– బొమ్మగాని కిరణ్‌కుమార్

గడచిన వారం రోజుల్లో కొన్ని కీలక ఘట్టాలు చోటు చేసుకున్నాయి. ప్రముఖ స్వాతంత్ర్యసమరయోధులు, పద్మవిభూషణ్ రావి నారాయణ రెడ్డి జాతీయ స్మారక అవార్డు ప్రదానోత్సవ సభ జరిగింది. ఆ అవార్డును ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి చేతులు మీదుగా అందుకున్న జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి 'భారత రాజ్యాంగం – భావ ప్రకటనా స్వేచ్ఛ' అనే అంశంపై రావి నారాయణ రెడ్డి స్మారకోపన్యాసం చేశారు. ఆ సందర్భంగా ఏ దేశమూ, రాజ్యాంగమూ అపరిమితమైన భావ ప్రకటనా స్వేచ్ఛ ఇవ్వలేదని వ్యాఖ్యలు చేశారు. స్వేచ్ఛా పిపాసి అయిన ప్రథమ ప్రధాన మంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ స్వయంగా భావ ప్రకటనా స్వేచ్ఛకు సంబంధించి పరిమితుల ను తీసుకువచ్చిన రెండు రాజ్యాంగ సవరణల గురించి సాకల్యంగా వివరించారు. 1953, 1963లో రెండుసార్లు రాజ్యాంగంలో భావ ప్రకటనా స్వేచ్ఛ కల్పించే అధికరణలో ప్రజాభద్రత, దేశ సార్వభౌమత్వానికి సంబంధించిన వ్యవహారాలలో పరిమితులు విధిస్తూ సవరణలు చేసారు. అయితే, మొదటి సవరణ ఆర్గనైజర్, క్రాస్ రోడ్స్, భారతి అనే పత్రికల్లో వచ్చిన వ్యాసాల నేపథ్యంలో వచ్చినవి. వాటిపై కోర్టుల్లో వచ్చిన తీర్పుల ఆధారంగా పరిమితులు విధించబడినవి. రెండవసారి ద్రవిడనాడు ఉద్యమంలో భాగంగా చేసిన ప్రసంగాల ఆధారంగా సవరణ జరిగింది. రాజ్యాంగంలోని 19 (1)(ఎ)లో పేర్కొన్న భావ ప్రకటనా స్వేచ్ఛను మీడియా స్వేచ్ఛకు అన్వయించుకోవడం సర్వసాధారణం.

కానీ, నేడు మీడియా స్వేచ్ఛ అనేది నిజంగా జర్నలిస్టుల స్వేచ్ఛగా ఉందా? యాజమాన్యాల స్వేచ్ఛగా ఉందనేది ప్రశ్నార్థకం. నాడు ఆయా పత్రికలు, లేదా నాయకులు వారు విశ్వసించే సిద్ధాంతాల ఆధారంగా వ్యాసాలు, ప్రసంగాలు చేసేవారు. ఇటీవల కాలంలో మీడియాలో రాజకీయ నాయకులు, అధికారుల వ్యక్తిగత అంశాలపై మితిమీరి చేస్తున్న వ్యాఖ్యానాలు, హద్దు మీరిన వ్యక్తిగత ఆరోపణలు చర్చనీయాంశంగా మారాయి. మరీ ముఖ్యంగా సోషల్ మీడియా వ్యవహారంలో ఇది ఎక్కువే. ఇదే వారంలో మీడియా అకాడమీలో సీనియర్ జర్నలిస్టుల క్లుప్త చరిత్ర పుస్తకాలను ఆవిష్కరించిన కార్యక్రమంలో పూర్వాశ్రమంలో జర్నలిస్టుగా, గతంలో ప్రెస్ కౌన్సిల్ సభ్యులుగా ఉన్న ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె.కేశవరావు కూడా ఈ అంశాన్ని ప్రస్తావించారు. నాయకులను పట్టుకొని దూషించటం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. దీనిని నియంత్రించేందుకు జాతీయ స్థాయిలో ప్రెస్ కౌన్సిల్ ఉంది. అయితే, అది ఇటీవల కాలంలో దాదాపు డిఫంక్ట్ అయిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో మీడియాలో లక్ష్మణరేఖను దాటి వచ్చే వార్తల కట్టడికి ఒక వ్యవస్థ అవసరమని కేశవరావు నొక్కి చెప్పారు. అందుకు రాష్ట్ర స్థాయిలోనే మీడియా కౌన్సిల్‌ను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని, దాని ద్వారా కొంత నియంత్రణ ఏర్పడుతుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ సభకు అధ్యక్షత వహించిన మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి రాష్ట్ర స్థాయిలో ప్రెస్ కౌన్సిల్ ఏర్పాటు ప్రతిపాదన దశాబ్దాల క్రితం ఉమ్మడి రాష్ట్రంలో తెరపైకి వచ్చినప్పటికీ, ముందుకు సాగని విషయాన్ని గుర్తు చేశారు. కేశవరావుతో పాటు, సభ అతిథిగా హాజరైన శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఈ అంశంపై చొరవ తీసుకుంటే బాగుంటుందనే సూచన కూడా చేశారు.

కేవలం ప్రతికలే వార్తలకు ఆధారంగా ఉన్న రోజుల్లో భావ ప్రకటన స్వేచ్ఛ విషయంలో మీడియా స్వీయ నియంత్రణ పాటించేవి. కానీ, వార్తా ఛానల్స్ వచ్చాక కొంత చెరిగిపోయింది. యూట్యూబ్ ఛానల్స్ వచ్చాక లక్ష్మ ణ రేఖ దాటే పరిస్థితి వచ్చింది. ఇప్పటికీ సంప్రదాయపద్ధతిలో పని చేస్తున్న ప్రింట్ మీడియా భావ ప్రకటనా స్వేచ్ఛ విషయంలో కొంత జాగ్రత్తలు తీసుకుంటున్నా, యూట్యూబ్‌ల యుగంలో అవీ ప్రభావితమవుతున్నాయి. గతంలో నాయకులు అగౌరవ, అసభ్య పదాలు వాడితే, వాటిని ప్రచురించకపోయేవి. కానీ, ఇప్పుడు వాటినే హైలైట్ చేస్తున్నారు. ఇందుకు ప్రధాన కారణం పోస్ట్ లిబరలైజేషన్ కాలంలో మీడియాపై కార్పొరేట్ సంస్థల ఆధిపత్యం పెరిగి, జర్నలిస్టుల స్వేచ్ఛ తగ్గడమే. యాజమాన్యాల వైఖరికి అనుగుణంగానే జర్నలిస్టులు కూడా వైఖరి తీసుకొని, హద్దు దాటి వార్తలు రాయడం, వ్యాఖ్యానాలు చేయడం కనిపిస్తోంది.

**మీడియాపై కార్పొరేట్ ఆధిపత్యమే అతి పెద్ద ప్రమాదం**

మీడియా స్వేచ్ఛ కంటే స్వేచ్ఛా మీడియా మనుగడపై ఎక్కువ చర్చ జరగాల్సిన తరుణమిది. ఎందుకంటే బలమైన, స్వతంత్ర మీడియా ఆధారంగానే ప్రజాస్వామ్యం మనగలుగుతుందని చరిత్ర నిరూపిస్తున్నది. గత నెల దావోస్‌లో వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సు నేపథ్యంలోనే 'రెసిస్టింగ్ ద రూల్ ఆఫ్ రిచ్' పేరుతో ఆక్స్‌ఫామ్ ఇంటర్నేషనల్ విడుదల చేసిన నివేదికలో విస్మయకర నిజాలను వెల్లడయ్యాయి. దీని ప్రకారం 2025లో ప్రపంచవ్యాప్తంగా బిలియనీర్ల సంపద గత ఐదేళ్ళలో కంటే మూడింతలు వేగంగా పెరిగింది. అంతే వేగంగా ఆర్థిక అసమానతలు కూడా పెరిగాయి. సంపదకు, అసమానతలకు ముడిపెడుతూ అసమానతలు ఎక్కువగా ఉన్న దేశాలలో ప్రజాస్వామ్యం ఏడింతలు వేగంగా క్షీణిస్తున్నదని నివేదిక పేర్కొంది. సామాన్యుల కంటే సంపన్నులు 4,000 రెట్లు అధికంగా రాజకీయ స్థానాలను పొందే అవకాశాలు ఉన్నాయి.(మన మున్సిపల్ ఎన్నికల్లో దీనిని ప్రత్యక్షంగా చూస్తూనే ఉన్నాం. కౌన్సిలర్‌కు రూ.30 లక్షలు, చైర్మన్ పదవి కావాలంటే రూ.3 కోట్లు అనే వార్తలు బహిరంగంగానే వినవస్తున్నాయి.)

ఆక్స్‌ఫామ్ నివేదిక ప్రకారం ఆర్థికశక్తిని రాజకీయ శక్తిగా మార్చుకోవడంలో భాగంగా బిలియనీర్లు మీడియాలో పెట్టుబడులు పెడుతున్నారు. సామాన్యులను ఎక్కువగా ప్రభావితం చేస్తున్న పది సోషల్ మీడియా కంపెనీలో తొమ్మిది ఆరుగురు శతకోటీశ్వరుల ఆధీనంలో ఉన్నాయి. అలాగే పది అతి పెద్ద మీడియా, ప్రెస్ కంపెనీలలో న్యూయార్క్ టైమ్స్, వార్నర్ బ్రదర్స్ డిస్కవరీ, వెల్ కెనడా ఎంటర్‌ప్రైజెస్ మినహా ఏడు పెద్ద మీడియా సంస్థలు బిలియనీర్ల యాజమాన్యంలోనే నడుస్తున్నాయి.

**వాషింగ్టన్ పోస్ట్ తాజా ఉదాహరణ**

బిలియనీర్ల చేతుల్లో మీడియా సంస్థలు కేవలం వారి వ్యాపార విస్తరణకు, తాము మద్దతిస్తున్న రాజకీయ పార్టీలకు అనుకూలంగా వ్యవహరిస్తాయే తప్ప ప్రజల కోణంలో పని చేయడం అరుదు. వాటిని కూడా లాభాల కోణంలోనే చూస్తారు. లాభాలు రాకుంటే మూసేయడమో, కోతలు విధించడమో చేస్తారు..ఇందుకు తాజా ఉదాహరణ అమెరికాలోనే ప్రముఖ పత్రిక 'వాషింగ్టన్ పోస్ట్' నుంచి 300 మంది జర్నలిస్టులను తొలగించడం. ఈ పత్రికను ప్రపంచ ధనికుల జాబితాలో 3, 4 స్థానాలలో ఉండే అమెజాన్ సంస్థ యజమాని జెఫ్ బెజోస్ 2013లో కొనుగోలు చేశారు. ఆయన అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు అనుకూలురు. పత్రికను కూడా అదే వైఖరితో నడపమని కోరడంతో సర్క్యులేషన్, ఆన్‌లైన్ సబ్‌స్క్రిప్షన్ గణనీయంగా పడిపోయింది. ఫలితంగా 800 మంది సిబ్బందిలో 300 మంది జర్నలిస్టులను తొలగించారు.

భారతదేశంలో సైతం మీడియా ఇప్పుడు కార్పొరేట్ గుప్పిట్లోకి వెళ్ళిపోతోంది. జాతీయ మీడియాలో అత్యధిక భాగం అదానీ, లేదా అంబానీ గ్రూపులకు చెందిన సంస్థలు హస్తగతం చేసుకున్నాయి. స్వతంత్ర వాణిని వినిపించే ఎన్‌డిటివిని సైతం అదానీ కంపెనీ సొంతం చేసుకుంది. చివరకు వివిధ పత్రికలు,ఛానల్స్‌కు వార్తలు అందించే వార్తా సంస్థలను సైతం కార్పొరేట్ సంస్థలు వదలడం లేదు. తాజాగా ఐఎఎన్ఎస్ న్యూస్ ఏజెన్సీని సైతం అదానీ కంపెనీ సొంతం చేసుకోనున్నట్లు వార్తలు వచ్చాయి.అత్యధిక సర్క్యులేషన్ కలిగిన పత్రికల వాటాలను కూడా కార్పొరేట్ సంస్థలు కొనుగోలు చేస్తున్నాయి. తెలుగు మీడియాలో కూడా పెద్ద పెద్ద వ్యాపార సంస్థలకు మీడియా హౌజ్‌లలో షేర్‌లు ఉన్నది బహిరంగ రహస్యమే. ఈ నేపథ్యంలో జర్నలిస్టులకు ఉన్న మీడియా స్వేచ్ఛను యాజమాన్యాలకు అనుగుణంగా వినియోగించాల్సిన పరిస్థితులు తలెత్తుతున్నాయి. ఇలా చేయడం ఇష్టం లేని జర్నలిస్టులకు ఇప్పుడు యూ ట్యూబ్ ఛానల్స్ వేదిక అయ్యాయి. అందులో నిలదొక్కుకున్న రావీశ్‌కుమార్, డికోడర్ (ప్రణయ్ రాయ్) వంటి వారు ఉన్నారు.

**మీడియా స్వేచ్ఛ ఎందుకు?**

మీడియా, సోషల్ మీడియా యాజమాన్యం సంపన్నుల చేతుల్లో కేంద్రీకృతమవడమే రాజకీయ స్వాతంత్ర్యంతో పాటు, స్వేచ్ఛా సమాజంలో స్వేచ్ఛా మీడియా అనే నిబంధనకు ప్రత్యక్ష ముప్పుగా మారుతోందని ఆక్స్‌ఫామ్ నివేదిక చెబుతోంది. దీనికి విరుగుడుగా కొన్ని సూచనలూ చేసింది. మీడియా స్వతంత్రానికి చట్టాలను తీసుకురావాలని కోరడంతో పాటు, ద్వేష ప్రసంగాలను కఠినంగా నిరోధించాలని సూచించింది.

జర్నలిజం అనేది ఒక పవిత్రమైన వృత్తి. స్వాతంత్ర్యోద్యమంలో, పౌర హక్కుల పరిరక్షణ, సంక్షోభాల లో ప్రజలు ఇతివృత్తంగా సమాచారాన్ని ప్రపంచానికి తెలియజేస్తాయి. అందుకే మీడియాను ప్రజాస్వామ్య నాలుగవ స్తంభంగా గౌరవిస్తున్నారు. అందుకే మీడియా స్వేచ్ఛ పట్ల అందరూ సుముఖంగానే ఉంటారు. కానీ, మారిన పరిస్థితుల్లో మీడియా స్వేచ్ఛ దుర్వినియోగంలో జర్నలిస్టుల పాత్ర కొంత అయితే, యాజమాన్యాలది కొండంత.

# కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయం

ఎన్నికల కోసం బిఆర్ఎస్, బిజెపి చీకటి ఒప్పందం
ఎన్నికల ప్రచారంలో రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



**ప్రజాపక్షం/కరీంగనగర్:** కార్పొరేషన్ ఎన్నికల్లో మెజార్టీ డివిజన్లతోపాటు మేయర్ పీఠాన్ని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు,శాసనసభా వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. శనివారం కరీంనగర్ నగర పాలక సంస్థ 8వ డివిజన్ పరిధిలోని అల్గునూరు లో డివిజన్ కాంగ్రెస్ అభ్యర్థి గోపు మల్లారెడ్డి తరఫున నిర్వహించిన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రసంగిస్తూ కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల్లో 4045 డివిజన్లలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు విజయం సాధిస్తారని సర్వేలు చెబుతున్నాయని, దీంతో బీఆర్ఎస్, బీజేపీల ఓటమి ఖాయమని తెలిపోవడంతో ఆ పార్టీలు ఉనికి కోసం తండ్లాడుతున్నాయన్నారు. సైద్ధాంతిక వైరుధ్యాలు కలిగిన ఆ రెండు పార్టీలు ఎన్నికల కోసం రహస్య ఒప్పందం చేసుకున్నాయని శ్రీధర్ బాబు మండిపడ్డారు. బీఆర్ఎస్, బీజేపీలు దొందు దొందేనని, ఈ పార్టీలను నమ్ముకుంటే నష్టపోవడం తప్పదన్నారు. బీఆర్ఎస్,బీజేపీల వల్ల అభివృద్ధి సాధ్యం కాదని, గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు.కాంగ్రెస్ పాలనలోనే అభివృద్ధి సాధ్యమని, కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని అనేక పథకాలు అమలుచేస్తున్నదని మంత్రి చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి కొత్త రేషన్ కార్డులు ఇవ్వడం చేతకాలేదని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే కొత్త రేషన్ కార్డులు ఇవ్వడమే కాకుండా కొత్తగా పేర్ల నమోదుకు అవకాశం కల్పించిందన్నారు. అలుగునూరు అభివృద్ధిలో అగ్రగామిగా నిలవాలంటే కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గోపు మల్లారెడ్డి అఖండ మెజార్టీతో గెలిపించాలని శ్రీధర్ బాబు ప్రజలను కోరారు. గోపును గెలిపిస్తే అల్గునూరు అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తామని, అల్గునూరు చౌరస్తాను మోడల్ చౌరస్తాగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశ్, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, ఎమ్మెల్యే సతీమణి, అంకిత్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రుల ఎండి డాక్టర్ కవ్వంపల్లి అనూరాధ, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, 8వ డివిజన్ కాంగ్రెస్ అభ్యర్థి గోపు మల్లారెడ్డి, డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తమ్మనవేణి రమేశ్ యాదవ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేశ్, మాజీ కార్పొరేటర్ సల్ల రవీందర్, పార్టీ నాయకులు కంది లక్ష్మినారాయణ రెడ్డి, కంది అశోక్ రెడ్డి, చింతం కిష్టయ్య, దాసం నాగేందర్, మారం కొమురయ్య, జాప రాఘవ రెడ్డి, జేవీ మల్లారెడ్డి, మామిడి నరేందర్ రెడ్డి, సింగం శ్రీనివాస్, ప్రశాంత్ గౌడ్,ఎం.స్వాతి శ్రీకాంత్ గౌడ్, అట్ల అనిల్ కుమార్ ముదిరాజ్, తొర్తి అరవింద్, సుధగోని లక్ష్మినారాయణ, బత్తిని శ్రీనివాస్ గౌడ్, తుమ్మనపల్లి శ్రీనివాసరావు, శ్రీగిరి రంగారావు, కుంట రాజేందర్ రెడ్డి, బుధారపు శ్రీనివాస్, గసికంటి లక్ష్మారెడ్డి, పోలు రాము, రమేశ్, చింతల లక్ష్మారెడ్డి, నాంపల్లి తిరుపతి, గొట్టె మధు, పొన్నాల సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## బెజ్జంకి మండలాన్ని కరీంనగర్ జిల్లాలో కలపాలి

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పోతిరెడ్డి వెంకట్ రెడ్డి

**ప్రజాపక్షం/బెజ్జంకి:** బెజ్జంకి మండలాన్ని తిరిగి కరీంనగర్ జిల్లాలో కలపాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోతిరెడ్డి వెంకట్ రెడ్డి డిమాండ్ చేశారు.శనివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాజకీయ లబ్ధి కోసం జిల్లాల పునర్విభజన చేపట్టి ప్రజా అభిప్రాయానికి వ్యతిరేకంగా కరీంనగర్‌లో ఉన్న బెజ్జంకి మండలాన్ని సిద్దిపేట జిల్లాలో కలిపారని అన్నారు.నాటి నుండి నేటి వరకు ప్రజలు అనేక విధాలుగా నిరసనలు ధర్నాలు చేపట్టిన ఫలితం లేకుండా పోయిందని అన్నారు.అప్పటి టిపిసిసి హోదాలో ఉన్నటువంటి ఉత్తమ్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని తెలిపారు.ఇటీవల జరిగిన సాధరణ ఎన్నికల్లో ముఖ్యమంత్రి రేవంత రెడ్డి గుండ్లపల్లిలో జరిగిన కాంగ్రెస్ బహిరంగ సభలో బెజ్జంకి మండలాన్ని తిరిగి కరీంనగర్ జిల్లా కలుపుతామని హామీ ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. హుస్నాబాద్ ఎంఎల్ఏ మంత్రి అయిన పొన్నం ప్రభాకర్ బహిరంగంగా హుస్నాబాద్‌ను కరీంనగర్‌లో కలుపుతానని తెలుపుతున్నారు. కాని స్థానిక ఎంఎల్ఏ మాట్లాడపోవడం దురదృష్టకరమని అన్నారు. ఇప్పటికైనా స్థానిక ఎంఎల్ఏ స్పందించి సిద్దిపేట జిల్లాలో కొనసాగుతున్న బెజ్జంకి మండలాన్ని తిరిగి కరీంనగర్ జిల్లాలో కలపడానికి ప్రత్యేక చొరవ తీసుకోవాలని అన్నారు.లేనియెడలా సిపిఐ ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా ప్రజా ఉద్యమాన్ని చేపడతామని తెలిపారు.

## కరీంనగర్ మేయర్ పీఠం బిజెపిదే: మంత్రి బండి సంజయ్



**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్ కార్పొరేషన్ మేయర్ పీఠం ఈసారి భారతీయ జనతా పార్టీదేనని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ధీమా వ్యక్తం చేశారు. కరీంనగర్ లో ప్రజల ఆస్తులకు రక్షణ కవచంగా నిలుస్తానని భరోసా ఇచ్చారు. ఇకపై కరీంనగర్ లో ప్రజల జాగాలను కబ్జాలు చేసే నాయకుల భరతం పడతానని హెచ్చరించారు. బీఆర్ఎస్ పాలనలో కబ్జాలకు పాల్పడిన 9 మంది కార్పొరేటర్లను అరెస్ట్ చేయించి బొక్కలో వేసిన విషయాన్ని గుర్తు చేశారు. కరీంనగర్ లో బీఆర్ఎస్ పనైపోయిందని, ఈ ఎన్నికల్లో 4 సీట్లకే పరిమితం కాబోతుందన్నారు. కాంగ్రెస్, ఎంఐఎం కలిసినా 20 సీట్లు దాటబోవని అన్నారు. కేంద్రం నుండి వరదలా నిధులు వస్తున్నాయని, మేయర్ పీఠాన్ని అప్పగిస్తే మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. నగరంలోని 16, 19, 20 డివిజన్ల అభ్యర్థులు గిత్త రాజేంద్ర ప్రసాద్, మూల రుక్మిణీ, జాడి బాల్ రెడ్డి లను గెలిపించాలని అభ్యర్థించారు. అమృత్ 2.0 ద్వారా రూ. 132 కోట్లు వచ్చాయని, మల్కాపూర్, చింతకుంట ఏరియాలో వాటర్ సప్లై చేసి ఈ ప్రాంత రూపు రేఖలు మారుస్తాన్నారు. మల్కాపూర్ కు మొత్తం 11 కొత్త సీసీ రోడ్లు రూ.11.60 కోట్ల నిధులతో సీసీ రోడ్లు డ్రైనేజీలు నిర్మిస్తానని, ఇందుకు సంబంధించిన నిధులు సిద్ధంగా ఉన్నాయని, టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులను ప్రారంభిస్తామన్నారు.

## విద్యార్థులకు విద్యా ప్రమాణాలు అందేలా చర్యలు: కలెక్టర్



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** విద్యార్థులకు కనీస విద్యా ప్రమాణాలు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.శనివారం రంగంపల్లి లోని వెంకట పద్మ ఫంక్షన్ హాల్ లో ప్రాథమిక తరగతి ఉపాధ్యాయులతో ఎఫ్.ఎల్.ఎన్ అమలు పై జిల్లాలోని అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు, జిల్లా, మండల విద్యాధికారులు తో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లలకు చదవడం, రాయడం, బేసిక్ మ్యాథ్స్ వంటి కనీస విద్యా ప్రమాణాలు ప్రతి విద్యార్థులకు అందించాలనే లక్ష్యంతో ఎఫ్.ఎల్.ఎన్ కార్యక్రమం అమలు చేస్తున్నామని అన్నారు. జిల్లాలో మిడ్ లైన్ పరీక్షా ఫలితాలతో పిల్లలు చదువుతున్నప్పటికి చదివింది అర్థం చేసుకోవడంలో కొంత వెనుకబడి ఉన్నట్లు గమనించామని, పిల్లలకు చదివింది అర్థమయ్యే గ్రహణ శక్తి అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఉపాధ్యాయులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రాథమిక విద్యార్థులో సరైన విద్యా ప్రమాణాలు ఉన్న విద్యార్థుల సంఖ్య చాలా తక్కువగా ఉందని, ఇది చాలా ఆందోళనకర పరిస్థితులను సూచిస్తుందని కలెక్టర్ తెలిపారు. ఒకటిన్నర నెల తర్వాత జరిగే తుది పరీక్షల్లో విద్యార్థుల విద్యా ప్రమాణాల వివరాలను సరిగ్గా నమోదు చేయాలని అన్నారు. విద్యార్థులకు బోధనా ఉపకరణాలు సులభంగా అర్థమయ్యేలా టి.ఎల్.ఎమ్ ను విద్యార్థులు వినియోగించుకోవాలని ,పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేందుకు ఉపాధ్యాయుల చర్యలు తీసుకోవాలి కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో నరేందర్, జిల్లా విద్యాశాఖ అధికారి శారద, ప్లానింగ్ సెక్టోరియల్ ఆఫీసర్ మల్లేష్ గౌడ్ ఎం.ఈ.ఓలు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాలి: ఇన్‌చార్జి కలెక్టర్



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో విధులకు హాజరయ్యే వారు పోస్టల్ బ్యాలెట్ ను వినియోగించుకోవాలని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు. సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రంలో ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ శనివారం పరిశీలించారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్ కోసం సిద్ధం చేసిన ఫారాలను పరిశీలించారు. అక్కడ ఉన్న సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కార్యాలయాల్లో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రాలు అందుబాటులో ఉంటాయని, 8వ తేదీ ఆదివారం కూడా ఓటు హక్కు వినియోగించుకో వచ్చని స్పష్టం చేశారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగించు కునేవారు సంబంధిత ఫారాలు అన్ని జత చేసి తమ ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోస్టల్ బ్యాలెట్ కేంద్రంలోకి మొబైల్ ఫోన్ అనుమతి లేదని స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో నోడల్ అధికారి లక్ష్మీ రాజం, తహసీల్దార్ మహేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అభ్యర్థులను ఆదరించండి



**ప్రజాపక్షం/చొప్పదండి:** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పట్టణంలోని 1,2,5,11,13 వార్డులలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులకు మద్దతుగా చొప్పదండి ఎమ్మెల్యే, డిసిసి అధ్యక్షుడు మేడిపల్లి సత్యం సుడిగాలి ప్రచారం చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పట్టణాల అభివృద్ధి కోసం ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని, కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులకు ఓటేసి పట్టణాన్ని అభివృద్ధి చేసే అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్‌లు, వార్డుల ప్రజలు తదితరులున్నారు.

## ప్రజారోగ్య సేవలను మరింత మెరుగుపరచాలి: కలెక్టర్

**ప్రజాపక్షం/కరీంనగర్:** ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజా ఆరోగ్య సేవలను మరింత మెరుగుపరచాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి వైద్యాధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, వివిధ సామాజిక ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో సమకూర్చిన అధునాతన పరికరాలను ఉపయోగిస్తూ రోగులకు మరింత విస్తృత సేవ అందించాలని అన్నారు. ఆస్పత్రుల్లో ప్రభుత్వం సరఫరా చేస్తున్న ఉచిత మందుల వివరాల బోర్డును ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గైనకాలజీ, పిల్లల వైద్యులు, మెడికల్ ఆఫీసర్లు సమన్వయంతో గర్భిణీలు, శిశువులకు సేవలు అందించాలని అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. శుక్రవారం సభలకు వైద్యాధికారులు హాజరై ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణీలకు లభించే ఉచిత పరీక్షలు, మందులు, చికిత్స పట్ల అవగాహన కల్పించాలని ఆదేశించారు. తద్వారా ప్రభుత్వాసుపత్రిలో డెలివరీల సంఖ్య పెంచవచ్చని సూచించారు. అతిగా బరువు తక్కువ ఉన్న చిన్నారులను గుర్తించి ఎన్.ఆర్.సికి రిఫర్ చేయాలని అన్నారు. ఇన్ఫెక్షన్ కంట్రోల్ కమిటీలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఆస్పత్రులకు అత్యవసరంగా కావలసిన ఇతర పరికరాలను కొనుగోలు చేయాలని సూచించారు. సమావేశంలో వెంకటరమణ, సనా, జి.జి.హెచ్ ఆర్.ఎం.ఓ నవీన ఇతర వైద్యాధికారులు పాల్గొన్నారు.

## ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి పొన్నం



**ప్రజాపక్షం/హుస్నాబాద్:** నన్ను ఎమ్మెల్యేగా గెలిపించారు, మీ ఆశీర్వాదంతో మంత్రి అయ్యాను. అలాగె హుస్నాబాద్ పట్టణంలో 20వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి హుస్నాబాద్ గౌరవాన్ని పెంచాలని తెలంగాణ బి సి రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడు ఓటర్లను కొరారు. శనివారం అయన హుస్నాబాద్ పట్టణంలోని ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తు పలు వార్డుల్లో అందరిని పలుకరిస్తు ఓట్లు అడిగారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వం పేదలకు ఒక్క ఇల్లు కూడ ఇవ్వలేదని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి న ఏడాదిలో పట్టణలో 500 వందల ఇల్లు ఇచ్చాం, మహిళలకు వడ్డీలేని రుణాలు, రేషన్‌కార్డులు, సన్న బియ్యం, 200ల యూనిట్ల విద్యుత్ , ఉచిత బస్సు ప్రయాణం లాంటి పథకాలను అమలు చేశామని అన్నారు. మరింత ఆభివృద్ధి జరగాలంటే 11వ తేదిన జరుగు మున్సిపల్ ఎన్నికల్లో అందరు కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుపైన ఓటు వేసి భారీ మెజార్టీతో గెలపించాలని కొరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కేడం లింగమూర్తి బొల్లి శెట్టి శివయ్య, చిత్తారి రవిందర్ పద్మ , మాజీ కౌన్సిలర్లు పాల్గోన్నారు.

**అన్ని మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలి**

తెలంగాణలో అన్ని జిల్లా మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ పార్టీ జెండాలు ఎగరవేయాలని కరీంనగర్ జిల్లా ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు , పొన్నం ప్రభాకర్‌గౌడులు ఓటర్లను కోరారు. శనివారం హుస్నాబాద్ పట్టణంలోని వైశ్వభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత రెండు ఏళ్లుగా ప్రజాపాలన ప్రభుత్వంలో ముఖ్య మంత్రి రేవంతురెడ్డి నాయకత్వంలో ఆసాధ్యమైన అంశాలను గుండె ధైర్యంతో పరిష్కారం చేశాం. నీళ్లు నిధులు నియామకాల కోసం తెలంగాణ ఉద్యమం జరిగింది. రెండు ఏళ్లలో 75వేల ఉద్యోగాలు భర్తీ చేశాం. ధాన్యం పండించడంలో దేశంలో నే తెలంగాణ మొదటి స్థానంలో ఉందన్నారు.అదే స్ఫూర్తితో మున్సిపల్ ఎన్నికల్లో భారీ మోజార్టీ తో గెలిపించి కాంగ్రెస్ పార్టీ గౌరవాన్ని పెంచాలని మంత్రులు అన్నారు.

## తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి: మంత్రి అడ్లూరి



**ప్రజాపక్షం/ధర్మపురి:** ధర్మపురి పురపాలక కేంద్రంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తానని రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ,వికలాంగులు,వయోవృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు.మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఆయన 1వ వార్డు,2వ వార్డు,3వ వార్డులలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాల్సిందిగా ఓటర్లను కోరారు.అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్రంలో పదేళ్లు పాలనసాగించిన బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు అవసరమైన కనీస మౌలిక సదుపాయాలు కల్పించలేదని విమర్శించారు. తలాపున గోదావరి నది ఉన్నప్పటికీ ధర్మపురి పట్టణ ప్రజల తాగునీటి అవసరాలను తీర్చలేక పోయిందన్నారు.మున్సిపల్ ఎన్నికలు ముగిసిన వెంటనే అక్కపెల్లి రిజర్వాయర్ పనులు పూర్తి చేసి ధర్మపురి పట్టణ తాగునీటి సమస్యను శాశ్వతంగా దూరం చేస్తానని హామీఇచ్చారు. నీటి సమస్యతోపాటు విద్యుత్ వైర్ల సమస్యలను పరిష్కరిస్తానన్నారు. కాంగ్రెస్ పార్టీ బలపరుస్తున్న 1,2,3 వార్డుల అభ్యర్థులు అయ్యోరి వేణుగోపాల్, సంగనబట్ల సంతోషి,ఇందారపు రామయ్యలను భారీ మెజారిటీ తో గెలిపించాల్సిందిగా ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

**ధర్మపురిలో దూసుకెళ్తున్న కాంగ్రెస్**

పురపాలిక ఎన్నికల్లో అధ్యక్ష పీఠంపై కన్నేసిన కాంగ్రెస్ అభ్యర్థులు విస్తృత ప్రచారంతో దూసుకుపోతున్నారు. ప్రచారానికి మరో రెండు రోజులు మాత్రమే గడువుండటంతో తమ తమ మద్దతుదారులతో వార్డుల్లో ఉదయం నుండి మొదలుకుని రాత్రి వరకూ ఓటర్ల కటాక్షం కోసం గడప గడపనూ చుట్టివేస్తున్నారు. రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్థానికంగా ఉంటూ అన్నివార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థుల పక్షాన ప్రచారం లో పాల్గొంటున్నారు.గడిచిన రెండేళ్ళలో తమ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను వివరిస్తూ ఓటర్లను కలుస్తున్నారు. పోలింగ్ సమయం దగ్గర పడుతుండగా వార్ వన్ సైడ్ అన్నట్లుగా అన్ని వార్డుల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థులు ముందంజలో ఉన్నట్లు బల్దియా ఓటర్ల మధ్య మాటలను బట్టి అనుకుంటున్నారు.

## కాంగ్రెస్ పాలనపై ప్రజలు సానుకూలంగా ఉన్నారు

మంత్రి అడ్లూరితో కలిసి మెట్‌పెల్లి, కోరుట్లలో పర్యటించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/జగిత్యాల:** రాష్ట్రంలో జరుగబోతున్న అన్ని మున్సిపాలిటీలతో పాటు కార్పోరేషన్లలో కాంగ్రెస్ పార్టీ వందకు వంద శాతం గెలుచుకుంటామని రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం జగిత్యాల జిల్లాలోని మెట్‌పెల్లి, కోరుట్ల మున్సిపాలిటీల్లో సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి ఉత్తమ్ కుమార్ రెడ్డి పర్యటించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా రోడ్‌షోలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓట్లు అభ్యర్థించి మాట్లాడారు. రెండెళ్ల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రజలు పాజిటివ్‌గా ఉన్నారన్నారు. తన రాజకీయ అనుభవంలో అధికార పార్టీకి స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇటాంటి పాజిటివ్ ఉండడం అరుదుగా ఉందన్నారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు ఈ ఎన్నికల్లో చెప్పుకోవడానికి ఏమీలేదన్నారు. పట్టణీకరణ పెరుగుతున్న నేపథ్యంలో రానున్న రోజుల్లో తెలంగాణలోని అన్ని మున్సిపాలిటీల్లో మౌళిక వసతుల కల్పన కోసం కోట్ల రూపాయలు వెచ్చిస్తామని వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రెబల్స్‌పై ఇబ్బంది లేదని వంద శాతం కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు గెలుస్తారన్నారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో దేశం గర్వపడే విధంగా ముందుకు సాగుతున్నామన్నారు. అఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాజెంగి నందయ్య, కోరుట్ల నియోజకవర్గ ఇంచార్జి జువ్వాడి నర్సింగ రావు ఉన్నారు.

## విద్యార్థుల్లో దేశభక్తి పట్ల అవగాహన

'ఆల్ఫోర్స్' విద్యాసంస్థల చైర్మన్ డా.వి.నరేందర్‌రెడ్డి




**ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్:** విద్యార్థుల్లో దేశభక్తి అవగాహన పెంపొందించడం, వివిధ దేశాల గురించి తెలుసుకోవడం ఎంతో అవసరమని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డా.వి.నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని వావిలాలపల్లిలో గల అల్ఫోర్స్ ప్రైమరీ పాఠశాల క్యాంపస్‌లో ఎక్స్‌ప్లోర్ ద ప్రైడ్ ఆఫ్ ఇండియా అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా నరేందర్ రెడ్డి హాజరై ముఖాముఖి నిర్వహించి మాట్లాడారు. విద్యార్థులకు దేశం పట్ల విస్తృత అవగాహన కల్పించడం ద్వారా వారి జ్ఞానం మరింత పెరుగుతుందని తెలిపారు. విధ్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి పాఠశాల పాఠ్య ప్రణాళికలో భాగంగా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రతి విద్యార్థి కనీస బాద్యతగా వివిధ నాయకుల గురించి అవగాహన పెంపొందించుకోవాలని ఆయన సూచించారు. పాఠశాల ప్రిన్సిపల్, తల్లిదండ్రులు, సిబ్బంది, విధ్యార్థులు పాల్గొన్నారు.

# 57వ డివిజన్ లో సిపిఐ అభ్యర్థి విస్తృత ప్రచారం

గెలుపు బాటలో కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీల ఉమ్మడి అభ్యర్థి లతశ్రీ కసిరెడ్డి



**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్ కార్పోరేషన్ ఎన్నికల్లో 57వ డివిజన్ నుంచి పోటీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ బలపర్చిన సిపిఐ పార్టీ అభ్యర్థి లతశ్రీ కసిరెడ్డి డివిజన్ లో పర్యటిస్తూ ఓటర్లను కలుస్తూ విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. కరీంనగర్ కార్పోరేషన్ ఎన్నికల్లో 57 వ డివిజన్ జనరల్ మహిళకు రిజర్వ్ కాగా పొత్తులో బాగంగా కాంగ్రెస్ పార్టీ ఈ డివిజన్ ను సిపిఐ కి కెటాయించింది. ఈ క్రమంలో కమ్యూనిస్టు, కాంగ్రెస్ పార్టీల కార్యకర్తలు సంయుక్తంగా ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహిస్తున్నారు. డివిజన్ లో మొత్తం 4762 ఓటర్లుండగా అందులో మహిళా ఓటర్లు 2391 కాగా పురుషులు 2371 ఉన్నారు.

**ఈ డివిజన్ తో కమ్యూనిస్టు పార్టీకి దశాబ్దాల అను-బంధం:** గత కొన్ని దశాబ్దాలుగా కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యాలయం బద్దం ఎల్లారెడ్డి భవన్ 57వ డివిజన్ లోనే ఉంది. డివిజన్ ప్రజలతో సిపిఐ నాయకులకు, కార్యకర్తలకు విడదీయరాని అనుబంధం ఉంది. ఏ సమస్య వచ్చిన ఇక్కడి ప్రజలకు పార్టీ అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తుంది. ఈ నేపథ్యంలో ప్రస్తుత కార్పోరేషన్ ఎన్నికల్లో ఈ డివిజన్ జనరల్ మహిళకు కెటాయించడంతో పార్టీ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి సతీమణి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠ రెడ్డి తల్లీ కసిరెడ్డి లతశ్రీ ని కమ్యూనిస్టు పార్టీ బరిలో దింపింది. డివిజన్ లోని యువకులు, విద్యార్థులకు ఏ సమస్యనైనా మణికంఠ రెడ్డి పరిష్కరించడంతో యూత్ లో ఆయనకు మంచి గుర్తింపు ఉండటం, సురెందర్ రెడ్డి నగర కార్యదర్శిగా పట్టణ సమస్యలపై నిరంతరం పోరాటాలు చేయడం, డివిజన్ లోని సమస్యల పరిష్కారానికి అధికారులకు వినతులు అందజేస్తూ ప్రజల్లో మంచి గుర్తింపు పొందారు. దీంతో పాటు సిపిఐ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట రెడ్డి వంటి వారికి ఇక్కడి ప్రజలతో ప్రత్యక్ష పరిచయాలు ఉండటం కలిసొచ్చే అంశాలుగా ఉన్నాయి.

**డివిజన్‌లో ఇంటింటికి విస్తృత ప్రచారం...**

కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ నియోజక వర్గ ఇంచార్జ్ వెలిచాల రాజేందర్ రావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు,కాంగ్రెస్ పార్టీ డివిజన్ ఎన్నికల ఇంచార్జ్ అల్ఫోర్స్ నరేందర్ రెడి, సిపిఐ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, ఏఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కొయ్యడ సృజన్ కుమార్, ప్రజా సంఘాల నాయకులు,కమ్యూనిస్టు పార్టీ శ్రేణులందరు సిపిఐ అభ్యర్థి లతశ్రీ తరుపున విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. డివిజన్ లోని ఇంటింటికి తిరుగుతూ కమ్యూనిస్టు పార్టీ ప్రజల పక్షాన నిలబడి కొట్లాడి సమస్యల పరిష్కారం కోసం చేసిన కృషిని వివరిస్తున్నారు. డివిజన్ లో పార్టీ కార్యాలయంలో ఎల్లప్పుడు నాయకులందరు అందుబాటులో ఉంటూ ఏ సమస్య వచ్చిన పరిష్కారం కోసం కృషి చేస్తామనే హామినిస్తున్నారు. పార్టీ పై ప్రజలకు ఉన్న నమ్మకం, ప్రజలకు నిస్వార్థంగా, నిజాయితీగా సేవ చేస్తారనే విశ్వాసం వంటి అంశాలు లతశ్రీ గెలుపు ఖాయమనే చర్చ జరుగుతుంది.



## స్ట్రాంగ్ రూంలో కట్టుదిట్టమైన భద్రత

మంచిర్యాల డిసిపి భాస్కర్



**ప్రజాపక్షం / రామకృష్ణాపూర్ :** మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా జరిగేలా అన్ని స్థాయిల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని మంచిర్యాల జిల్లా డిసిపి భాస్కర్ తెలిపారు. ఈ నెల 11న జరగనున్న మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని శనివారం క్యాతనపల్లి లో ఎన్నికల సామగ్రి భద్రపరిచిన స్ట్రాంగ్ రూమును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎలాంటి భయభ్రాంతులు లేకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు. పోలింగ్ బూత్‌ల వద్ద ఎన్నికల అధికారులు, పోలీసు యంత్రాంగం సమన్వయంతో భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు చెప్పారు. ప్రశాంతమైన వాతావరణంలో ప్రతి ఓటరు వంద శాతం ఓటు వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద చేపట్టిన భద్రతా చర్యలను స్వయంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.బెల్లంపల్లి ఏసిపి రవికుమార్, మందమర్రి సిఐ రమేష్, రామకృష్ణాపూర్ ఎస్ఐ శ్రీధర్ పాల్గొన్నారు.

## పంటలపై అప్రమత్తంగా ఉండాలి

వ్యవసాయ అధికారి రామకృష్ణ



**ప్రజాపక్షం / కాగజ్ నగర్ :** వరి పంటలో అగ్గితెగులు, మొక్కజొన్నలో కత్తెర పురుగు ఆశించే అవకాశం ఉన్నందున రైతులు పంట సంరక్షణపై అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ అధికారి రామకృష్ణ సూచించారు. శనివారం కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలంలోని జంబుగా, నాగంపేట గ్రామాల్లో సాగు చేసిన వరి, మొక్కజొన్న పంటలను ఆయన పరిశీలించారు. వరిలో అగ్గితెగులు నివారణకు లీటరు నీటికి 0.6 గ్రాముల ట్రైసైక్లోజోల్ లేదా 2.5 మిల్లీలీటర్ల కాసుగామైసిన్ కలిపి పిచికారి చేయాలని తెలిపారు. కొమ్మ తొలుచు పురుగు నివారణకు ఎకరానికి 4 కిలోల క్లోరాంట్రానిలిప్రోల్ 0.4 శాతం గుళికలను ఇసుకలో కలిపి చల్లుకోవాలని వివరించారు. మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు లీటరు నీటికి 0.4 గ్రాముల ఇమామెక్టిన్ బెంజోయేట్ లేదా 0.3 మిల్లీలీటర్ల క్లోరాంట్రానిలిప్రోల్ కలిపి మొక్క మొత్తం తడిచేలా పిచికారీ చేయాలన్నారు. రైతులు సాగు వివరాలను ఏఈఓల వద్ద నమోదు చేసుకోవాలని, దిగుబడి విక్రయ సమయంలో ఇబ్బందులు ఉండవని స్పష్టం చేశారు. రసాయన ఎరువులు తగ్గించి సేంద్రీయ ఎరువులు వాడాలని, పంట మార్పిడితో మేలైన దిగుబడి సాధించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ దుర్గాభవానీ, రైతులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి.. అండగా తపాలా శాఖ



మెదక్ నార్త్ సబ్ డివిజనల్ ఇన్స్పెక్టర్ కులకర్ణి సందీప్

**ప్రజాపక్షం/వెల్దుర్తి :** తపాలా శాఖ ద్వారా సరికొత్త భీమా పథకాలు ప్రవేశపెట్టినట్టు వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తపాలా శాఖ మెదక్ నార్త్ సబ్ డివిజనల్ ఇన్స్పెక్టర్ కులకర్ణి సందీప్ పేర్కొన్నారు. మెదక్ జిల్లా వెల్దుర్తి గ్రామ పంచాయతీ ఆవరణలో శనివారం భీమా పాలసీలపై అవగాహన సమావేశం నిర్వహించారు. తపాలా శాఖలో ప్రమాద భీమా పాలసీ తీసుకుని గత ఏడాది ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందిన వెల్దుర్తి గ్రామానికి చెందిన పంపరి సత్యనారాయణ భార్య కళావతి కి తపాలా శాఖ అధికారులు గ్రామ సర్పంచ్ ఆదర్శ్, ఉప సర్పంచ్ శ్రావణ్ మరియు గ్రామ పెద్దల సమక్షంలో పదిహేను లక్షల రూపాయల ప్రమాద భీమా పాలసీ చెక్కును అందించారు. కేవలం రోజుకి రూ.2 చెల్లించడం ద్వారా 15 లక్షల క్రిడెంట్ పాలసీ పొందవచ్చని, ఇన్సూరెన్స్ చేసుకోవడం ద్వారా ధీమాగా, ప్రశాంతంగా ఉండవచ్చని, గ్రామీణ ప్రాంతాల్లో తపాలా శాఖ ద్వారా అందిస్తున్న భీమా పాలసీ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సంబంధిత పోస్ట్ మాస్టర్లకు సూచించారు. ఐపిపిబి మెదక్ బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాస్, పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ డెవలప్మెంట్ ఆఫీసర్ హర్షవర్ధన్, మెయిల్ ఓవర్సీర్ వినయ్ వెల్దుర్తి బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ మధుర్, అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్లుఅంజనేయులు, నవీన్ పాల్గొన్నారు.

## నేటితో ముగియనున్న పోస్టల్ బ్యాలెట్ గడువు

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** మున్సిపల్ ఎన్నికల నిర్వహణ విధులలో నిమగ్నమై ఉన్న ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా పోస్టల్ బ్యాలెట్ సదుపాయం ఆదివారం సాయంత్రం 5 గంటలకు ముగుస్తుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. ఎన్నికల విధులలో ఉన్న ఉద్యోగులు సంబంధిత కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికల విధుల కేటాయించబడిన ఉద్యోగులు ఐడీఓసీ(కలెక్టరేట్)లో పోస్టల్ బ్యాలెట్ సదుపాయం వినియోగించుకునేలా ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. అదేవిధంగా బోధన్ మున్సిపల్ ఎన్నికల విధుల నిర్వహిస్తున్న వారు బోధన్ మున్సిపల్ కార్యాలయంలో ఆర్మూర్ మున్సిపల్ ఎన్నికల విధుల నిర్వహిస్తున్న ఉద్యోగులు భీంగల్ మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్ సదుపాయం ద్వారా ఓటు హక్కును వినియోగించుకోవచ్చని తెలిపారు. ఎన్నికల విధుల్లో నిమగ్నమై ఉన్న పోలీసు సిబ్బంది కూడా పోస్టల్ బ్యాలెట్ ను వినియోగించుకోవాలన్నారు.

## పోలింగ్ విధులపై అవగాహన

అదనపు కలెక్టర్ పాండు

**ప్రజాపక్షం/ సంగారెడ్డి:** మున్సిపల్ ఎన్నికల కు సంబంధించి ఈ నెల 11న చేపట్టనున్న పోలింగ్ ప్రక్రియపై ప్రిసైడింగ్ అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని అదనపు కలెక్టర్ పాండు సూచించారు. ఎలాంటి సందేహాలు ఉన్నా ముందుగానే నివృత్తి చేసుకోవాలని పేర్కొన్నారు. సంగారెడ్డి లోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిసైడింగ్ సహాయ ప్రిసైడింగ్ అధికారులకు పోలింగ్ నిర్వహణ విధులపై మాస్టర్ ట్రైనర్ చే శనివారం రెండవ విడత శిక్షణ తరగతులను నిర్వహించి అవగాహన కల్పించారు. శిక్షణ తరగతులను సందర్శించిన అదనపు కలెక్టర్ పాండు పీఓ,ఏపీఓలకు కీలక సూచనలు చేశారు. హ్యాండ్ బుక్ లో పొందుపర్చిన అంశాలను క్షుణ్ణంగా చదివి పోలింగ్ విధులపై స్పష్టమైన అవగాహన ఏర్పర్చుకోవాలన్నారు. పొరపాట్లకు తావు లేకుండా సజావుగా పోలింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు.



# గజ్వేల్ మున్సిపల్ ఎన్నికల్లో మైనారిటీలు..

# కీలకపాత్ర పోషించాలి

రాష్ట్ర మంత్రి అజారుద్దీన్



**ప్రజాపక్షం / గజ్వేల్ :** గజ్వేల్ మున్సిపల్ ఎన్నికల్లో మైనారిటీలు కీలకపాత్ర పోషించాలని, కాం గ్రెస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపిస్తే తన వంతు పూర్తి సహకారం ఉంటుందని రాష్ట్ర మంత్రి అజారుద్దీన్ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు జంగం నవ్యశ్రీ, షహనాజ్ సమీర్, నక్క సంతోషి రాములు గౌడ్, సయ్యద్ మథిన్, మునవర్ అలీలకు మద్దతుగా ఆయన మాజీ ఎమ్మెల్యేలు కూన శ్రీశైలం గౌడ్, తూంకుంట నర్సారెడ్డి, డిసిసి అధ్యక్షులు తూంకుంట అంక్షారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్ లతో కలిసి ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. గజ్వేల్ పట్టణంలో అధిక సంఖ్యలో ఉన్న మైనార్టీలు తమ కుటుంబాల అభ్యున్నతి కోసం ఐక్యంగా ఉండాలని ఆకాంక్షించారు. అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం, సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజా రంజక పాలన చేస్తున్నట్లు చెప్పారు. ఖజానాపై భారం పడుతున్నప్పటికీ ఇచ్చిన ప్రతి హామీ అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉన్నట్లు స్పష్టం చేశారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తేనే నిధులు సులభంగా సాధించవచ్చని తెలిపారు. ముఖ్యంగా గ్రూపులకు అవకాశం ఇవ్వకుండా కాంగ్రెస్ అధిష్టానం ప్రకటించిన అభ్యర్థిలకు పార్టీ శ్రేణులు సంపూర్ణ మద్దతు ప్రకటించాలని తెలిపారు. అంతేకాకుండా ప్రతినిత్యం ప్రజలు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటున్న మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి నేతృత్వంలో గజ్వేల్ మున్సిపల్ ను కైవసం చేసుకోవాలని ఆకాంక్షించారు. అయితే గజ్వేల్ మైనార్టీలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారానికి తన వంతు పూర్తి సహకారం ఉంటుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల మంజూరి తదితర వాటితో పాటు ప్రభుత్వ పథకాల వర్తింపుకు తనను నేరుగా సంప్రదించవచ్చని వివరించారు.

## మున్సిపల్ ఎన్నికలకు ముందస్తు ఏర్పాట్లు

జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** మున్సిపల్ ఎన్నికలను పకడ్బందీగా,పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేసి ముం దస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై సంబంధిత నోడల్ అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎన్నికల ప్రక్రియలో ప్రతి దశ కీలకమని పేర్కొన్న కలెక్టర్,ఎన్నికలు నిష్పక్షపాతంగా,ఎటువంటి అంతరాయాలు లేకుండా జరిగేలా ముం దస్తూ ప్రణాళికతో పనిచేయాలని సూచించారు. పోలింగ్, కౌంటింగ్ సిబ్బందికి సమగ్ర శిక్షణ ఇవ్వాలని,కౌంటింగ్ సిబ్బంది రాండమైజేషన్ ను ఎన్నికల నిబంధనల ప్రకారం ఖచ్చితంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్నికల సామగ్రి పంపిణీ ప్రక్రియలో ఎటువంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. బ్యాలెట్ బాక్సుల రవాణా,బ్యాలెట్ పేపర్ల ముద్రణ, ఎన్నికల సామగ్రి సరఫరా వంటి అంశాల్లో ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని తెలిపారు.పోలింగ్,కౌంటింగ్ కేంద్రాల్లో నిఘా వ్యవస్థ పటిష్టంగా ఉండాలని,సిసి కెమెరాలు,వీడియోగ్రఫీ,వెబ్‌కాస్టింగ్ ఏర్పాట్లను ముందుగానే తనిఖీ చేసి సిద్ధం చేయాలని ఆదేశించారు.సున్నిత ప్రాంతాల్లో ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని సూచించారు.డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు, కౌం టింగ్ కేంద్రాల్లో తాగునీరు,విద్యుత్,మరుగుదొడ్లు,వంటి మౌ లిక సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ తెలిపారు.అభ్యర్థులు,వారి ప్రతినిధులు,సిబ్బందికి సౌకర్యార్థం హెల్ప్ డెస్కులు ఏర్పాట్లు చేయాలని సూచించారు.ఎన్నికల విధుల్లో పాల్గొనేన సిబ్బంది తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ప్రత్యేక ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు.ఈ నెల 8,9 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసేందుకు అన్ని సదుపాయాలు సిద్ధం చేసినట్లు తెలిపారు.ఈ సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్,కిషోర్ కుమార్, ఆర్డీ ఓ రత్నాకళ్యాణి,వివిధ శాఖల నోడల్ అధికారులు భోజన్న, శ్రీనివాస్,శంకర్,రమణ,విష్ణువర్ధన్,మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్,ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సర్వరాజ్, ఈడిఎం నదీమ్,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ హోరు

కూచాడి శ్రీహరిరావు,వేణుగోపాల చారి



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ మున్సిపలిటీ ఎన్నికల సమరం ముగింపు దశకు చేరుకోవడంతో పట్టణంలో రాజకీయ వేడి ఒక్కసారిగా పెరిగింది.కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మున్సిపల్ గడ్డపై హస్తం జెండాను ఎగురవేయడమే లక్ష్యంగా ప్రచారంలో దూసు కుపోతున్నారు.శనివారం పట్టణంలోని పలు వార్డుల్లో నిర్మల్ నియోకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కూచాడి శ్రీహరి రావు,కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాల చారి నాయకత్వంలో భారీ ఎత్తున ఎన్నికల ప్రచారం నిర్వ హించారు.ముఖ్యంగా 2వ వార్డు అభ్యర్థి పుల్లయ్య ప్రమీల కృష్ణ,4వ వార్డు అభ్యర్థులు తోట లత నర్సయ్య,పెండం శ్రీనివాస్,అలాగే 5వ వార్డు అభ్యర్థి గుంజాల లక్ష్మి చైతన్య తరుపున నేతలు ఇంటింటికీ వెళ్లి ఓటర్లను ప్రత్యక్షంగా కలుసుకున్నారు.వార్డులోని స్థానిక సమస్యలు,ప్రజల అవసరాలు తమకు పూర్తిగా తెలుసని, అభివృద్ధి కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని స్పష్టం చేశారు.నిజాయితీగా పనిచేసే అభ్యర్థులను ఎన్నుకుంటేనే వార్డులు అభివృద్ధి చెందుతా యని,పారదర్శక పాలన కోసం ప్రతి ఒక్కరూ హస్తం గుర్తుకు ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ప్రజలు అభివృద్ధిని, సంక్షేమా న్ని కాంక్షిస్తున్నారని,అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభు త్వం ప్రవేశపెట్టిన పథకాలు ప్రతి ఇంటికీ చేరుతున్నాయని అన్నారు.బీజేపీ,బీఆర్ఎస్ పార్టీలకు ఓటు వేయడం వల్ల కాలయాపన తప్ప ప్రయోజనం ఉండదని,అభివృద్ధి పథంలో నిర్మల్‌ను ముందుకు తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ అభ్యర్థులను ఆశీర్వదించాలని కోరారు.ప్రజలు నేతలకు బ్రహ్మరథం పడుతూ తమ మద్దతును తెలియ జేశారు .మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి అప్పాల కావ్య,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర పరిశీలకుడు చంద్రశేఖర్ గౌడ్,మాజీ చైర్మన్ అనురాధ,నాయకులు ఎర్రవోతు రాజేందర్,కొట్టె శేఖర్,ఈటెల శ్రీనివాస్, కొండా శ్రీనివాస్,పుదరి అరవింద్,సభ ఖలీం, మజర్, ప్యాలల సంతోష్, నల్లుర్తి శీను,నర్సాపూర్ ఉమా మహేశ్వర్ ,గంగోని భూరజ్,కుడకల శ్రీకాంత్,పుదరి శివ,గాజుల రవి, ఇతర ముఖ్య నాయకులు,కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని ప్రచారాన్ని విజయవంతం చేశారు.


## ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందించాలి

జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్..



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** ప్రభుత్వ మాతా,శిశు ఆసుపత్రిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.శనివారం పట్టణంలోని మాతా,శిశు ఆసుపత్రిని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఇన్‌పేషంట్,ఔట్‌పేషంట్ వార్డులు,ఆపరేషన్ థియేటర్,రక్తపరీక్షల గది,స్కానింగ్ కేంద్రం,టీకాల గది,చిన్నారులకు పాలిచ్చే గది,మందుల గది,మరుగుదొడ్లు తదితర విభాగాలను పరిశీలించారు.పలు రిజిస్టర్లను తనిఖీ చేసి,అన్ని విభాగాల్లో రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు.అవసరమైన టీకాలు,మందులు,ఎల్లప్పుడు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.చిన్నపిల్లల వైద్య విభాగాన్ని పరిశీలించి,నవజాత శిశువులకు మెరుగైన వైద్యం అందించాలని పేర్కొన్నారు.ఆసుపత్రిలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడంతో పాటు త్రాగునీరు అందుబాటులో ఉంచాలని సూచించారు.ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని సౌకర్యాలతో మెరుగైన వైద్యం అందుతుందని భరోసా కల్పించారు.పార్కింగ్ సమస్యలు లేకుండా చూడాలని,భద్రతా బందోబస్తు పటిష్టంగా నిర్వహించాలని సూచించారు.

## మున్సిపాలిటీలో మంత్రి విస్తృత ఎన్నికల ప్రచారం



**ప్రజాపక్షం/ సంగారెడ్డి:** తెలంగా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ శనివారం అందోల్, జోగిపేట మున్సిపాలిటీ లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులతో కలసి విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. మంత్రి జోగిపేట మున్సిపాలిటీలో ఇంటింటికి ప్రచారం చేపట్టారు. ఓటర్లను కలసి రాష్ట్రప్రభుత్వం చేపట్టిన సంక్షేమం ,అభివృద్ధి మహిళలకు వడ్డీలేని ఋణాలు, విద్య ,వైద్య రంగాల అభివృద్ధికి చేస్తున్న కృషి వివరించారు. అందోల్ జోగిపేట మున్సిపాలిటీని విద్య వైద్య కేంద్రాల హబ్‌గా అభివృద్ధి చేస్తున్నామన్నారు. జోగిపేటలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అన్ని వార్డులలో భారీ మెజారిటీతో గెలిపించాలని కార్యకర్తలను పార్టీ శ్రేణులను మంత్రి దామోదర్ రాజనర్సింహ కోరారు.

## క్యాతనపల్లిలో కార్మిక తీర్పు దిశగా ఎన్నికలు..

**ప్రజాపక్షం / మంచిర్యాల :** మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం క్యాతనపల్లి మున్సిపల్ ఎన్నికల క్షేత్రం ఈసారి కేవలం వార్డుల పోరుగా కాకుండా, కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై ప్రజలు, ముఖ్యంగా కార్మిక వర్గాలు ఇవ్వబోయే తీర్పుగా మారుతోంది. క్షేత్రస్థాయిలో ప్రజలతో అధికార పార్టీపై తీవ్ర అసంతృప్తి వెల్లువెత్తుతోంది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలులో వైఫల్యం, ఉద్యోగ భద్రత ప్రశ్నార్థకం, సింగరేణి నిధుల దుర్వినియోగం చేయడం వంటి అంశాలు కార్మిక కాలనీల్లో తీవ్ర వ్యతిరేకతను తీసుకువచ్చాయి.

### మిత్రధర్మానికి విరామం..చెదిరిన సమీకరణాలు

పొత్తు రాజకీయాల్లో కాంగ్రెస్ అనుసరించిన వైఖరిపై కార్మిక వర్గాలు జీర్ణించుకోలేకపోతున్నాయి. సిపిఐతో మిత్ర ధర్మాన్ని పక్కన పెట్టి, ఒంటెత్తు ధోరణితో వ్యవహరించడాన్ని స్థానిక ప్రజలు, కార్మికులు తప్పుబడుతున్నారు. 'కార్మికుల ఓట్లు కావాలి కానీ, మంత్రికి కార్మికుల కష్టం పట్టదు' అనే భావన ఓటర్లలో బలంగా నాటుకుపోయింది. మంత్రి ఒంటెత్తు నిర్ణయాలు, అతి విశ్వాసం ఈ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ కొంప ముంచేలా ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా అందరికీ అందుబాటులో ఉండాల్సిన మంత్రి, కేవలం తన చుట్టూ ఉండే ఒక్కరిద్దరు వ్యక్తులకు మాత్రమే టచ్‌లో ఉంటూ క్షేత్రస్థాయి కార్యకర్తలను, సాధారణ ప్రజలను విస్మరిస్తుండటం కూడా కాంగ్రెస్‌పై తీవ్ర వ్యతిరేకతను తీసుకువచ్చాయి. ప్రస్తుత రాజకీయ సమీకరణాలను పరిశీలిస్తే, క్యాతనపల్లి మున్సిపల్ చైర్మన్ పీఠం బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు అభ్యర్థి రాజా రమేష్ సతీమణి సంధ్యారాణి కైవసం చేసుకునే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి.మొత్తం 22 వార్డులకు గాను సిపిఐ 6 వార్డుల్లో, బిఆర్ఎస్ 10 వార్డుల్లో విజయం సాధించే దిశగా పయనిస్తున్నాయి. ఫిబ్రవరి 11న జరగనున్న ఈ ఎన్నికల తీర్పు కాంగ్రెస్ సర్కార్‌కు, ముఖ్యంగా చెన్నూరు ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామికి గట్టి హెచ్చరికగా మారబోతోందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

# లేబర్ కోడ్లను రద్దు చేయాలి



**ప్రజాపక్షం / కాగజ్ నగర్ :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి భోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 12న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ శనివారం కాగజ్‌నగర్ ఎంఎల్ఎస్ పాయింట్ ఇంచార్జి ప్రభులింగం, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ అవినాష్‌కు సమ్మె నోటీసులు అందజేశారు. కేంద్రం కార్పొరేట్ వర్గాలకు అనుకూలంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. సివిల్ సప్లై హమాలి కార్మికులను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించి, పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని కోరారు. ఆసుపత్రి అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు, ఐహెచ్ఎఫ్ ఎంఎస్, ఎన్హెచ్ఎమ్, స్కీం వర్కర్లను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని స్పష్టం చేశారు. జిల్లాలోని సింగరేణి, ఆర్టిసి, సిర్పూర్ పేపర్ మిల్లు కార్మికులందరూ సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎఐటియుసి నాయకులు కుమార్, సురేష్, సుధాకర్,కిషన్, శంకర్ పాల్గొన్నారు.

**సంగారెడ్డి:** రామచంద్రపురం పట్టణంలోని బిహెచ్ఎల్ ఎఐటియుసి ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో సార్వత్రిక సమ్మె సన్నాహక సమావేశం నిర్వహించడం జరిగింది. అ సమావేశానికి బిహెచ్ఎల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఎస్టివి కృష్ణంరాజు అధ్యక్షత వహించగా ఈ సమావేశానికి ఏఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎండి యుసూఫ్ హాజరై మాట్లాడుతూ మోడి ప్రభుత్వం కార్మికుల శ్రమ దోపిడి చేయడానికి కార్పొరేట్లకు వరం లా తెచ్చిన 4 లేబర్ కోడ్లను రద్దు చేయాలని విద్యుత్ సవరణ బిల్లు చట్టం 2005 మహాత్మా గాంధీ జాతీయగ్రామీణ ఉపాది హామి పథకం పేరు మార్చి విబిజి రాంజిగా నామకరణం చేసి పథకానికి నిధుల కోత విధించి ఏఐటియుసి లో వంద శాతం విదేశి పెట్టుబడులను అనుమతించడం లాంటి ప్రమాదకరమైన నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని నిరసిస్తూ ఫిబ్రవరి 12న దేశవ్యాప్తంగా ఏఐటియుసి ,మితితా జాతీయ స్థాయి కార్మిక సంఘాలన్ని ఎకతాటి పై కొచ్చి సార్వత్రిక సమ్మెకు పిలుపు నివ్వడం జరిగిందని అందులో బాగంగానే సదస్సు నిర్వహించడం జరిగింది. దేశవ్యాప్తంగా 40 కోట్లకు పైగా అసంఘటిత కార్మికుల ఉన్నారని వారి కుటుంబాలు, చితికి పోయేలా కార్పొరేట్ కంపెనీలు బాగుపడేలా కేంద్ర ప్రభుత్వం ఇష్టానుసారంగా ఈ 29 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్లను తీసుకువచ్చి బలవంతంగా అమలు పరచాలని చూస్తున్న నరేంద్ర మోడీ ప్రభుత్వమని ఆయన విమర్శించారు. కనీస వేతనం రూ,25000లు ఇవ్వాలని ఉన్నా దాని అమలు పరచడం లేదు. కార్మికులకు ఇప్పటికి పిఎఫ్, ఈఎస్ఐ ఇన్సూరెన్స్ లాంటి సౌకర్యాలు ఏవి కూడా లేవని ఆయన ఆవేధన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కార్మిక కర్షక రైతు వ్యతిరేక చట్టాలను వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికులు ,రైతులు వ్యవసాయ కార్మికులు అన్ని రంగాల ప్రజలాందరూ కూడా ఈ సమ్మెలో భాగస్వామ్యం అయి జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు ఎం.ఏ రహెమాన్, జిల్లా కార్యదర్శి బి. వెంకటరాజ్యం ,బిహెచ్ఎల్ వర్కర్స్ యూనియన్ చీఫ్, వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్వర్ బాబు ,సతీస్, యాదరెడ్డి, చంద్రపాల్ రెడ్డి ,రాజ్‌కుమార్, సురేష్ కుమార్ విజయ్, ఎమ్మెల్యేస్ శ్రీనివాస్, ప్రవీణ్ రమణారెడ్డి ,మూర్తి ఆర్ లక్ష్మి శివశంకర్ పాల్గొన్నారు.




# సైబర్ నేరాల నివారణకు అవగాహన ఒక్కటే మార్గం

జిల్లా ఎస్పి పరితోష్ ఫంకజ్



**ప్రజాఫక్షం/ సంగారెడ్డి:** ప్రస్తుతం సమాజాన్ని పట్టి పీడిస్తున్న సమస్యలలో ఆన్ లైన్ మోసాలు అతిపెద్ద సమస్యగా మా రాయి. సైబర్ నేరాల నుండి ప్రజలను రక్షించేందుకు తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ సైబర్ సెక్యూరిగీ బ్రాంచ్ ఆద్వర్యంలో సైబర్ జాగృతి దివాస్ ప్రాడ్ కాపుల్ స్టాప్ పేరుతో అవగాహన పేరుతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగుతుంది. గడిచిన సంవత్సర కాలంలో సంగారెడ్డి జిల్లా వ్యా ప్తంగా 1050 సైబర్ అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరిగింది. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయినా రూ 35.72 కోట్లలో నుండి 7.36 కోట్లను హోల్డ్ చేసి తిరిగి బాదితులకు అందించేలా చర్యలు తీసుకోవడం జరిగింది.ఎస్పి పరితోష్ పంకజ్ ఒక ప్రకటనలో మాట్లాడుతూ అమాయక ప్రజల బలహీనత సైబర్ నేరాగాళ్ల బలంగా వివిధ రకాల సైబర్ మోసాలకు పాల్పడుతున్నారన్నారు. సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిన ఈ రోజుల్లో ఆర్టిఫిషల్ ఇంటిలిజెన్స్ ను వినియోగించి కొత్త పద్దుతుల్లో సైబర్ నేరాలకు పాల్పడుతున్నారన్నారు. సైబర్ నేరాల గురించి అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని అనవసర లింక్‌లనుఓపెన్ చేసి ఇబ్బందులకు గురి కావోద్దని అన్నారు. ఈజీ మనికీ అలవాటుపడి అత్యాశకు పోయి సైబర్ నేరగాళ్లు పన్నిన వలలో పడవద్దని ఈజీ మని అంటే మోసం అని గుర్తించాలని అ న్నారు. సైబర్ నేరాలకుగురిఅవుతున్న వారిలో విద్యావంతులే అధికం అని మల్టీ లెవల్ మార్కెటింగ్ నకిలీ ట్రైడింగ్ పార్ట్ టైమ్ ఉద్యోగాల ఇన్వెస్టెంట్ ప్రాడ్స్,డిజిటల్ అరెస్ట్ వంటి ఆన్లైన్ మోసాల పట్ల అవగాహన కలిగి ఉండాలని మొదట డబ్బులు వస్తునట్లు ఆశ చూపించి ఆ తరువాత ఆన్లైన్ మోసాలకు పా ల్పడతారని గుర్తించాలన్నారు. అవ్వియం లేదని ఆసలు డిజిటల్ అరెస్ట్ ఉండరాదన్నారు. ఆన్లైన్ మోసాలకు పాల్పడతారని గుర్తించాలన్నారు. డిజిటల్ అరెస్ట్ అంటే ఎవ్వరు బయపడాల్సిన అన్యాయం లేదని అసలు డిజిటాల్ అరెస్ట్ ఉండదని అన్నారు. పరిచయాలకు దూరంగా ఉండాలని తెలియ ని లింక్స్ ఎపికె పిల్స్ ఓపెన్ చేసి మోసపోవద్దని అన్నారు ఎవరైనా సైబర్ నేరాలకు గురి అయినట్లయితే వెంటనే (గోల్డెన్ అవర్) 48 గంటల లోపు 1930 కు కాల్ చేసి యస్‌సిఆర్‌బి పోర్టల్ నందు కాంప్లయింట్ నమోదు చేయాలని ఎస్పీ సూచించారు.

## ఇందిరమ్మ రాజ్యంలోనే పల్లెలు, పట్టణాల అభివృద్ధి



**ప్రజాపక్షం మెదక్:** ఇందిరమ్మ రాజ్యంలోనే పల్లెలు పట్టణాలు బాగుచేయాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకెళ్తుందని మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు అన్నారు. శనివారం మెదక్ పట్టణంలోని 5,7,10,27 వార్డుల్లో మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ హ యాంలో చేసిన అభివృద్ధి పనులను ప్రజలు మర్చిపోలేదన్నారు. మెదక్ పట్టణం అభివృద్ధి చెందాలంటే అధికార కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్న విషయాన్ని ప్రజలు గుర్తించి కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్దులను గెలిపించుకొని మెదక్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేయాలన్నారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని అన్నారు.మాజీ మన్సిపల్ చైర్మన్‌లు, మాజీ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

# సూర్య తుఫాన్ ఇన్నింగ్స్..

టీ20 ప్రపంచ కప్ 2026లో భాగంగా గ్రూప్ స్టేజిలో వాంఖడే వేదికగా టీమిండియాయూఎస్ఏ తలపడుతున్నాయి. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్.. నిర్ణీత 20 ఓవర్లకు 9 వికెట్లు కోల్పోయి 161 పరుగుల చేసింది. యూఎస్ఏ జట్టుకు 162 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. ఓ వైపు పేకమేడల్లా బ్యాటర్లంతా కుప్పకూలిపోతున్నా.. కెప్టెన్ సూర్య ఒంటరిగా పోరాడాడు. కేవలం 36 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. మొత్తంగా 49 బంతుల్లో 84 పరుగులతో అజేయంగా నిలిచాడు. ఆఖరి ఓవర్లో వరుసగా రెండు ఫోర్లు, సిక్సులు బాది విధ్వంసం సృష్టించాడు. 77 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడ్డ టీమిండియా 100 పరుగులైనా చేస్తుందా? అన్న సందేహాలు ఏర్పడ్డాయి. ఒకే ఓవర్‌లో తిలక్ వర్మ, శివం దూబె, ఇషాన్ కిషన్‌లను ఔట్ చేసి షాక్‌విక్.. టీమిండియాకు షాకిచ్చాడు. సూర్య నిలబడ్డాడు కాబట్టే ఈ మోస్తరు స్కోరు అయినా భారత్ సాధించిందనడంలో సందేహమే లేదు. బ్యాటర్లలో సూర్యకుమార్(84*) టాప్ స్కోరర్. ఇషాన్ కిషన్(20), తిలక్ వర్మ(25) పర్వాలేదనిపించారు. అభిషేక్ శర్మ(0), శివమ్ దూబె(0), రింకూ సింగ్(6), హార్దిక్ పాండ్య(5), అక్షర్ పటేల్(14), అర్ష్‌దీప్ సింగ్(4) వరుణ్ చక్రవర్తి(0) తీవ్రంగా విఫలమయ్యారు. అమెరికా బౌలర్లలో వాన్ షాక్‌విక్ 4 వికెట్లు తీసి ఆశ్చర్యపర్చాడు. హర్మీత్ సింగ్ 2, అలీ ఖాన్, మొహ్సిన్ తలొక వికెట్ పడగొట్టారు.



తొలిపోరులో టీమిండియా భారీ స్కోర్..!
అమెరికా టార్గెట్ 162

## వరల్డ్‌కప్‌లో తొలి హ్యాట్రిక్..

### ఒంటిచేత్తో విండీస్‌ను గెలిపించిన షెపర్డ్!

టీ20 ప్రపంచకప్‌లో బ్యాటర్ల విధ్వంసానికి బ్రేకులు వేస్తూ హ్యాట్రిక్‌తో రికార్డు నెలకొల్పాడు రొమారియో షెపర్డ్ . మెగా టోర్నీ తొలి మ్యాచ్‌లోనే అతడు ఈఈ సీట్ సాధించాడు. శనివారం ఈడెన్ గార్డెన్స్‌లో స్కాట్లాండ్ బ్యాటర్లను వణికించిన ఈ స్పీడ్‌స్టర్ 17వ ఓవర్లో హ్యాట్రిక్ సాధించాడు. తద్వారా ఈ సీజన్‌లో ఈ మైలురాయితో మొదటి బౌలర్‌గా రికార్డు నెలకొల్పాడు. మొత్తంగా ప్రపంచకప్‌లో హ్యాట్రిక్ తీసిన పదో బౌలర్‌గా షెపర్డ్ చరిత్ర సృష్టించాడు. పదో సీజన్ టీ20 ప్రపంచకపలో వెస్టిండీస్ పేసర్ హ్యాట్రిక్‌తో జట్టును గెలిపించాడు. 183 పరుగుల ఛేదనలో తడబ డిన స్కాట్లాండ్‌ను చావు దెబ్బకొడుతూ పేస్ గన్ ఐదు వికెట్లు పడగొ ట్టాడు. 17వ ఓవర్ రెండో బంతికి క్రాస్‌ను ఔట్ చేసిన షెపర్డ్ మూడో బంతికి లీస్క్‌ను పెవిలియన్ పంపాడు. హ్యాట్రిక్ బంతికి ఒలివర్ డేవిడ్‌సన్ క్లీన్‌బౌల్డయ్యాడు. అంతే.. టీ20 ప్రపంచకప్‌లో హ్యాట్రిక్ తీసిన పదో బౌలర్‌గా నిలిచాడు షెపర్డ్



## వరల్డ్‌కప్ ట్రోఫీతో రోహిత్ శర్మ..

### 'దద్ధరిల్లిన వాంఖడే.. స్టేడియం'


భారత్‌లో క్రికెట్ జ్వరం మళ్లీ మొదలైంది. నిరుడు మహిళల వన్డే ప్రపంచకప్ ప్రేక్షకులను అలరించగా.. ఇప్పుడు పొట్టి ప్రపంచకప్ సందడి ఘనంగా షురూ అయింది. ముంబైలోని వాంఖడే స్టేడియం అభిమానులతో నిండిపోగా.. అందరి కరతాళధ్వనుల మధ్య ప్రపంచకప్ అంబాసిడర్ రోహిత్ శర్మ, ఐసిసి అధ్యక్షుడు జై షాలు ఎంట్రీ ఇచ్చారు. బ్లాక్ డ్రెస్, తెలుపు షూతో తళుక్కుమన్న రోహిత్ వరల్డ్‌ప్ ట్రోఫీతో మైదానంలోకి వచ్చాడు. పదో సీజన్ టీ20 ప్రపంచకప్ పోటీలతో క్రీడాభిమానులు పులకించిపోతున్నారు. భారత జట్టు మ్యాచ్‌కు వేదికైన వాంఖడే స్టేడియం కిక్కిరిసిపోయింది. డ్రమ్స్ శివమణి తన స్టయిల్ ప్రదర్శనతో అభిమానులతో స్టెప్పులు వేయించారు. మరో వైపు నృత్యకారులు.. యువతీయువకుల బృందం లయబద్ధంగా, హుషారుగా డ్రమ్స్ వాయిస్తూ వరల్డ్‌ప్ జోష్ నింపారు. అనంతరం ప్రపంచకప్ అంబాసిడర్, భారత మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ మైదానంలోకి వచ్చాడు. ఐసీసీ ఛైర్మన్ జై షాతో కలిసి ఎంట్రీ ఇచ్చిన హిట్‌మ్యాన్.. వరల్డ్‌కప్ ట్రోఫీని మైదానంలోకి తీసుకొస్తుంటే రోహిత్.. రోహిత్ నినాదాలతో స్టేడియం మార్మోగిపోయింది.






# ఎస్‌బిఐ రికార్డు లాభం

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) 2025–26 ఆర్థిక సంవత్సరంలోని మూడవ (డిసెంబర్) త్రైమాసికంలో (క్యూ3) చరిత్రలోనే అత్యధిక లాభాన్ని నమోదు చేసింది. శనివారం విడుదల చేసిన ప్రకటన ప్రకారం, స్టాండ్‌అలోన్ ప్రాతిపదికన బ్యాంక్ లాభం రూ.21,028 కోట్లకు చేరింది. ఇది ఎస్‌బీఐకి ఇప్పటివరకు ఒకే త్రైమాసికంలో వచ్చిన అత్యధిక లాభంగా నిలిచింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన చూస్తే, లాభం 13.06 శాతం పెరిగి రూ.21,317 కోట్లుగా నమోదైంది. రుణాల వృద్ధి, ఫీజు ఆదాయం, పెట్టుబడుల నుంచి వచ్చిన లాభాలు ఈ పెరుగుదలకు ప్రధాన కారణాలుగా నిలిచాయి. స్టాండ్‌అలోన్ ప్రాతిపదికన బ్యాంక్ యొక్క ప్రధాన నికర వడ్డీ ఆదాయం (నెట్ ఇంటరెస్ట్ ఇన్‌కమ్) 9.04 శాతం పెరిగి రూ.45,190 కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే కాలంలో ఇది రూ.41,446 కోట్లుగా ఉంది. ఈ వృద్ధికి 15.14 శాతం రుణాల వృద్ధి తోడైంది. అయితే దేశీయ నికర వడ్డీ మార్జిన్ స్వల్పంగా 0.03 శాతం తగ్గి 3.12 శాతంగా నమోదైంది. వడ్డీయేతర ఆదాయం కూడా గణనీయంగా పెరిగింది. ఈ ఆదాయం 15.65 శాతం వృద్ధితో రూ.8,404 కోట్లకు చేరింది. మరోవైపు, మొత్తం ఖర్చులు పెరిగి రూ.1,08,052 కోట్లుగా నమోదయ్యాయి. గత ఏడాది మూడో త్రైమాసికంలో ఇవి రూ.1,04,917 కోట్లుగా ఉన్నాయి. డిపాజిట్లు 2025 అక్టోబర్–డిసెంబర్ కాలంలో 9.02 శాతం వృద్ధిని నమోదు చేశాయి. తాజా నిరర్థక ఆస్తులు (ఎన్‌పిఎ)గా మారిన ఖాతాలు రూ.4,458 కోట్లుగా ఉండగా, గత ఏడాది ఇదే కాలంలో ఇవి రూ.3,823 కోట్లుగా ఉన్నాయి. అయితే స్థూల ఎన్‌పీఏ నిష్పత్తి మెరుగుపడి డిసెంబర్ 31, 2025 నాటికి 1.57 శాతంగా నమోదైంది. సెప్టెంబర్‌లో ఇది 1.73 శాతంగా ఉంది. ప్రొవిజన్లు రూ.4,507 కోట్లుగా ఉన్నాయి. డిసెంబర్ చివరి నాటికి బ్యాంక్ యొక్క మొత్తం మూలధన సరిపోతున్న నిష్పత్తి 14.04 శాతంగా, కోర్ బఫర్ 10.99 శాతంగా ఉంది. ప్రెస్ సమావేశంలో ఎస్‌బీఐ చైర్మన్ సి.ఎస్. సెట్టి మాట్లాడుతూ, ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ నుంచి వచ్చిన రూ.2,200 కోట్ల ప్రత్యేక డివిడెండ ఫీజు ఆదాయం పెరగడం, రాసిచ్చిన ఖాతాల నుంచి రికవరీలు, నికర వడ్డీ ఆదాయం పెరుగుదల లాభాల వృద్ధికి దోహదపడ్డాయని తెలిపారు.






## టారిఫ్ ఒక్కటే ప్రధానం కాదు..

భారత్, అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందంలో భాగంగా, గతంలో విధించిన 25 శాతం అదనపు టారిఫ్‌ను రద్దు చేస్తున్నట్టు అగ్రరాజ్యం ప్రకటించడం ఆహ్వానించదగిన పరిణామమే. కానీ, ఈ ఒక్క చర్యతో భారత ఎగుమతిదారుల సమస్యలన్నీ తీరిపోతాయనిగానీ, ఎగుమతుల విలువ అకస్మాత్తుగా పెరిగిపోతుందనిగానీ ఊహించలేం. టారిఫ్ తగ్గింపుతో ధరల పరంగా భారత ఉత్పత్తులకు పోటీ సామర్థ్యం పెరుగుతుంది, కానీ ఆ లాభం పూర్తిగా ఫలించాలంటే నిర్మాణాత్మక సమస్యలను కూడా సమాంతరంగా పరిష్కరించాల్సి ఉంటుంది. టారిఫ్ తగ్గింపు వల్ల కలిగే లాభాలను పరిశీలిస్తే, విదేశీ మార్కెట్లలో భారత వస్తువుల ధరలు తగ్గుతాయి. దీని వల్ల ఆర్డర్లు పెరగడం, కొత్త కొనుగోలుదారులను ఆకర్షించడం సాధ్యమవుతుంది. ముఖ్యంగా టెక్స్‌టైల్స్, లెదర్, ఇంజినీరింగ్ పరికరాలు, ఆటో విడిభాగాలు, రసాయనాలు వంటి రంగాల్లో తక్షణ ప్రభావం కనిపించే అవకాశం ఉంది. చిన్న, మధ్య తరహా ఎగుమతిదారులకు ఇది నగదు ప్రవాహాన్ని మెరుగుపరచి ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడానికి దోహదపడుతుంది. అలాగే, గ్లోబల్ సరఫరా గొలుసుల్లో భారత ఉత్పత్తులు మరింత పోటీగా మారతాయి. అయితే, ఈ ప్రయోజనాలు స్థిరంగా ఉండాలంటే అనేక సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుంది. వాటిలో మొదటిది, ప్రధానమైనది ఉత్పత్తి వ్యయం. భారత్‌లో విద్యుత్, లాజిస్టిక్స్, ఫైనాన్స్ ఖర్చులు ఇంకా అధికంగానే ఉన్నాయి. టారిఫ్ తగ్గింపుతో లభించే ధరల లాభం, ఈ అధిక వ్యయాల వల్ల కొంత మేర తరిగిపోతుంది. ముఖ్యంగా విద్యుత్ ఖర్చులు, రవాణా ఆలస్యాలు, పోర్ట్ కనెక్టివిటీ లోపాలు ఎగుమతిదారుల పోటీ సామర్థ్యాన్ని తగ్గిస్తున్నాయి. అదే విధంగా నాణ్యతా ప్రమాణాలు, సాంకేతిక అర్హతలు. యూరప్, అమెరికా వంటి మార్కెట్లలో కఠినమైన పర్యావరణ, భద్రత, లేబెలింగ్ నిబంధనలు ఉన్నాయి. మూడవది వాణిజ్య అనిశ్చితి. గ్లోబల్ రాజకీయ ఉద్రిక్తతలు, ప్రాంతీయ యుద్ధాలు, సరఫరా గొలుసుల అంతరాయాలు డిమాండ్‌ను అకస్మాత్తుగా ప్రభావితం చేస్తున్నాయి. రూపాయి విలువలో తీవ్ర హెచ్చుతగ్గులు ఎగుమతిదారుల లాభాలను ప్రభావితం చేస్తాయి. టారిఫ్ తగ్గింపుతో వచ్చిన లాభం, ప్రతికూల కరెన్సీ మార్పిడుల వల్ల తగ్గిపోవచ్చు. హెడ్జింగ్ వంటి ఆర్థిక సాధనాలను వినియోగించడంలో చిన్న ఎగుమతిదారుల సామ ర్థ్యం తక్కువ అనేది బహిరంగ రహస్యం. చైనా, వియత్నాం వంటి దేశాలతో పోలిస్తే భారత తయారీ రంగం ఇంకా బలపడలేదు. ఏ రకంగా చూసినా, 25 శాతం అదనపు టారిఫ్ తగ్గింపు భారత ఎగుమతులకు తాత్కాలికంగా ఊతమివ్వగలదు. కానీ దీన్ని స్థిరమైన వృద్ధిగా మార్చాలంటే లాజిస్టిక్స్ సంస్కరణలు, తక్కువ ఖర్చుతో ఫైనాన్స్, నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా తయారీ, నైపుణ్యాభివృద్ధి, విధాన స్థిరత్వం వంటి అంశాలపై సమగ్ర దృష్టి అవసరం. అప్పుడే టారిఫ్ తగ్గింపు నిజంగా భారత ఎగుమతులను దీర్ఘకాలంలో బలపరుస్తుంది. ఈ దిశగా అడుగులు అత్యవసరం.

### ఈ వారం స్టాక్ మార్కెట్లు

బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బిఎస్‌ఇ/ క్లోజింగ్): సెన్సెక్స్ 83,580.40 పాయింట్లు (ఈ వారం ప్రారంభంలో 82,049.94 పాయింట్లు. లాభం 1,530.46 పాయింట్లు).

జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఇ/ క్లోజింగ్): నిఫ్టీ 25,693.70 పాయింట్లు (ఈ వారం ప్రారంభంలో 25,048.65 పాయింట్లు. లాభం 645.05 పాయింట్లు).

---

# ప్రజా సమస్యలపై పోరాడేది కమ్యూనిస్టులే...

**కంకి కొడవలి గుర్తుపై ఓటేసి జూలూరు మమత జ్యోతిబసును గెలిపించండి : సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి**



**ప్రజాపక్షం/దేవరకొండ :** దేవరకొండ మున్సిపాలిటికి జరుగుతున్న ఎన్నికల్లో 10వ వార్డులో పోటీ చేస్తున్న భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) అభ్యర్థి జూలూరు మమత జ్యోతిబసు కంకి కోడవలి గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంఎల్‌ఏ పల్లా వెంకటరెడ్డి అన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎంఎల్‌సి నెల్లికంటి సత్యంతో కలిసి శనివారం దేవరకొండలోని 10వ వార్డులో డప్పు కళాకారులతో, పార్టీ నాయకులతో భారీ ర్యాలీగా ఇంటింటికి ప్రచారం నిర్వహించి కంకి కొడవలి గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈసందర్భంగా పల్లా వెంకటరెడ్డి, నెల్లికంటి సత్యంలు మాట్లాడుతూ ప్రజల కోసం నిత్యం పోరాడే కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థులను గెలిపించడం ద్వారా వార్డు సమస్యల పరిష్కారం కోసం పాలక వర్గాలపై ఒత్తిడి తీసుకొచ్చి పరిష్కరిస్తారన్నారు. నిత్యం ప్రజల మధ్య ఉండి ప్రజా సమస్యలపై అవగాహన ఉన్న వ్యక్తిని గెలిపిస్తే వార్డు ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కమ్యూనిస్టు పార్టీ ఎప్పుడు ప్రజల పక్షాన నిలబడి పోరాడుతుందని, ప్రత్యర్థి పార్టీల ప్రలోభాలకు లొంగకుండా నిబద్ధతగల సిపిఐ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించి అహంకారులకు తగిన రీతిలో బుద్ధి చెప్పాలని వారు పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో పూటకో పార్టీ మారుస్తూ నిమిషానికో కండువా కప్పుకునే కంత్రి గాళ్లు మీ వద్దకు వస్తుంటారని మాయమాటలు చెప్పి ఓట్లు దండుకొని ముఖం చాటేస్తారని అలాంటి వారిపట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రశ్నించే గొంతుక సిపిఐ అభ్యర్థిని గెలిపిస్తే నిజాయితీగా ప్రజల కోసం పనిచేస్తారని అన్నారు. 10వ వార్డు ప్రజలు మమతా జ్యోతిబసు కంకి కొడవలి గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని వారు కోరారు. ఈకార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి, మాజీ ఎంఎల్ఏ యాదగిరిరావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, గిరిజన సమాఖ్యరాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహా, జిల్లా కార్యవర్గ సభ్యులు, మండల కార్యదర్శులు, ప్రజా సంఘాల నియోజకవర్గ నాయకులు సుదర్శన్‌రెడ్డి, మైనోద్దిన్, రామస్వామి, ఆంజనేయులు, వెంకటయ్య, రంగారెడ్డి, విజేందర్‌రెడ్డి, వెంకటయ్య, అంజల్‌రావు, పాండురంగారెడ్డి, వెంకటేశ్వర్లు, నవీన్, వెంగలయ్య, రామాంజనేయులు, రమేష్, శివకుమార్, జ్యోతి, యాదయ్య, షేక్ శంశోద్దీన్, నగేష్, లక్ష్మి , దేవిలాల్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

**నేడు చండూరు పల్లా వెంకట్‌రెడి ప్రచారం**

సిపిఐ జాతీయ కార్యదర్శి , మునుగోడు మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి, సిపిఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ఆదివారం చండూరు మున్సిపాలిటీలోని 4వ వార్డులో కాంగ్రెస్ బలచర్చిన సిపిఐ అభ్యర్థి జెల్లా ధనమ్మశ్రీనివాస్‌కు మద్దతు తెలిపి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించనున్నారు. నేడు ఉదయం 7గంటలకు మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డు అంగడిపేటలో పార్టీ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించనున్నారని సిపిఐ చండూరు మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్ తెలిపారు.

# మానుకోట మున్సిపాలిటీ ఎన్నికలకు సిపిఐకి ఇచ్చిన మాట ఏమైంది?

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చాడా వెంకట్‌రెడ్డి
- ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి ఎమ్మెల్యే మురళి నాయక్‌కు సూటిప్రశ్న
- సిపిఐ అభ్యర్థులను గెలిపించండి



**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** మానుకోట మున్సిపాలిటీ ఎన్నికలకు సిపిఐ నేతలకు ఇచ్చిన నీ మాట ఏమైంది అని ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డిని. ఎమ్మెల్యే మురళి నాయక్‌ను సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చాడా వెంకటరెడ్డి సూటిగా ప్రశ్నించారు. మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని సిపిఐ అభ్యర్థులు గెలుపు కోసం శనివారం చాడా వెంకటరెడ్డి విస్తృత ప్రచారం, ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఎన్నికల ప్రచార సభలో చాడ మాట్లాడుతూ ముఖ్యంగా రాష్ట్రంలో 118 అసెంబ్లీ సీట్లలో కాంగ్రెస్‌కు సిపిఐ మద్దతిచ్చి గెలిపించామన్నారు. ముఖ్యంగా మహబూబాబాద్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే మురళి నాయక్ గెలుపు కోసం ఇంత మెజార్టీ రావడంలో సిపిఐదే కీలక పాత్ర పోషించారని, నాడు గెలిచి నేడు మోసం చేస్తారా? అని ఆయన అన్నారు. మున్సిపాలిటీ ఎన్నికల్లో దశలవారీగా చర్చలు జరిపి వేం నరేందర్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, మురళి నాయక్, ఉమా అందరూ కలిసి సిపిఐ గొంతు కోశారని ఆగ్రహించారు. మానుకోటలో కాంగ్రెస్‌కు గట్టి బుద్ధి చెప్పాలని చాడ పిలుపునిచ్చారు. సిపిఐ వార్డు అభ్యర్థులు బి అజయ్ సారథి రెడ్డి, పెరుగు కుమార్, రేశ పల్లి నవీన్, చింతకుంట్ల శ్రీదేవి వెంకన్న, ఎండి ఫాతిమా, నద్రా సంధ్య శ్రావణ్ ,నాగేల్లి యాకమ్మ లను భారీ మెజార్టీతో గెలిపించి మున్సిపాలిటీ పంపిస్తే అభివృద్ధికి పోరాటం చేస్తారని మున్సిపాలిటీలో సమస్యల పరిష్కారం కోసం పోరాడుతారన్నారు. ప్రస్తుతం జరుగుతున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో సిపిఐ తరుపున పోటీ చేస్తున్న వార్డు అభ్యర్థులను గెలిపించి కాంగ్రెస్ అభ్యర్థులను ఓడించి తగిన గుణపాఠం చెప్పాలని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కా ర్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్ళపల్లి శ్రీనివాసరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి బి వి జయ సారథి, 33వ వార్డు అభ్యర్థి సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్ సార్ రెడ్డి, వార్డు అభ్యర్థులు పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల శ్రీదేవి వెంకన్న, ఎండి ఫాతిమా, తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ బలపరిచిన అభ్యర్థి ఇంటింటా ప్రచారం

**ప్రజాపక్షం/నర్సాపూర్ :** నర్సాపూర్ మున్సిపల్ ఎన్నికల్లో సందర్భంగా సిపిఐ పార్టీ బలపరిచిన బైల్ పాటి లక్ష్మి గణేష్ 4వ వార్డ్ లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు ప్రచార కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర నాయకులు ఏసురత్నం పాల్గొని మాట్లాడుతూ, గతంలో విట్టల్ రెడ్డి చేసిన పలు అభివృద్ధి కార్యక్రమాల కోసం తెలియజేశారు. అదే విధంగా సిపిఐ మెదక్ జిల్లా కార్యదర్శి టియం కాలే వారు మాట్లాడుతూ, ప్రజలకు గుర్తించే పార్టీ సిపిఐ పార్టీ అని ఎలాంటి సమస్య ఉన్న ముందుండి చేస్తానని హామీ ఇచ్చారు. కంకికొడవలి గుర్తుకి ఓటు వేసి గెలిపించాలని వార్డు ప్రజలను కోరారు. ప్రచార కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు కాలేక్, రాజా గౌడ్, పార్టీ అనుబంధ సంఘం ఎఐటియుసి జిల్లా బాధ్యులు పి.నందం, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



## ప్రజల మనిషి బబ్బూరి శ్రీధర్



**ఇంటింటికీ తిరుగుతూ ఓట్లు అభ్యర్థించిన సిపిఐ రాష్ట్ర నాయకుడు గోదా శ్రీరాములు**

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట:** యాదగిరిగుట్ట మున్సిపల్ ఎన్నికల సమయం దగ్గరపడుతుండటంతో 12వ వార్డులో రాజకీయ సందడి నెలకొంది. కాంగ్రెస్, సిపిఎం బలపరిచిన సిపిఐ అభ్యర్థి బబ్బూరి శ్రీధర్‌కు మద్దతుగా ప్రచారం ఊపందుకుంది. ఈ క్రమంలో శనివారం సిపిఐ రాష్ట్ర నాయకులు గోదా శ్రీరాములు వార్డులోని ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. శ్రీధర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన ఓటర్లను కోరారు. ఈ సందర్భంగా గోదా శ్రీరాములు మాట్లాడుతూ బబ్బూరి శ్రీధర్‌కు గతంలో ప్రజల మధ్య ఉండి పని చేసిన అనుభవం ఉందని కొనియాడారు. వార్డు సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించే గుణం, అభివృద్ధిపై అపారమైన అవగాహన ఉన్న నాయకుడు శ్రీధర్ కేవలం మాటలకే పరిమితం కాకుండా, సమస్యల పరిష్కారానికి కార్యాచరణ రూపొందించుకునే వ్యక్తి ఆయన,' అని పేర్కొన్నారు.ఈ ప్రచార కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, పెరబోయిన మహేందర్, కొల్లూరి రాజయ్య, మాజీ కోఆప్షన్ నెంబర్ పేరబోయిన పెంటయ్య, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేషన్ ఎన్నికల్లో విజయం తథ్యం : భాగం

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఈనెల 11న జరగనున్న కార్పొరేషన్ ఎన్నికల్లో సిపిఐ అభ్యర్థుల విజయం తథ్యమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు భాగం హేమంతరావు అన్నారు. రామవరం పరిధిలోని6 డివిజన్లు, బర్మాక్యాంపు, ప్యూన్‌బస్తీ, పాత కొత్తగూడెం ఏరియాల్లోని డివిజన్లలో పోటీ చేస్తున్న సిపిఐ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భాగం మాట్లాడుతూ ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు గెలిచిన తర్వాత సుజాతనగర్, కొత్తగూడెం, పాల్వంచ ప్రాంతాలను కలిపి కార్పొరేషన్ తీసుకొచ్చారని చెప్పారు. పాల్వంచలో పాతికేళ్ల నుండి స్థానిక సంస్థల ఎన్నికలు లేవని, ఇప్పుడు అక్కడ ఎన్నికలు రావడంతో ఆ ప్రాంత ప్రజల్లో సంతోషం వ్యక్తమవుతోందన్నారు. 60 డివిజన్ల వ్యాప్తంగా పరిస్థితుల ప్రభావంతో సిపిఐ అభ్యర్థులు పోటీలో ఉన్నారని, అగ్రస్థానాలను సిపిఐ కైవసం చేసుకోబోతోందన్నారు. ఎన్నికల సందర్భంగా ఎన్నడూ బస్తీల్లో కనబడని వారు ఓట్ల కోసం మాయమాటలు చెప్పేందుకు వస్తున్నారని, వారి మాటల్లో అంతరార్థాన్ని గ్రహించాలని ఓటర్లకు సూచించారు. నిత్యం ప్రజలతో ఉండే సిపిఐ అభ్యర్ధుల విజయం వల్ల అవినీతి రహిత పాలన అందుతుందని, తద్వారా ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. సిపిఐ అభ్యర్థుల కంకికొడవలి గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, సిపిఐ జిల్లా నాయకులు కంచర్ల జమలయ్య, సలిగంటి శ్రీనివాసరావు, దుర్గరాశి వెంకటేశ్వర్లు, ఎస్‌కే ఫహీమ్, జీ వీరస్వామి, వాసిరెడ్డి మురళీ,వై ఉదయ్ భాస్కర్, కందుల భాస్కర్, జిల్లా సమితి సభ్యులు మునిగడప వెంకటేశ్వర్లు, విద్యానగర్ గ్రామ పంచాయితీ సర్పంచ్ భూక్యా శాంతి ప్రియ, నాయకులు వాకపల్లి హరినాథ్, గోపి కృష్ణ, జహీర్ తదితరులు పాల్గొన్నారు.




## కాంగ్రెస్, సిపిఐ, సిపిఐ(ఎం) అభ్యర్థులను గెలిపించాలి

**సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు పిలుపు**

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** హుజూర్‌నగర్ మున్సిపాలిటి ఎన్నికల్లో పోటీ చేస్తున్న కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు కోరారు. శనివారం హుజూర్‌నగర్ పట్టణంలోని కాంగ్రెస్, సిపిఎం పార్టీలు బలపర్చిన 10వ వార్డు సిపిఐ అభ్యర్థి చెనగాని సైదులు, 17వ వార్డు అభ్యర్థి గుండు తిరపతమ్మ వెంకటేశ్వర్లు విజయాన్ని ఆకాంక్షిస్తూ ఆయా వార్డులలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హుజూర్‌నగర్ మున్సిపాలిటి సమగ్ర అభివృద్ధి చెందాలంటే మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నాయకత్వంలో వార్డులో ఉన్న కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం అభ్యర్థిలను గెలిపించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపి ఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటేశ్వర్లు, దేవరం మల్లేశ్వరి, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు జడ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



## అభివృద్ధి జరగాలంటే కూటమి అభ్యర్థిని గెలిపించాలి



**ప్రజాపక్షం/భూపాలపల్లి:**24 వ వార్డు అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ పార్టీ సిపిఎం పార్టీలు బలపరిచిన సిపిఐ అభ్యర్థి వేముల జ్యోతి శ్రీకాంతను అధిక మెజారిటీతో గెలిపించాలని రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాష్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు లు పిలుపునిచ్చారు. శనివారం భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 24 వ వార్డులో కూటమి బలపరిచిన సిపిఐ కౌన్సిలర్ అభ్యర్థి గెలుపుని కాంక్షిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో సుమారు వందకోట్లతో మౌలిక వసతుల పనులకు ప్రభుత్వం నుండి నిధులు కేటాయించి అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి సభ్యుడు చల్లూరి మధు, వార్డు ఇన్చార్జి రాజిరెడ్డి, ఉప్పగల కిషోర్ రెడ్డి, వీరారెడ్డి, షాబీర్ ఖాన్,కేవీ అశోక్, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఫర్టిలైజర్ బుకింగ్ యాప్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాపక్షం/మహాదేవపూర్;**ఫర్టిలైజర్ బుకింగ్ యాప్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారిణి పూర్ణిమ అన్నారు.శనివారం మండలకేంద్రంలోని రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 8వ తేదీ నుండి రైతులు తమకు అవసరమైన యూరియా కొనుగోలుకు యాప్ ద్వారా ముందుగా బుక్ చేసుకుని యూరియా బస్తాలు పొందాలని అన్నారు.యాప్‌లో రైతులు పాస్‌బుక్ ఆధార్ అనుసంధానం చేసి బుకింగ్ చేయాల్సి ఉంటుందని అన్నారు.తద్వారా ఎరువుల సరఫరాలో అవకతవకలు లేకుండా పారదర్శకంగా అందించడానికి అవకాశం ఉంటుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఫర్టిలైజర్ యాజమాన్యాలు డిసిఎంఎస్ సంస్థతో పాటు రైతులు పాల్గొన్నారు.

## తొర్రూరు డిపోలో ఇడి తనిఖీ



**ప్రజాపక్షం/తొర్రూరు :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమ్మక్క సారలమ్మ మహా జాతరను విజయం చేసిన సందర్భాన్ని పురస్కరించుకొని శనివారం తొర్రూరు ఆర్‌టిసి డిపోను ఈడీ సోలామాన్ రాజ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇడి సోలామాన్ రాజ్ మాట్లాడుతూ తొర్రూరు డిపో నుంచి సమ్మక్క సారలమ్మ మహా జాతరకు సుమారు వంద బస్సు సర్వీస్‌లు నడపడంతో పాటు ఎలాంటి బస్సు ప్రమాదాలు లేకుండా డిపోకు అధిక ఇపికే, కేఎంపీఎల్‌ను తీసుకురావడానికి సహకరించిన డిపో మేనేజర్ పద్మావతిని ప్రశంసించారు. గ్యారేజ్‌లో బస్సులను పరిశీలించి గ్యారేజ్ సిబ్బందికి సూచనలు, సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎఫ్ విజయ్‌కుమార్, ఎస్‌టీఐ రజితరెడ్డి, ఎంసీ గోపాల్ రెడ్డి, ఎస్‌డీఐ, ఏడీసీలు, మెకానిక్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.




## ఎన్నికల నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలి: ఏసిపి

**ప్రజాపక్షం/ నర్సంపేట :** మున్సిపాలిటి ఎన్నికల నిబంధనలు ప్రతి ఒక్కరు పాటించాలని నర్సంపేట ఏసిపి రవీందర్‌రెడ్డి అన్నారు. నర్సంపేట పట్టణంలో వినియోగదారుల సమాచార కేంద్రం కమిటీ, స్వచ్ఛంద సంస్థల సమాఖ్య ఆధ్వర్యంలో మునిసిపాలిటీకి సంబంధించిన ఎన్నికల ఓటరు చైతన్య కరపత్రాన్ని ఏసిపి పున్నం రవీందర్ రెడ్డి, మున్సిపాలిటీ కమిషనర్ కె భాస్కర్‌ల చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగాఏసిబి రవీందర్ రెడ్డి, కమిషనర్ కె భాస్కర్ లు మాట్లాడుతూ మైకులు అన్ని పార్టీలు గృహ నివాసాలలో పగలు 55 డెసిబుల్స్, రాత్రి 45 డెసిబుల్స్, ఆసుపత్రులు స్కూల్ ఏరియాలో 50 పగలు, 40 రాత్రి డేసిబుల్స్ దాటితే జప్తు చేయడం, లక్ష రూపాయల వరకు పెనాల్టీ వేయడం ఇంకా అభ్యర్థి అర్హత కోల్పోవడం అట్లే బహుమతులు, డబ్బులు, మద్యం పంచరాదని పర్మిషన్ లేకుండా ర్యాలీలు సమావేశాలు పెట్టరాదని, ఉల్లంఘించినచో ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా ఆర్టికల్ 324, ఐపిసి సెక్షన్ 123, 171 మొదలైన సెక్షన్ల ద్వారా అర్హత కోల్పోవడం, జరిమానాలు, ఆరు నెలల నుంచి రెండు సంవత్సరాల వరకు జైలు శిక్షలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం అధ్యక్షుడు గిరగాని సుదర్శన్ గౌడ్, స్వయంకృషి స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు బెజ్జంకి ప్రభాకర్, ఏఎస్ఆర్ సేవా సంస్థ నిర్వాహకుడు ఎర్రబోయిన రాజశేఖర్, ఎస్సి, ఎస్టి కన్వీనర్ బోయిన వెంకటస్వామి, మొగిలిచర్ల రాము, రవికాంత్, సిబ్బంది, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాల నిషేధంపై అవగాహన

**ప్రజాపక్షం/ఎల్కతుర్తి:** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం వల్భాపుర్ గ్రామంలో బాలికా సాధికారత కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వల్భపూర్‌లో బాల్య వివాహాలు నిషేధం అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జీసీడీవో ఎస్. సునీత, గ్రామ సర్పంచ్ పొనగంటి శ్వేత శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించి, బాలికల విద్య, ఆరోగ్యం, భవిష్యత్తు పరిరక్షణకు బాల్య వివాహాల నివారణ ఎంతో అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కెసిఆర్ హయాంలోనే అభివృద్ధి

**ప్రజాపక్షం/తొర్రూరు :** తెలంగాణ తెచ్చిన తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ కృషితోనే తొర్రూరు ఎంతో అభివృద్ధి జరిగిందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో శనివారం మున్సిపల్ వార్డు అభ్యర్థులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు చేపట్టిన భారీ బైక్ ర్యాలీతో తొర్రూరు పట్టణం గులాబీమయంగా మారింది. ఇంటింటి ప్రచారంలో భాగంగా పలు వార్డుల్లో అభ్యర్థులతో కలిసి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయా

# అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్‌ను ఆదరించండి

**కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే అభివృద్ధి బాధ్యత నాదే* స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి**



**ప్రజాపక్షం/స్టేషన్ ఘన్ పూర్ :** ఘన్ పూర్ మున్సిపాలిటీ అభివృద్ధి చెందాలంటే ఒక్క కాంగ్రెస్ ప్రభుత్వంతో సాధ్యమని, ప్రభుత్వ సహకారం లేకుండా ఏ ఒక్క పని చేయలేమని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు.స్టేషన్ ఘన్ పూర్ మున్సిపాలిటీ పరిధిలోని 16,17,18 వార్డులలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారానికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు మద్దతు తెలుపుతూ ప్రజలు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే అభివృద్ధికి వేసినట్లేనని అన్నారు. మీ ఆశీర్వాదంతోనే 30ఏళ్లుగా రాజకీయాలలో ఉంటున్నానని వెల్లడించారు. రెండేళ్ల క్రితం నన్ను ఎమ్మెల్యే గా ఎన్నుకుంటే ఘనపూర్‌ను మున్సిపాలిటీ చేస్తానని హామీ ఇచ్చానని, ఇచ్చిన మాట ప్రకారం జనవరి 2025లో మున్సిపాలిటీ చేసానని అన్నారు. అయితే ఘనపూర్ మున్సిపాలిటీలో చాలా సమస్యలు ఉన్నాయని ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకువెళ్ళగానే 50కోట్ల రూపాయలు మంజూరు చేశారని తెలిపారు. ఇప్పటికే 25కోట్లతో సిసి రోడ్లు, డ్రానేజీలు, వరద కాలువల నిర్మాణానికి శంకుస్థాపన చేసుకున్నామని, ఇంకా మున్సిపల్ కార్యాలయం, టౌన్ హాల్, లైబ్రరీ, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ వంటి పనులు ప్రారంభించుకోవాల్సి ఉందని వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే మరో 50కోట్లు తీసుకువస్తానని తెలిపారు. 16,17,18 వార్డులలో సరైన సిసి రోడ్లు లేవు, డ్రైనేజీలు లేవని అన్నారు. ఈ నెల 11న జరిగే మున్సిపల్ ఎన్నికలలో చేతి గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే వార్డుకు 2కోట్ల రూపాయలతో సిసి రోడ్లు, డ్రైనేజీలు, వరద కాలువలు నిర్మాణం చేసి అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. వార్డు కు 40ఇందిరమ్మ ఇండ్లు ఇస్తానని అన్నారు. ప్రభుత్వ సహకారం లేకుండా, ఎంపీ, ఎమ్మెల్యే లేకుండా ఒక్క రూపాయి కూడా తేలేరని తెలిపారు. ప్రభుత్వంలో లేని వారికీ, అభివృద్ధి చేయలేని వారికీ ఓటు వేస్తే నష్టపోతామని అన్నారు. కావున కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మీ కాలనీలలో, మీ వార్డులలో మీరు కోరుకున్న అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా వార్డుల అభ్యర్థులు, ఇంచార్జ్ లు, పరిశీలకులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

**రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి**

**ప్రజాపక్షం/తొర్రూరు :** అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నారం రోడ్డు సెంటర్‌లో పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, టిపిసిసి వైస్ ప్రెసిడెంట్ హనుమాండ్ల ఝాన్సీరాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్నర్ మీటింగ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ తొర్రూరు మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అఖండ విజయం సాధించడం ఖాయమైందని ధీమా వ్యక్తం చేశారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. గృహ నిర్మాణ శాఖ ద్వారా పేదలు, నిరుపేదలకు ఇంటి కలను సాకారం చేసేలా పలు పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు. తొర్రూరును అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే బాధ్యతను తాను తీసుకుంటున్నానని అన్నారు. అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్రూం ఇండ్లను పూర్తి చేసి అన్ని సదుపాయాలు ఏర్పాటు చేసి అర్హులైన నిరుపేదలందరికి డబుల్ బెడ్రూం ఇండ్లు అందజేస్తామన్నారు. తొర్రూరులో అసంపూర్తిగా ఉన్న రోడ్లు పూర్తి చేయిస్తానన్నారు.

**కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలి : పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి**

మున్సిపల్ ఎన్నికల్లో వార్డు అభ్యర్థుల గెలుపు కోసం ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు.

**ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నాం : టిపిసిసి వైస్ ప్రెసిడెంట్ హనుమాండ్ల ఝాన్సీరాజేందర్‌రెడ్డి**

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని తొర్రూరు పట్టణాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. ప్రజలతో నేరుగా అనుసంధానంగా కలిగి పని చేసే పార్టీ కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా విభాగం నేతలు, యువత, పాల్గొన్నారు.

## మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం

**పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి**

**ప్రజాపక్షం/పరకాల :** అధికార కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి పట్టణాన్ని అభివృద్ధి చేసుకుందామని,పరకాల పట్టణ ప్రజల ఆశీర్వాదంతో అభివృద్ధి, సంక్షేమాన్ని మరింత ముందుకు తీసుకెళ్ళేందుకు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి కోరారు. శనివారం పరకాల మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో భాగంగా పరకాల శాసనసభ్యుడురేవూరి ప్రకాశ్ రెడ్డి ఇంటింట ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పరకాల మున్సిపాలిటీ అన్ని వార్డులను అభివృద్ధి చేసే బాధ్యత తనది కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించే బాధ్యత మీది అని అన్నారు. ఒక ప్రత్యేకమైన డిపిఆర్ వ్యవస్థతో సిసి రోడ్, డ్రైనేజీ వ్యవస్థ, త్రాగునీరు మరిన్ని వసతులతో అభివృద్ధి చేస్తున్నామన్నారు.అన్ని వర్గాల అభివృద్ధి లక్ష్యంగా ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ఓట్ల కోసం వచ్చే టిఆర్ఎస్, బిజెపి నాయకుల మాటలను నమ్మవద్దని, అభివృద్ధి చేసే కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించాలని కోరారు. పరకాల పట్టణానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, నూతన డిగ్రీ కాలేజ్, ప్రభుత్వ ఆస్పత్రి, పరకాల మహిళా డైరీ, దామెర చెరువు అభివృద్ధి, తదితర పనులను చేపట్టామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని,పట్టణ అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన ధ్యేయంగా తమ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

**కాంగ్రెస్‌లో చేరిన ఏకు సుభాష్**

పరకాల మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డు బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏకు సుభాష్,బిఆర్ఎస్ యూత్ నాయకులు బాగాతి ప్రీతం ,వుక్కిరాల రాజేష్, మచ్చ నిఖిల్, గోవింద్, అజయ్ పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా వారికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాధారణంగా ఆహ్వానించారు.

## నేడు భూపాలపల్లికి ముఖ్యమంత్రి

**ప్రజాపాలన ప్రగతి బాట కార్యక్రమంలో పాల్గొననున్న సిఎం*పలు అభివృద్ధి కార్యక్రమాలు శంకుస్థాపనలు* హాజరుకానున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీ**



**ప్రజాపక్షం/భూపాలపల్లి:**నేడు భూపాలపల్లి జిల్లాలో జరిగే సీఎం బహిరంగ సభను విజయవంతం చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పిలుపునిచ్చారు. శనివారం భూపాలపల్లి జిల్లా గణపురం మండలం చెల్పూరు పంచాయతీ పరిధిలోని 8 ఇంక్లైన్ రోడ్డులో నిర్వహించే ప్రజా పాలన ప్రగతి బాట కార్యక్రమ భాగంగా సభాస్థలి ఏర్పాట్లను పరిశీలించి అక్కడే ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లాలో రేగొండ మండలం కొడవటంచ రూ.12.55 కోట్లతో నిర్మించిన లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం పునః ప్రతిష్టాపన ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొనున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం గణపురం మండలం పరిధిలో చెల్పూర్ లో జరిగే ప్రజా పాలన సభకు మున్సిపల్ ఎన్నికలు, జిల్లా సమగ్ర అభివృద్ధిపై మున్సిపల్ ఎన్నికలు జిల్లా సమగ్ర అభివృద్ధిపై ప్రసంగించనున్నట్లు తెలిపారు. ఈ బహిరంగ సభకు రాష్ట్ర మంత్రులు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క, దేవాలయ శాఖ మంత్రి కొండ సురేఖ, ఎంపికడియం కావ్య తోపాటు ఎమ్మెల్యేలు ఎమ్మెల్యేలు పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి నియోజకవర్గము నుండి 50 వేల మంది జన సమీకరణ చేయడం జరిగిందని తెలిపారు. సింగరేణి ప్రాంతంలో కార్మిక సమస్యలపై కార్మికుల అన్ఫిట్ విధానం, అట్లాగే ఇన్కమ్ టాక్స్ రద్దు పై, కార్మికుల చేసే దానిపై మాట్లాడనున్నట్లు పేర్కొన్నారు. రైతాంగానికి ఉపయోగపడే డిబిఎం 38 తోపాటు రైతులకు చెక్ డ్యాంల నిర్మాణం, అభివృద్ధి పనులపై ముఖ్యమంత్రి హామీలు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. కావున జిల్లా నియోజకవర్గ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని సీఎం సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాష్ రెడ్డి జిల్లా గ్రంథాలయ చైర్మన్ కోట రాజబాబు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు కర్ణాకర్, కాంగ్రెస్ మున్సిపల్ ఎన్నికల ఇంచార్జ్ ఎర్రబెల్లి వరద రాజేశ్వరరావు, గండ్ర సత్యనారాయణ రెడ్డి, రామినేని రవీందర్, మాజీ ఎంపీపీ మలహాల్ రావు, జంగిడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఇవిఎం గోదాముల పరిశీలన




**ప్రజాపక్షం/ వరంగల్ :** వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో గోదాములను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద శనివారం పరిశీలించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి నెల నిర్వహించే సాధారణ తనిఖీలలో భాగంగా ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులోని జిల్లా ఈవీఎం గోదాములను కలెక్టర్ తనిఖీ చేసి, ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ గోదాంలకు సంబంధించిన రికార్డులు, కట్టుదిట్టమైన భద్రత చర్యలు, సీసీ కెమెరాల నిరంతర పర్యవేక్షణ గురించి వివరాలను అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, తహసీల్దార్ శ్రీకాంత్, ఎన్నికల నాయబ్ తహసీల్దార్ రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధిపథంలో కేసముద్రం మున్సిపాలిటీ

**ఎమ్మెల్యే భూక్య మురళీ నాయక్**



**ప్రజాపక్షం/కేసముద్రం:**కేసముద్రం మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ నుండి పోటీ చేస్తున్న అభ్యర్థుల తరుపున శనివారం మహబూబాబాద్ శాసనసభ్యుడు డాక్టర్ భూక్య మురళీ నాయక్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా 7వ వార్డు రడం శ్రీనివాస్, 8వ వార్డు కనుకుల సుభద్ర రాంబాబు, 9వ వార్డు వేముల భారతిశ్రీనివాస్, 10వ వార్డు రడం శివజ్యోతి, 16వ వార్డు వల్లందాస్ ఉమ రవి లను అత్యధిక మెజారిటితో గెలిపించాలని ప్రజలను, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గతంలో పనిచేసిన బిఆర్ఎస్‌కు ఓట్లు అడిగే హక్కు లేదని, కేసముద్రంను మహబూబాబాద్ జిల్లాకు రెండవ రాజధాని కేంద్రంగా అభివృద్ధి చెందడానికి కృషి చేస్తున్న కాంగ్రెస్‌ను ఆదరించాలని కోరారు. ఎమ్మెల్యేతో పాటు కేసముద్రం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గంట సంజీవ రెడ్డి, మండలాధ్యక్షుడు అల్లం నాగేశ్వర రావు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

**వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**



**ప్రజాపక్షం/హనుమకొండ :** పగడ్బందీ ఏర్పాట్ల నడుమ మున్సిపల్ ఎన్నికలు విజయవంతం చేద్దామని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ 11వ తేదీన వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని జనగామ, ఘన్పూర్, వర్ధన్నపేట, పరకాల, నర్సంపేట మున్సిపాలిటీలకు జరిగే ఎన్నికల సంద ర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ శనివారం కమిష నరేట్ కార్యాలయములో అధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ముందుగా ఎన్నికల సజావుగా నిర్వహించేందుకు చేపట్టిన చర్యలపై సంబంధిత పోలీస్ అధి కారుల వివరణనిచ్చారు. ఈ సమావేశంలో ఎన్నికల ము ందు, ఎన్నికల రోజు, కౌంటింగ్ రోజున చేపట్టిన పోలీస్ బం దోబస్తు వివరాలను కూడా పోలీస్ కమిషనర్ అడి గి తెలుసుకున్నారు. అనంతరం పోలీస్ కమిషనర్ మా ట్లాడు తూ ఎన్ని కలను ప్రశాంతంగా నిర్వహించేందుకు గాను అక్ర మ మద్య ం కట్టడి చేయడంతో పాటు, ఓటర్లను ప్రలోభా లకు గురి చేసే విధంగా అందించే తాయిలాలపై పోలీస్ అధి కారు లు నిఘా పెట్టాలని, ఎవరైనా, ఎక్కడైనా ఓటర్లను భయభ్రాంతులకు గు రి చేసే విధంగా వ్యవహరించే వారి పట్ల కఠినంగా వుండాలని. బ్యాలెట్ పత్రాల పంపిణీ, ఎన్నికల రోజున, చివరగా కౌంటిం గ్ రోజున పెద్ద సంఖ్యలో బందోబస్త్ ఏర్పాట్లు చేయాలని, సంబంధిత ఉన్నతాధికారులు ఎన్నికల నిర్వహణపై ఎప్ప టిక ప్పుడు పర్యవేక్షణ చేయాలని. ఎన్నికల వేళ ప్రతి ఒక్కరు ఎ న్ని కల నిబంధనలు పాటించే విధంగా పోలీస్ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని, పోలీస్ సిబ్బంది తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా సద్వినియోగం చేసుకోవాలని సిపి తె లిపారు. ఈ సమావేశం డిసిపిలు ,కవిత, ఎఎస్‌పిలు శుభం, చేతన్, ట్రైనీ ఐపి ఎస్ మనీషా నెహ్రాతో పాటు ఏసిపిలు, ఇన్స్పెక్టర్లు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

## ప్రచారంలో మిత్ర పక్షాల దూకుడు

**మంత్రుల రాకతో మారుతున్న సమీకరణలు**



**ప్రజాపక్షం/జనగామ :**మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో మిత్ర పక్షాలు దూకుడు పెంచాయి. మంత్రులు, ఎంపి, ఎమ్మెల్యేల ప్రచారంలో సమీకరణలు మారుతున్నాయి. కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం అభ్యర్థుల గెలుపుకోసం ఇంటింటి ప్రచారంతో పాటు కార్నర్ మీటింగ్‌లు నిర్వయిస్తుండడంతో జనగామ హోరెత్తుతుంది. ప్రచారానికి మరో రెండు రోజుల గడువు మాత్రమే ఉండడంతో నేతలు సుడిగాలి పర్యటన చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను వివరిస్తున్నారు. ఈ నెల 11న పోలింగ్ జరగనుండగా ఆ రోజు నాటికి సమీకరణలు మరింతగా మారనున్నారు. జనగామ జిల్లాలో రెండు ము న్సిపాల్టీలు ఉన్నాయి. జనగామలో 30 వార్డులు ఉండ గా కాంగ్రెస్ 26, సిపిఎం 3, సిపిఐ 1 చోట పోటీ చే స్తు న్నాయి. మూడు పార్టీలు మిత్రపక్షాలుగా ఏర్పడి పోటీ చేయడంతో కార్యకర్తల్లోనూ ఉత్సాహం పెరిగింది. ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా మూడు పార్టీల నాయకులు ప్రచారంలో పాల్గొంటున్నారు. సిపిఎం 3,5,7 వార్డుల్లో సిపిఐ 11 వార్డులో పోటీ చేస్తుంది. సిపిఐ నుండి ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి ఆకుల శ్రీనివాస్ భార్య సరస్వతి పోటీ చేస్తున్నారు. కాంగ్రెస్‌కు సంబందించిన 26వార్డుల్లోనూపా ర్టీకోసంకష్టప డి పనిచేసినవారికే టిక్కె ట్లు కేటాయించారు.క్యాడర్‌లో ఉత్సాహం పెరిగి ంది.

**మంత్రులు, ఎమ్మెల్యేల పర్యటనలు**

ఎన్నికల సమయంలో దగ్గర పడుతుండడంతో కాంగ్రెస్ పార్టీ ఆయా మున్సిపాల్టీలో జెండా ఎగరేయడం కోసం ఎత్తులు వేస్తుంది. ప్రచారమే ముఖ్యం కావడంతో ఇప్పటికే నియోజకవర్గ ఇంఛార్జీ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, ఆయన కొడుకు యువ నాయకులు కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి, పాల్వంచ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరన్‌కుమార్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలు ప్రచారం నిర్వయి ంచారు. పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి శనివారం స్టేషన్ ఘనపూర్‌లో కార్నర్ మీటింగ్‌లకు హాజరైన సాయంత్రం జనగామకు చేరుకొని నాలుగు కార్నర్ మీటింగ్‌లలో పా ల్గొన్నారు. పొంగులేటి పర్యటన నేపథ్యంలో భారీగా జన సమీకరణ జరగడంతో పట్టణం పూర్తిగా కాంగ్రెస్, సిపిఎం, సిపిఎం మయమైంది. మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జీ కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి తనయుడు కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి అన్ని తానై చూస్తున్నారు. టిక్కెట్ల కేటాయింపు మొదలుకొని, వార్డుల్లో పర్యటన, ప్రచారం, ఎంపి, ఎమ్మెల్యే, మంత్రులతో ప్రచారం నిర్వయించడం, 50 ఓట్లకు ఒక ఇంఛార్జీని నియమించడం ఇలా అనేక ఎత్తుగడలు వేస్తున్నారు. అభ్యర్థుల్ని నిద్రపోకుండా ప్రచారంలో నిమగ్నం చేస్తున్నారు.

## నేడు సిపిఐ నేత నారాయణ ప్రచారం

ప్రజాపక్షం/ ఖమ్మం : సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ డా॥ కె. నారాయణ ఆదివారం ఏదులాపురం మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు. సిపిఐ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ ఉదయం తొమ్మిది గంటలకు 31, 32 వా ర్డులలో, 10 గంటలకు 30, 29, 28 వార్డులలో, 12 గంటలకు 23, 24 వార్డులలో ప్రచారం నిర్వహిస్తారు. సాయం త్రం నాలుగు గంటల నుంచి ముత్తగూడెం పరిధిలోని 20, 21 వార్డుల్లో జరిగే ప్రచారంలో పాల్గొంటారు. సాయంత్రం 5, 19వ వార్డుల్లో ప్రచారం నిర్వహిస్తా రు. నారాయణతో పాటు సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరా వు, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, జిల్లా కార్యదర్శి దండి సురేష్, ఆయా వార్డుల్లో పోటీ చేసే అభ్య ర్థులు, పార్టీ బాధ్యులు పాల్గొంటారు.

## సిఎం కప్ క్రీడా పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే



ప్రజాపక్షం/సత్తుపల్లి : మండల పరిధిలో గల గంగారం గ్రామంలోని శ్రీ దాసరి వీరారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దాసరి వెంకటరామిరెడ్డి (చిట్టి నాయన) సహకారంతో నిర్వహిస్తున్న సిఎం కప్ నియోజవర్గ స్థాయి ఆటల పోటీలను సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ శనివారం ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులతో కలిసి ఆటలు ఆడి వారిలో ఉత్సాహాన్ని నింపారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మాజీ వైస్ ఎంపిపి దాసరి వెంకటరామిరెడ్డి (చిట్టి నాయన), గంగారం గ్రామ సర్పంచ్ కాకర్ల రేవతి, ఉప సర్పంచ్ బెజవాడ రాధ, ఎంఈఓ, సత్తుపల్లి నియోజక వర్గం క్రీడాకారులు, సత్తుపల్లి మండలం కాంగ్రెస్ నాయకులు,గ్రామ కాంగ్రెస్ నాయకులు, దాసరి మధుఅన్న యువసేన సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఈనెల 9, 10 తేదీల్లో మాస్‌లైన్ నిరసనలు

ప్రజాపక్షం/ ఖమ్మం : మోదీ ప్రభుత్వ విధానాలు, అమెరికాతో చేసుకున్న ఒప్పందం తదితర విషయాలను నిరసిస్తూ ఫిబ్రవరి 9, 10 తేదీలలో మండల, జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేయనున్నట్లు సిపిఐ(ఎం ఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు తెలిపారు. అమెరికాతో భారత్ చేసుకున్న వాణిజ్య ఒప్పందం భారతదేశానికి తీవ్ర ద్రోహం తలపె డుతుందని జీరో శాతం పన్నులతో అమెరికా ఉత్పత్తులు ముఖ్యంగా పౌల్ట్రీ, వ్యవసాయ ఉత్పత్తులు దిగుమతి చేసుకోవడం మన వ్యవసాయ రంగానికి, ఉపాధి రంగానికి మరణ శాసనం వంటిదని రంగారావు తెలిపారు. మోదీ ప్రభుత్వం దీనిని దాచిపెట్టి మోసం చేస్తుందన్నారు. ఈ ఒప్పందాలను నిర సిస్తూ మండల, జిల్లా కేంద్రాల్లో రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు.

## 'బేబీమూన్'లో సాంప్రదాయ సేంద్రియ వ్యవసాయ ప్రదర్శన



ప్రజాపక్షం/ ఖమ్మం : యాంత్రీక జీవితంలో మరుగున పడిపోతున్న ఆరోగ్య జీవన విధానాలను, వ్యవసాయ పద్ధతులను నేటి తరానికి పరి చయం చేసే ఉద్దేశంతో ఖమ్మం బేబీమూన్ హైస్కూల్‌లో సాంప్రదాయ సేంద్రియ వ్యవసాయ ప్రదర్శనను శనివారం ఏర్పాటు చేశారు. ఈ ప్రద ర్శన చూపరులను ఆకట్టుకుంది. బేబీమూన్ కరస్పాండెంట్ కేసా వీరన్న, కేసా సుగుణ దీనిని ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో భాగంగా మూడు నుంచి ఐదు తరగతుల విద్యార్థులు మోడల్ గ్రామాన్ని నిర్మించి అబ్బురప రిచారు. భూమిని వ్యవసాయానికి సిద్ధం చేయడం, నీటిపారుదల తదితర పద్ధతులను వివరించారు. ధాన్యం నుండి బియ్యం, గోధుమల నుండి పిండి తదితర వాటిని ప్రదర్శనలో కండ్లకు కట్టినట్లు చూపారు. గత జీవన విధా నాలైన రోలు, రోకలి, ధాన్యం దంచడం, విసురురాయి వాడకం, ఎడ్లబండి తదితర నమూనాలను ప్రదర్శించారు. మరుగునపడుతున్న గ్రామీణ ఆట లను కూడా ప్రదర్శనలో ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనను తిలకించడానికి ఖమ్మం నుండి పెద్ద ఎత్తున ప్రజలు తరలి వచ్చారు. విద్యార్థుల తల్లిదం డ్రులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్వరూప, రమాదేవి, రజిత, సునీత, సిబ్బంది పాల్గొన్నారు.

## నిలిచిన నీటి సరఫరా... పట్టించుకోని అధికారులు




ప్రజాపక్షం/ వైరా : వైరా మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డులో వారం రోజులుగా త్రాగునీటి సరఫరా నిలిచిపోయింది. దీనితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. 16వ వార్డులో ఏర్పాటు చేసిన మోటార్ చెడి పోయింది. ఈ విషయమై స్థానికులు అధికా రులకు ఫిర్యాదు చేసినా స్పందించ లేదు. మున్సిపల్ కమిషనర్‌కు నేరుగా ఫిర్యాదు చేసినా త్రాగునీటి సమస్యను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిం చారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. చివరకు స్థానికులు ఆందోళనకు సిద్ధమవుతున్న నేపథ్యంలో శనివారం ట్యాంకర్ల ద్వారా నీటిని అందించ డంతో అరకొర ప్రచారం జరుగుతుందని వెంటనే మోటార్‌ను మరమ్మతు చేయించి త్రాగునీరు అందించాలని స్థానికులు కోరుతున్నారు.

## సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి

విద్యార్థులకు సిఐ రాజువర్మ హితవు

ప్రజాపక్షం/చర్ల : విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని చర్ల సిఐ రాజువర్మ అన్నారు. శనివారం స్థానిక గురుదేవ్ విద్యాలయంలో జరిగిన ముగింపు ఉత్సవాలలో ఆయన ముఖ్యాతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు



కేవలం ర్యాంకులకే కాకుండా వారిలో ఉన్న ప్రతిభను గుర్తించి బయటకు తీసుకురావడం ఎంతో ముఖ్యమని, తల్లిదండ్రులు ఈ విషయంలో శ్రద్ధ చూపాలన్నారు. చర్ల మండలం నుండి కనీసం ఒక్కరైనా సివిల్స్‌కు ప్రిపేర్ అవ్వాలని, ఆ స్థాయికి ఎదగడం తన కోరిక అన్నారు. పిల్లలు ఫోన్లు చూసే సమయాన్ని తగ్గించి పుస్తకాలు చదవడం కోసం ప్రయత్నించాలని, ఇంటి వద్ద అలాంటి వాతావరణాన్ని తల్లిదండ్రులు కల్పించాలన్నారు. ఈ సంద ర్భంగా రాజు వర్మతో పాటు సిఐ నర్సిరెడ్డిని గురుదేవ్ ప్రధానోపాధ్యా యుడు హెచ్‌జివి ప్రసాద్ సన్మానించారు. అనంతరం పలువురు విద్యా ర్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిచారు.

# మున్సిపల్ ఎన్నికల్లో 'పంపిణీ' షురూ!

పెరిగిన ఓటు ధర
పంపిణీతో కొట్టుకుపోతున్న సేవలు, హామీలు

ప్రజాపక్షం/ ఖమ్మం : మున్సిపల్ ఎన్నికల్లో సేవలు, పరిచయాలు, రాజకీయాలు వీటితో పాటు ఓట్ల కొను గోలు ప్రధానమైంది. మొదటి మూడు సంగతి ఎలా ఉన్నా నాలుగోదైనా డబ్బు పంపిణీ చేయకపోయినా ప్రత్యర్థి కంటే తక్కువ చేసినా ఫలితం దక్కే అవకాశం కనిపించడం లేదు. ఈనెల 11న జరగనున్న మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి కొందరు అభ్యర్థులు అప్పుడే పంపిణీ షురూ చేశారు. నామినేషన్ నాటి నుంచే మం దు విచ్చలవిడిగా పంపిణీ చేస్తున్న అభ్యర్థులు చివరిలో పం పిణీకి ఆటంకం ఏర్పడుతుందన్న భావనతో నాలు గు రో జులు ముందుగానే డబ్బు పంపిణీ షురూ చేశా రు. వైరా మున్సిపాలిటీ పరిధిలో 19వ వార్డులో ఇప్పటికే ఓటు ధ ర ఐదువేలు పలుకుతుందని ప్రత్యర్థి పంపి ణీ చేసే దా నిని బట్టి అవసరమైతే మరో దఫా పంపిణీ చేయ డానికి సిద్ధమైనట్లు తెలుస్తుంది. ఈ వార్డు కాదు ఇప్పుడు ఎన్నికలంటేనే ఓటర్ల అమ్మకాలు, అభ్యర్థుల కొనుగో ళ్లుగా మారింది. తక్కువో ఎక్కువో పోటీని బట్టి ఉంటుంది కానీ పంపిణీ అయితే తప్పనిసరి అయింది. పంచాయతీ ఎన్నికల సందర్భంగానే ఓటు ధర పెరి గింది. తీవ్రమైన పోటీ ఉన్నచోట కీలకమైన ఓట్లను పది వేల చొప్పున కొనుగోలు చేశారు. మరికొన్ని గ్రామాల్లో గెలుపోటములను నిర్ణయించే 50 లేదా 100 ఓట్లను టోకుగా కొనుగోలు చేసినప్పుడు ఓటు పదివేల రూపా యల కంటే అధికంగానే పలికింది. ఇప్పుడు మున్సిపాలి టీలలోనూ అదే పరిస్థితి.

**తటస్థానికే ఓటర్లు మొగ్గు :**
ఎన్నికల సందర్భంగా ఏ పార్టీ వైపు వెళ్లకుండా తటస్థం గా ఉండేందుకు ఓటర్లు మొగ్గు చూపుతున్నారు. ఆయా పార్టీల పట్ల అభిమానం ఉన్న బయటపడటం లేదు. బ రిలో నిలిచిన వారు పక్కాగా తమకు వ్యతిరేకం అను కున్న వారికి డబ్బులు పంచడం లేదు. ఏ అభ్యర్థి అయి నా 70 నుంచి 80 శాతం ఓటర్లకు మాత్రమే డబ్బు పం పిణీ చేస్తున్నాడు. అన్ని పార్టీలు ఇదే రీతి అవలంభిస్తుం డడంతో జెండాలు పట్టుకుని ఎవరు బయటపడటం లే దు. అందుకే ప్రచారానికి, ర్యాలీలకి కూలీలు తప్ప ఓటర్లు రావడం లేదు. ఇప్పటికీ కమ్యూనిస్టు క్యాడర్ పార్టీ అభ్యర్థులకు ప్రచారం నిర్వహిస్తుండటం అభినంద నీయం. తటస్థంగా ఉంటే పోటీలో ఉన్న అభ్యర్థులం దరూ పంపిణీలో తమకు అవకాశం కల్పిస్తారన్న భావన నెలకొంది. అందుకే తటస్థ ఓటర్ల సంఖ్య పెరుగుతుంది. గతంలో గ్రామాల్లో 10 శాతం కూడా తటస్థులు ఉండే వారు కాదు. ఇప్పుడు ఆ సంఖ్య తారుమారు అయింది.

**పంపిణీపై పట్టింపేదీ?**
ఎన్నికలంటే నియమ నిబంధనలు ఉంటాయి. అభ్యర్థి చరిత్ర, నడవడికతో పాటు ఎన్నికల సందర్భంగా ప్రత్యేక నియమావళిని అమలు చేయాలని అభ్యర్థులకు రాతపూ ర్వకంగా తెలియజేస్తారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేయరాదని ఆయా స్థానాన్ని బట్టి ఖర్చు చేయాల్సిన మొ త్తాన్ని, ఆ తర్వాత ఖర్చు లెక్కలు చూపాల్సిన విధానాన్ని తెలియజేస్తారు. ఇది వినటానికి, చెప్పుకోవటానికి చాలా బాగుంటుంది. కానీ ఎన్నికల నిబంధనలు గాలిలో కలిసి పోతున్నాయి. ఇష్టానుసారంగా డబ్బులు పంపిణీ చేస్తు న్నా అధికారులు పట్టించుకోవడం లేదు. అధికార యం త్రాంగమే పరోక్షంగా సహకరిస్తున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. సామాన్యులు ఎన్నికల బరిలో నిలిచే పరిస్థితి లేదు. ధనం మూలం మిథం జగత్ అన్నట్లు డబ్బు ఉన్న వారికే పదవి దక్కుతుంది.

## నల్లమోతు రామయ్య మరణం సిపిఐకి తీరని లోటు

సిపిఐ జాతీయసమితి సబ్యుడు బాగం హేమంతురావు



ప్రజాపక్షం/కొణిజర్ల : సిపిఐ సీనియర్ నాయకులు నల్లమోతు రామయ్య మరణం సిపిఐకి తీరని లోటని సిపిఐ జాతీయసమితి సబ్యుడు బాగం హేమంతురావు అన్నారు. శనివారం కొణిజర్లలో రామయ్య భౌతికకాయా నికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లా డుతు కొణిజర్ల మండలంలో సిపిఐ బలోపేతానికి ప్రజాసమస్యల పరిష్కా రానికి రామయ్య నిరంతరం కృషిచేశాడని కొనియాడారు. ఆయన ఆశ యాలను ముందుకు తీసుకెళ్లడమే కార్యకర్తలు ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సబ్యులు యర్రా బాబు, వైరా నియోజకవర్గ మాజీ ఎంఎల్ఏ చంద్రావతి, దొండపాటి రమేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# వైరాలో రసవత్తర పోరు

బిఆర్ఎస్‌కు సానుకూలంగా మారిన ఛైర్‌పర్సన్ అభ్యర్థి
అధికారమే కాంగ్రెస్ బలం
వామపక్షాల మద్దతుతో 'కారు' ముందంజ




ప్రజాపక్షం/ ఖమ్మం : రాజకీయ చైతన్యానికి, ప్రశాంత రాజకీయాలకు పెట్టింది పేరైన వైరాలో మున్సిపల్ ఎన్నికల్లో రసవత్తర పోరు నడుస్తుంది. వామపక్షాలను కలుపుకుని బిఆర్ఎస్ అధికార కాంగ్రెస్‌ను ఢీకొంటుంది. మున్సిపల్ ఎన్నికల ప్రకటన నాడు ఏకపక్ష గెలుపు ఉంటుందని భావించిన వారు ఇప్పటి పోటీని చూసి ఆశ్చర్యపో తున్నారు. వైరాలో కాంగ్రెస్‌ను గెలిపించుకోవటం, ఆ పార్టీకి అత్యంత అవసరం. రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టివిక్రమార్క సొంత మండలం కావటం, డిసిసి అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, రాష్ట్ర హస్త కళల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ నాయుడు సత్యం, జిల్లా కాంగ్రెస్ నాయకుడు బొర్రా రాజశేఖర్ తదితర ప్రముఖులు వైరాకు చెందిన వారే. ఇంత మంది ప్రముఖులు ఉండి కాంగ్రెస్‌ను గెలిపించు కోటం సాధ్యం కాకపోతే విమర్శలు ఎదుర్కొనక తప్పదు. వర్గపోరు కార ణంగా వైరా మున్సిపాలి టీలో కాంగ్రెస్ గట్టి పోటీని ఎదుర్కొంటుంది. ఛైర్‌పర్సన్ అభ్యర్థి తేలకపోవటం, డిసిసి మాజీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ సతీ మణి ఇందుమతి నామినే షన్ వేసి ఉపసంహరించుకోవటం, ఒకరిద్దరికి బీ ఫాం ఇచ్చి వెనక్కు తీసుకోవటం, చివరి నిమి షంలో సిపిఐతో పొత్తు చెడిపోవటం కాంగ్రెస్‌కు కొంత నష్టం కలిగించింది. వర్గాల పేరున సీట్లు పంచుకున్నారన్న ప్రచారం ఓటర్లందరికీ చేరింది. అధికారంలో ఉండటం, స్థానికంగా శాసన సభ్యులు ఉండటం కలిసి వచ్చే అంశం. నాలుగైదు వార్డుల్లో బలమైన అభ్యర్థులను రంగంలోకి దింపటం కూడా సానుకూల అంశమే. బిఆర్ఎస్ ఎవరు ఊహించనివిధంగా పోటీలోకి వచ్చింది. బిఆర్ఎస్ నేతలు పువ్వాడ అజయ్‌కుమార్, నామ నాగేశ్వరరావు, తాతా మధుసూదన్ వైరా మున్సి పాలిటీలో గెలుపును ప్రతిష్టాత్మకంగా తీసుకు న్నారు. దీనికి తోడు మాజీ ఎంపిపి కట్టా కృష్ణార్జు నరావు సతీమణి స్వరూపరాణిని మున్సిపల్ ఛైర్‌ప ర్సన్ అభ్యర్థిగా బిఆర్ఎస్ ప్రకటించటం కూడా బిఆర్ఎస్‌కు అనుకూలంగా మారింది. 20వా ర్డుల్లో ఒకట్రెండు మినహా మిగిలిన చోట్ల బలమైన అభ్యర్థులను బిఆర్ఎస్ రంగంలోకి దింపింది. పార్టీ శ్రేణులు కూడా గెలుపు కోసం తీవ్రంగా శ్రమి స్తున్నాయి. పార్టీ మొత్తం ఐక్యంగా ఉండటం, తెలుగుదేశంలో మెజార్టీ భాగం బిఆర్ఎస్‌కు మద్ద తుగా నిల్వటం, వామపక్షాల పొత్తు గెలుపు దరి చేరుస్తుందని అంచనా వేస్తున్నారు.

**కలిసొచ్చిన వామపక్షాల పొత్తు :**
వైరాలో మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్‌కు వామప క్షాలతో పొత్తు కలిసి వచ్చింది. సిపిఐ, సిపిఎం ను కలుపుకుని పోవటంలో బిఆర్ఎస్ సఫలీకృత మైంది. సిపిఎంకు మూడు, సిపిఐకి ఒక స్థానం కేటాయించటంతో మూడు పార్టీల కార్యకర్తలు అమరికలు లేకుండా ఉమ్మడి అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తున్నారు. వామపక్షాలకు ఉన్న బల మైన క్యాడర్ బిఆర్ఎస్‌కు అదనపు బలంగా మారింది. వామపక్షాల నేతలు విస్తృతంగా ప్రచార కార్యక్రమంలో పాల్గొంటున్నారు. అటు కాంగ్రెస్ ఇటు బిఆర్ఎస్ ఫ్రంట్‌కు ప్రతిష్టాత్మంగా మారిన వైరా మున్సిపల్ ఎన్నికల్లో చివరి రెండు రోజులే కీలకం కానున్నాయి.

# ప్రజలకు అండగా ఉండేది ఎర్రజెండానే

కార్పొరేషన్ ఎన్నికల్లో కంకి కొడవలి గుర్తుకు ఓటేద్దాం
అవినీతి రహిత పాలనకు స్వాగతం పలుకుదాం
సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : పేదలకు, కార్మికులు, బడుగు బల హీన వర్గాలు, కర్షకులకు నిత్యం అండగా ఉండేది ఎర్రజెండానే అని, ఈ కార్పొరేషన్ ఎన్నికల్లో సిపిఐ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కార్పొరేషన్ ఎన్నికల్లో భాగంగా రామవరంలోని 6 డివిజన్ల పరిధిలోని డివిజన్లు, బర్మా క్యాంపు, ప్యూన్‌బస్తీ, పాత కొత్తగూడెం ఏరియాల్లోని డివిజన్లలో పోటీ చేస్తున్న సిపిఐ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ విస్తృత ప్రచారం చేశారు. ఈ సందర్భంగా పాషా మాట్లాడుతూ ఈ ప్రాంతాలు కమ్యూనిస్టుల అడ్డా లని, గతంలో ఈ ప్రాంతాల్లో నెలకొన్న అనేక సమస్యలను సిపిఐ ముందుండి పరిష్కరించిందని, పేద ప్రజల పక్షాన నిలబడి పోరాటాలు చేసిందన్నారు. ఎంతో కాలం నుండి సింగరేణి పాత క్వార్టర్లలో నివాసం ఉంటున్న వారికి పొజీషన్ సర్టిఫికెట్లు ఇప్పించేందుకు కూనంనేని కృషి చేస్తున్నారని, ఇప్పటికే ఈ విషయం సింగరేణి యాజమాన్యంతో చర్చలు జరిపారని తెలిపారు. సింగరేణిలో పనిచేసే కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కార మార్గం చూపేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ ఎన్నికల్లో ప్రలోబా లకు గురి చేసి ఓట్లు దండుకునేందుకు అనేక మంది వస్తుంటారని, కానీ ఇక్కడి ప్రజలతో నిత్యం మమేకమై ఉండేది సిపిఐ అని, సిపిఐ అభ్యర్థుల కంకి కొడవలి గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అన్నారు. కార్పొరేషన్ ఎన్నికల్లో సిపిఐ అభ్యర్థుల విజయంతోనే సుపరిపా లన అందుతుందని, నిధుల దుర్వినియోగం నిలిచిపోయి అభివృద్ధి సాధ్య మవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు కంచర్ల జమలయ్య, సలిగంటి శ్రీనివాసరావు, దుర్గరాశి వెంకటేశ్వర్లు, ఎస్‌కె ఫహీమ్, జి. వీరస్వామి, వాసిరెడ్డి మురళీ,వై ఉదయ్ భాస్కర్, కందుల భాస్కర్, జిల్లా సమితి సభ్యుడు మునిగడప వెంకటేశ్వర్లు, విద్యాన గర్ గ్రామపంచాయితీ సర్పంచ్ భూక్యా శాంతి ప్రియ, నాయకులు వాక పల్లి హరినాథ్, గోపి కృష్ణ, జహీర్, ఉల్లోజు వెంకట్, నిమ్మగడ్డ వెంకటేశ్వర రావు, జక్కుల గట్టయ్య, కిరణ్, భవాని, కిలార్ ప్రసాద్‌తో పాటు అభ్య ర్థులు భూక్య శ్రీనివాస్, మునిగడప పద్మ, కంచర్ల హిమశ్రీ, ఎర్రబెల్లి శంకర్, కనుకుంట్ల సాహితి, కూరపాటి సుధాకర్, పోలమూరి ధనలక్ష్మీ, పి ఇందిరా ప్రియదర్శిని, పడాల ఆకాంక్ష, మంద నాగలక్ష్మీ, కోలాపూరి ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎసిబికి చిక్కిన అటవీ శాఖాధికారి

జనవరి మూడు నుంచి పరారీ
విశాఖలో అదుపులోకి తీసుకున్న ఎసిబి

ప్రజాపక్షం/ కొత్తగూడెం : లంచం తీసుకున్న కేసులో గత నెల మూడవ తేదీ నుంచి పరారీలో ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో డివిజనల్ మేనేజర్‌గా పనిచేస్తున్న తాటి శ్రావణిని ఎసిబి అధికారులు శనివారం అదుపులోకి తీసుకు న్నారు. లంచం తీసుకున్న కేసులో ఆమె పరా రీలో ఉండగా విశాఖ పట్నం స్టీల్ ప్లాంట్ వద్ద ఎసిబి డిఎస్‌పి రమేష్ ఆధ్వర్యంలో అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే... డివిజనల్ మేనేజర్‌గా ఉన్న శ్రావణి గుత్తేదారుల వద్ద నుంచి పెద్ద మొత్తంలో కమీషన్ డిమాండ్ చేశారు. గుత్తేదారు నుంచి యూనిట్ నెంబర్ ఎనిమిది నుంచి 15 వరకు మొత్తం 32వేల టన్నుల జామాయిల్ నరికివేత పనులకు గాను ఒక్కో టన్నుకు రూ. 90 చొప్పున రూ.28,80,000 లంచంగా డిమాండ్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. అందులో భాగంగా పెన గడప గ్రామ శివారులోని తొమ్మిదవ యూని ట్‌కు సంబంధించిన 3,900 టన్నుల జామా యిల్ నరికివేత పనులకు భవిష్యత్తు బిల్లుల ఆమోదం కోసం టన్నుకు రూ. 90 చొప్పున రూ.3,51,000 లంచం డిమాండ్ చేసి తీసు కుంటున్న సమయంలో ప్లాంట్ మేనేజర్ రాజేం దర్, అతనికి సహకరించిన గోపాలకృష్ణను ఎసిబి అధికారులు జనవరి మూడున అదుపు లోకి తీసుకున్నారు. వారిని కోర్టులో హాజరుపరి చారు. ఈ కేసులో ప్రధాన నిందితురాలైన డివిజ నల్ మేనేజర్ శ్రావణి అప్పటి నుంచి పరారీలో ఉన్నారు. ఆమె ముందస్తు బెయిల్ కోసం విశ్వ ప్రయత్నం చేశారు. అయినా బెయిల్ లభించ లేదు. ఎసిబి అధికారులు తాటి శ్రావణి కదలిక లపై నిఘా ఉంచారు. చివరకు ఆమెను అదుపు లోకి తీసుకుని కోర్టులో హాజరుపర్చనున్నట్లు అధికారులు తెలిపారు.

## 'ఎస్‌బిఐటి'లో డెమోక్రటైజింగ్ ఎఐపై వర్క్ షాప్



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : భారతదేశంలో కృత్రిమ మేధస్సు (ఎఐ) వేగంగా అభివృద్ధి చెందుతుందని విద్యార్థులు ఎఐ సాధనాలపై అవగాహన కలిగి ఉండి వాటిని సమాజ అవసరాలకు ఉపయోగించాలని ఎస్‌బిఐటి కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా॥ జి. ధాత్రి సూచించారు. స్వర్ణ భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఎస్‌బిఐటి) అటానమస్ కళాశాలలో ఇన్నోవేషన్ సెల్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన డెమోక్రటై జింగ్ ఏఐ రిసోర్సెస్ వర్క్ షాపులో కరస్పాండెంట్ డా॥ జి. ధాత్రి పాల్గొని మాట్లాడారు. కళాశాల ఇన్నోవేషన్ సెంటర్ ద్వారా అత్యాధునిక సదుపా యాలు, డాక్టరేట్ అర్హత కలిగిన అధ్యాపకుల మార్గదర్శకత్వంతో ఉత్తమ వేదికను అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు బాధ్యతాయుతమైన టెక్నో క్రాట్లుగా ఎదగాలని ఆకాంక్షించారు. త్వరలో ఇనిస్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్ (ఐఐసి) ఆధ్వర్యంలో త్వరలో నిర్వహించనున్న ఇండియా ఎఐ ఫ్రీ సమ్మిట్ 2026కు ముందస్తు కార్యక్రమాల్లో భాగంగా జరిగిందన్నారు. ప్రిన్సిపాల్ డా॥ రాజ్‌కుమార్ మాట్లాడుతూ సాధారణ విద్యతో పాటు ఆధు నీక సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులు ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవ్వాలని ఇందు కోసం కళాశాల ప్రోత్సహిస్తుందన్నారు. డిజిటల్ లెర్నింగ్ ప్లాట్‌ఫా మ్‌లను క్రమం తప్పకుండా ఉపయోగించి విద్యార్థులు భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కొనేలా తయారవ్వాలన్నారు. ముఖ్య వక్తగా పాల్గొన్న డా॥ ప్రభాకర్ మాట్లాడుతూ ప్రస్తుతం భారతదేశంలో ఎఐ నైపుణ్యాల్లో భారీ లోటు ఉంద న్నారు. సొంత ఎఐ మోడల్స్, డేటాసెట్లు అభివృద్ధి దిశగా దేశం ముందుకు సాగుతున్నప్పటికీ వాటిని సమర్థవంతంగా వినియోగించగల ఎఐ ఇంజ నీర్ల కొరత ఎక్కువగా ఉందన్నారు. ఎఐ అభివృద్ధికి భారీగా విద్యుత్ అవ సరం, స్థిరమైన ఇంటర్నెట్ మౌలిక సదుపాయాలు కీలకమని తెలిపారు. ఎఐ డెమోక్రటైజేషన్ అంటే దాని ప్రయోజనాలు సమాజంలోని చివరి వ్యక్తి వరకు చేరాలని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇన్నోవేషన్ హెడ్ డా॥ ఎం. మురళీమోహన్, పి. అశ్వని, వివిధ విభాగాల హెచ్‌వోడిలు, టిపివో సవిత తదితరులు పాల్గొన్నారు.

## పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోవాలి

నేడు ఉదయం 10 గంటల నుంచి
సాయంత్రం ఐదు గంటల వరకు పోస్టల్ బ్యాలెట్
జిల్లా ఎన్నికల అధికారి అనుదీప్ దురిశెట్టి

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : మున్సిపాలిటీల పరిధిలో ఓటరుగా నమోదై ఉండి ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న జిల్లా, ఇతర జిల్లాలకు చెందిన ఉద్యో గులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నేడు (ఫిబ్రవరి 8న) ఆదివారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు మున్సిపాలిటీల పరిధిలో కేటాయించిన ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్లలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో ఖమ్మం రూరల్ ఎంపిడివో కార్యాలయం మీటింగ్ హాల్‌లో, మధిర మున్సిపాలిటీలో మధిర ఎంపిడివో కార్యాలయం మీటింగ్ హాల్‌లో, కల్లూరు మున్సిపాలిటీలో కల్లూరు జిహెచ్‌ఎస్‌లో, వైరా మున్సిపాలి టీలో వైరా తహసీల్దార్ కార్యాలయంలో, సత్తుపల్లి మున్సిపాలిటీలో సత్తుపల్లి మున్సిపల్ కార్యాలయంలో ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. ఆయా మున్సిపాలిటీల పరిధిలో ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు తమకు కేటాయించిన కేంద్రాలలో తప్పనిసరిగా హాజరై పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని, సంబంధిత శాఖ అధికారులు ఈ సమాచారాన్ని తమ శాఖ సిబ్బందికి తెలియ జేయాలని జిల్లా ఎన్నికల అధికారి ఒక ప్రకటనలో తెలిపారు.

## సిపిఐ అభ్యర్థిని గెలిపించండి

సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు యర్రా బాబు



ప్రజాపక్షం/కొణిజర్ల : వైరా మున్సిపాలిటీ ఎన్నికల్లో టిఆర్ఎస్, సిపిఎం, టిడిపి బలపరుస్తున్న సిపిఐ 15వ వార్డు దుద్దెపూడి అభ్యర్థిని నల్లమోతు శైలజ కంకి కొడవలి గుర్తుపై అత్యధిక ఓట్లు వేసి గెలిపించాలని కోరుతు శనివారం దుద్దె పూడి కాలనీలో ఇంటింటి ప్రచారం సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు యర్రా బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మాచర్ల నాగ భూషణం, కొత్త వెంకటేశ్వర్లు, అమర్లపూడి మరియమ్మ, ఏరువ నరసింహారావు, సిపిఐ నాయకులు అమర్లపూడి అనిల్, కొత్త మధు, నల్లమోతు సురేష్, చెరుకు మల్లి భాస్కర్‌రావు, పుల్లారావు, సిపిఎం నాయకులు కొత్త సీతారామయ్య, కొత్త నాగేశ్వరరావు, చెరుకుమల్లి రాంబాబు, పోట్ల వెంకటేశ్వర్లు, నాగటి భిక్షం, చెరుకుమల్లి రమాదేవి, మెరుగుమని తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి శిక్షణా తరగతులకు విప్పలమడక సర్పంచ్

ప్రజాపక్షం/ ఖమ్మం : రాష్ట్ర స్థాయి శిక్షణా తరగతులకు వైరా మండలం విప్ప లమడక సర్పంచ్ మేడా హేమిమా చక్రపాణి ఎంపికయ్యారు. ఈనెల 16 నుండి 20వ తేదీ వరకు హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో ఉన్న నేషనల్ ఇనిస్టి ట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్ భవన్‌లో రాష్ట్ర స్థాయి మహిళా గ్రామ సర్పంచ్‌ల శిక్షణా శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా విప్పలమడక గ్రామ సర్పంచ్‌ను ఎంపిక చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు ఉత్తర్వులు జారీ చేశారు. స్థానిక పాలనలో మహిళా సాధి కారత అనే అంశంపై శిక్షణ ఇవ్వనున్నారు. హేమిమా చక్రపాణితో పాటు రఘునాథపాలెం మండలం జికెబంజర సర్పంచ్ జ్యోతి, చింతగుర్తి ప్రియాంక, కొణిజర్ల మండలం మోకాలకుంట గ్రామ సర్పంచ్ అనిత శిక్షణా తరగతులకు ఎంపికయ్యారు.

మహేష్ బాబు హీరోగా త్రిషా హీరోయిన్‌గా త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కిన అతడు సినిమా రీ రిలీజ్‌కు సిద్ధం అయింది. తొలిసారిగా ఈ సినిమా విడుదల అయిన సెన్ సేషనల్ హిట్ అయింది.ఇప్పుడు ఈ సినిమాను ఈనెల 28న రీ రిలీజ్ చేస్తున్నారు.పార్థు అనే పాత్రను మహేష్ బాబు పోషించారు. అయితే ఈ పార్థు పాత్ర ఏం చేసింది. అనేది ఈ సినిమా కథ. ఎవరిని టార్గెట్ చేశాడు. కోటి శ్రీనివాసరావు ఇందులో విలన్ గా నటించారు.

రీల్

## 'ఇట్లు అర్జున' పోస్టర్ రిలీజ్



దర్శకుడు వెంకీ కుడుముల 'ఇట్లు అర్జున'తో నిర్మాణంలోకి అడుగుపెడుతున్నారు, వాల్ నెక్స్ట్ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై ఇది అతని మొదటి వెంచర్. 'న్యూ గై ఇన్ టౌన్' అనిష్ హీరోగా మహేష్ ఉప్పల దర్శకత్వంలో, అనస్వర రాజన్ హీరోయిన్ గా ఈ సినిమా రూపొందుతోంది. అక్కినేని నాగార్జున వాయిస్ ఓవర్ ఇచ్చిన టైటిల్ గ్లింప్స్‌తో ఈ చిత్రం ఇప్పటికే సంచలనం సృష్టించింది. పోస్టర్, వీడియో విడుదల చేశారు.పోస్టర్‌లో అనిష్ కూల్ లుక్‌లో దార్లింగ్‌గా కనిపించారు. కొత్తగా విడుదలైన వీడియోతో మేకర్స్ ఆ పాత్ర వెనుక ఉన్న ఫ్యాక్టర్ పై ఫోకస్ చేశారు. ఫైండింగ్ అర్జున వాల్యూమ్ 1 వీడియో ఒక క్యారెక్టర్‌ను పరిచయం చేయడమే కాదు — ఆ క్యారెక్టర్‌లోకి వెళ్లడానికి అనిష్ చూపించిన కమిట్మెంట్ మైండ్‌సెట్‌ను ఆవిష్కరిస్తుంది. అర్జున్ మూగవాడు, సంభాషణలపై ఆధారపడకుండా, పూర్తిగా బాడీ లాంగ్వేజ్, ఎమోషనల్ డెప్త్‌తోనే ప్రేక్షకులను ఆకట్టుకోవాల్సిన పాత్ర ఇది. ఫైండింగ్ అర్జున వాల్యూమ్ 1 అనిష్‌ను మరో డైమెన్షన్‌లో చూపిస్తుంది. నటుడిగా తనలో దాగి ఉన్న కొత్త కోణాన్ని ఆవిష్కరించే పాత్ర ఇది. సంభాషణల ద్వారా కాకుండా తనను తాను నిరూపించుకోవాలనే తపనను ప్రతిబింబిస్తోంది. ఈ చిత్రానికి ఎస్ తమన్ సంగీతం అందిస్తుండగా, సినిమాటోగ్రఫీని రాజా మహాదేవన్ నిర్వహిస్తున్నారు.



## తెలుగు సినిమా పుట్టినరోజు వేడుకలు

నేస్తం ఫౌండేషన్ ,తెలుగు సినిమా వేదిక సంస్థలు సంయుక్తంగా తెలుగు సినిమా పుట్టినరోజు వేడుకలను హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్ లో అంగరంగ వైభవంగా నిర్వహించాయి. నిర్వాహక సంస్థల అధ్యక్షులు మోహన్ గౌడ్ వీస్ విజయ్ వర్మ పాకలపాటి ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి సీనియర్ నటులు మురళి మోహన్ , ఛాంబర్ సెక్రటరీ అశోక్ కుమార్ , నిర్మాత లు తమ్మా రెడ్డి భరద్వాజ , దామోదర్ ప్రసాద్ , చదలవాడ శ్రీ నివాస రావు , బి గోపాల్ , నటీమణి రాశి లతో పాటు తెలుగు చలన చిత్ర పరిశ్రమ 24 శాఖలకు చెందిన సీనియర్స్ ని మురళి మోహన్ సినీ పెద్దలు సత్కరించారు. ఛాంబర్ ప్రముఖులు మాట్లాడు తూ వచ్చే ఏడాది నుండి ఈ కార్యక్రమం చలన చిత్ర పరిశ్రమ ఆధ్వర్యంలో జరిగేలా ప్రణాళిక నిర్వహిస్తాం అన్నారు. మిమిక్రీ రమేష్ ,మన్నెం ల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. రాష్ట్రాల ముఖ్య అతిథులు విచ్చేసిన ఈ కార్యక్రమం లో సీనియర్ దర్శకులు రేలంగి నరసింహా రావు తదితరులు పాల్గొన్నారు.

## 'డుండుం డియ్యాల' పాట విడుదల

శివ కంఠంనేని, ధన్య బాలకృష్ణ, ఎస్తేర్, సుప్రిత, హరీష్ ప్రధాన తారాగణంగా తెరకెక్కిన సినిమా 'అమరావతికి ఆహ్వానం'. ఈ మూవీలో సీనియర్ నటులు అశోక్ కుమార్, భద్రమ్, జెమిని సురేష్, నాగేంద్ర ప్రసాద్ ఇతర కీలక పాత్రలు పోషించారు. దర్శకుడు జీవీకే ఈ మూవీని తెరకెక్కించారు. ప్రముఖ నిర్మాత ముప్పా వెంకయ్య చౌదరి గారి నిర్మాణ సారథ్యంలో జి. రాంబాబు యాదవ్ సమర్పణలో లెమన్ హౌస్ సినీ మ్యాజిక్ బ్యానర్‌పై కేఎస్ శంకర్‌రావు, ఆర్ వెంకటేశ్వర రావు ఈ సినిమాను నిర్మించారు. 'అమరావతికి ఆహ్వానం' సినిమా ఫిబ్రవరి 13న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా మూవీ నుండి సెలబ్రేషన్ సాంగ్ డుం డుం డియ్యాల సాంగ్‌ను హైదరాబాద్ లుంబినీ పార్క్‌లోని బోట్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విడుదల చేశారు. మ్యూజిక్ డైరెక్టర్ పద్మనాభ్ భరద్వాజ్ మాట్లాడుతూ ఈ సినిమాలో డుం డుం డియ్యాల సాంగ్ ఒక సెలబ్రేషన్ మోడ్‌లో వచ్చే పాట లిరిక్స్ ఉమా వంగూరి యూఎస్‌లో ఉంటారు. సిచ్యువేషన్ వివరించగానే అద్భుతమైన లిరిక్స్ రాసి పంపారు. మ్యూజిక్ కూడా బాగా కుదిరింది. తప్పకుండా ఈ పాట ఒక మంచి సెలబ్రేషన్ సాంగ్‌గా వైరల్ అవుతుంది అన్నా రు. హీరోయిన్ ఎస్తేర్ మాట్లాడుతూ దర్శకుడు జీవీకే ఈ సినిమా స్క్రిప్ట్ నరేట్ చేసినప్పుడే



ఆయనకు సినిమా మీద ఉన్న ప్యాషన్ తెలిసింది..అమరావతికి ఆహ్వానం అనేది మంచి టైటిల్..సినిమా కూడా చాలా బాగా వచ్చింది. పద్మనాభ్ భరద్వాజ్ మంచి పాటలు కంపోజ్ చేశారు..హీరోయిన్ సుప్రిత మాట్లాడుతూ ఈ సినిమాలో దయ్యాలు లేవు అని చెప్పే యూట్యూబర్ పాత్రలో నేను కనిపిస్తాను..నా క్యారెక్టర్‌కి చివరిలో మంచి సర్‌ప్రైజ్ ఉంటుంది. ధన్యతో యాక్ట్ చేయడం హ్యాపీ. డీఓపీ ప్రభాకర్ రెడ్డి నన్ను చాలా అందంగా చూపించారు. దర్శకుడు జీవీకే గారికి ఈ సినిమా ద్వారా మంచి సక్సెస్ రావాలని కోరుకుంటున్నాను. శివ కంఠంనేని సెట్‌లో చాలా జోవియల్‌గా ఉంటారు. టీమ్ అందరూ చాలా బాగా సపోర్ట్ చేశారు. ఫిబ్రవరి 13న ఈ సినిమాను థియేటర్స్‌లో చూసి ఎంజాయ్ చేయండి అన్నారు. డైరెక్టర్ జీవీకే మాట్లాడుతూ అమరావతికి ఆహ్వానం..ఈ జర్నీ మా టీమ్ అందరికీ ఎప్పటికీ గుర్తుండిపోతుంది. అనుకున్న బడ్జెట్‌లో పక్కాగా ప్లాన్ చేసుకున్న షెడ్యూల్స్ ప్రకారం ఆర్గనైజ్డ్‌గా ఈ సినిమా చేశాం..ఈ మూవీలో నటించిన ప్రతి ఒక్కరూ ఎంతో సపోర్ట్ చేశారు అన్నారు. [illegible] 13న తప్పకుండా ఈ సినిమాను థియేటర్స్‌లోకి వస్తోందని అన్నారు.

## పాన్ ఇండియా మూవీగా 'నాగబంధం'



విరాట్ కర్ణ హీగా అభిషేక్ నామా దర్శకత్వం వహిస్తున్న పాన్ ఇండియా మూవీ 'నాగబంధం' ఈ వేసవిలో విడుదలకు సిద్ధమవుతోంది. ఈ నెల15న మహా శివరాత్రి శుభ సందర్భాన్ని పురస్కరించుకుని ఈ చిత్ర టీజర్ విడుదల కానుంది. దీనికి ముందు, ఈ ఇతిహాస కథనంలోని మరో కీలక పాత్ర ఫస్ట్‌లుక్‌ను రిలీజ్ చేశారుబాలీవుడ్ 'ఫైటర్'లో తన అద్భుతమైన ప్రజెన్స్‌తో ఆకట్టుకున్న రిషబ్ సాహ్నీ నాగబంధంలో ఆఫ్ఘన్ సుల్తాన్ అబ్దాలి పాత్రను పోషించాడు. 1750లో బ్యాక్ డ్రాప్ లోని ఈ చిత్రంలో భారత్‌లో అబ్దాలీ చేసిన దండయాత్రలు, దేవాలయాల దోపిడీ, అపార సంపద కోసం అతడు చేసిన క్రూర ప్రయత్నాలను చూపించబోతున్నారు.ఫస్ట్ లుక్ పోస్టర్ పవర్ ఫుల్ గా వుంది. మంచుతో కప్పబడిన యుద్ధభూమిలో తుఫాన్ వాతావరణం మధ్య, భారీ రక్తంతో మచ్చలపడ్డ గొడ్డలిని చేతబట్టి యుద్ధానికి దూసుకెళ్తున్న అబ్దాలీగా రిషభ్ కనిపిస్తారు. అతని వెనుక భారీ సైన్యం, గాలికి చీలిపోతున్న ఆకుపచ్చ యుద్ధ జెండాలు, విలువిద్యకులు, యోధులు, యుద్ధ ఏనుగులు మొత్తంగా ఒక హైవోల్టేజ్ వార్ కాన్వాస్‌ను సృష్టించాయి. రిషభ్ నటనపై దర్శకుడు అభిషేక్ నామా ప్రశంసలు కురిపించారు. రిషభ్ చేసిన నటన చూస్తే, అబ్దాలీనే తెరపై జీవించినట్టుగా అనిపిస్తుంది. ఈ క్లిష్టమైన పాత్రలో అతడు అద్భుతంగా నటించారు. నభా నటేష్, ఐశ్వర్య మీనన్ కథానాయికలుగా నటిస్తుండగా, జగపతి బాబు, జయప్రకాష్, మురళి శర్మ, బి.ఎస్. అవినాష్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సౌందర్ రాజన్ ఎస్ సినిమాటోగ్రఫీ, ఆర్‌సి ప్రణవ్ ఎడిటింగ్, అశోక్ కుమార్ ప్రొడక్షన్ డిజైనర్‌గా పని చేస్తున్న ఈ విజువల్ వండర్ ప్రేక్షకులను మెస్మరైజ్ చేయడానికి సిద్ధంగా ఉంది.

## ఫిబ్రవరి 14న 'సీతా పయనం'




నటుడు, దర్శకుడు యాక్షన్ కింగ్ అర్జున్ దర్శకత్వంలో శ్రీ రామ్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్ బ్యానర్‌పై రాబోతోన్న కొత్త చిత్రం 'సీతా పయనం'. ఈ మూవీలో యాక్షన్ కింగ్ అర్జున్ కుమార్తె ఐశ్వర్య అర్జున్ హీరోయిన్‌గా తెరకు పరిచయం కాబోతున్నారు. ఈ సినిమాలో నిరంజన్, సత్యరాజ్, ప్రకాష్ రాజ్, కోవై సరళ ఇతర ముఖ్య పాత్రల్ని పోషించారు. యాక్షన్ కింగ్ అర్జున్ కూడా ఓ ప్రత్యేకమైన పాత్రలో నటించారు. అతని మేనల్లుడు యాక్షన్ ప్రిన్స్ ధ్రువ సర్జా మరో స్పెషల్ కామియో రోల్ పోషించారు. ఈ మూవీని ఫిబ్రవరి 14న రిలీజ్ చేయబోతున్నారు. ఈ క్రమంలో తాజాగా ట్రైలర్‌ను రిలీజ్ చేశారు.మాస్ యాక్షన్, లవ్ స్టోరీ, ఫ్యామిలీ ఎమోషన్స్ ఇలా అన్ని రకాల అంశాల్ని ఈ ట్రైలర్‌లో జోడించారు. కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రమని 'సీతా పయనం' ట్రైలర్ చూస్తే అర్థం అవుతోంది. ఈ చిత్రానికి జి బాలమురుగన్ సినిమాటోగ్రఫీ అందించారు. సాయి మాధవ్ బుర్రా డైలాగ్స్ రాయగా అనూప్ రూబెన్స్ సంగీతాన్ని అందించారు. చిత్రంలోని స్టంట్ సన్నివేశాలకు కిక్ యాస్ కాళీ కొరియోగ్రఫీ అందించారు. ఈ సినిమాను ఫిబ్రవరి 14న తెలుగు, కన్నడ, తమిళం, మలయాళం, హిందీ భాషల్లో భారీ స్థాయిలో రిలీజ్ చేస్తున్నారు. నిరంజన్, ఐశ్వర్య అర్జున్, సత్యరాజ్, ప్రకాష్ రాజ్, కోవై సరళ, యాక్షన్ కింగ్ అర్జున్, యాక్షన్ ప్రిన్స్ ధ్రువ సర్జా తదితరులు నటిస్తున్నారు.

## 'కాక్రోచ్' సెన్సార్ పూర్తి




సమాజం చీత్కరించుకొనే మురికి మనుషుల మధ్య నడిచే అందమైన ప్రేమ కథ కాక్రోచ్. అడ్డరోడ్‌లో పడుపు వృత్తి చేసుకొనే వేశ్యకి , ఒక కిరాయి హంతకుడికి మధ్య సాగే స్వచ్ఛమైన స్నేహం కాక్రోచ్. భ్రష్టు పట్టిన అవినీతి సమాజపు చీకటిని మీకు పరిచయం చేసే చిక్కటి చిత్రం కాక్రోచ్. కాక్రోచ్ ని చంపితే చప్పట్లు కొడుతూ, సీతాకోక చిలుకలపై కవితలు రాసే ద్వంద విలువల మనస్తత్వాలని ప్రశ్నించే పాత్రలతో దర్శకుడు పి.సునీల్ కుమార్ రెడ్డి , శ్రీ లక్ష్మి పిక్చర్స్ బ్యానర్ పై బి. బాపిరాజు నిర్మాతగా వ్యవహరించిన చిత్రం కాక్రోచ్ సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకుంది. అభిలాష్ సుంకర , ప్రేమసన్ , నవీన్ లు నిజజీవిత ఆధారిత కిరాయి హంతకులుగా నటించగా, సొంతవూరు చిత్రంలో ఉత్తమ నటి అవార్డు గ్రహీత తీర్థ ఒక ముఖ్య పాత్ర పోషించగా , మీనాక్షి, రామన్ , బుగత, అంజి, ప్రదీప్. సముద్రం వెంకటేష్ , మల్లిక, ఎఫ్ ఎమ్ బాబాయ్, రాజు, బాలాజీ , ఎల్ బీ రమణ ఆర్ కే సింగ్. పూజా , పొట్టి మూర్తి , ప్రసాద్ , రేలారే రఘు బృందం , జానీ తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. చిత్రానికి సంగీతం ప్రదీప్ చంద్ర , ఎడిటర్ రఘు , ఫైట్ మాస్టర్ : ప్రేంసన్,కెమెరా సంతోష్.లిరిక్స్ : ప్రతాప్. సౌండ నాగరాజు , నిర్మాతలు : బి బాపిరాజు , ముతుకి నాగ సత్యనారాయణ , రచన దర్శకత్వం పి. సునీల్ కుమార్ రెడ్డి.

## సూడాన్‌లో ఆర్‌ఎస్‌ఎఫ్ దాడి :24 మంది మృతి

**కైరో:** సూడాన్‌లో రాపిడ్ సపోర్ట్ ఫోర్స్ (ఆర్‌ఎస్‌ఎఫ్) చేసిన దాడిలో ఎనిమిది మంది పిల్లలు, ఇద్దరు చంటిబిడ్డలు సహా 24 మంది పౌరులు మరణించారు. సూడాన్ డాక్టర్స్ నెట్‌వర్క్ శనివారం ఈ ప్రకటన చేసింది. ఉత్తర కోర్డోఫాన్ రాష్ట్రంలో ఆర్‌ఎస్‌ఎఫ్ ఈ దాడులు చేసింది. డెబైకర్ ప్రాంతంలో యుద్ధం చెలరేగడంతో ఆ ప్రాంతం నుండి పారిపోతున్న ప్రజలను తీసకు వెళుతున్న వాహనంపై ఆర్‌ఎస్‌ఎఫ్ సైనికులు రహద్ నగర సమీపంలో దాడి చేయడంతో వీరంతా మరణించారు. ఈ దాడిలో అనేకమంది గాయపడ్డారు. సూడాన్‌లో రెండు సైనిక వర్గాలమధ్య మూడు సంవత్సరాలుగా చెలరేగిన యుద్ధంవల్ల లక్షలాదిమంది ప్రజలు దేశం వదలి, యుద్ధ ప్రాంతాలు వదలి సురక్షిత ప్రదేశాలకు పారిపోయారు. ఈ యుద్ధంలో వేలాది మంది అమాయకులైన సాధారణ పౌరులు మరణించారు.



## వర ప్రదాయిని

(మొదటి పేజీ తరువాయి)


పరిశీలించామని తెలిపారు. చిన్న చిన్న పనులు, క్లీనింగ్ పనులు తప్ప దాదాపు అన్ని పనులు పూర్తయ్యాయని అన్నారు. ప్రారంభించే నాటికి నాలుగు మెగావాట్లు కెపాసిటీ గల ఆయిల్ పామ్ పిప్పితో కూడిన వ్యర్థాలతో విద్యుత్ జనరేషన్ చేసే ప్లాంట్ కూడా పూర్తవుతుందని మంత్రి తెలిపారు. ఫ్యాక్టరీ ప్రారంభించి అందులోనే మూడు రోజుల పాటు రైతుమేళ నిర్వహిస్తామన్నారు. ఇందులో ఆయిల్ పామ్ పంటలకు సంబంధించిన స్టాళ్లను ఏర్పాటు చేసివ్యవసాయ యుత్రికరణ, అదునాతన వ్యవసాయ పద్దతులపై ప్రదర్శన మరియు శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులచేత రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో అన్ని జిల్లాలలో పండించిన ఆయిల్ పామ్ పంటను ప్రాసెస్ చేసే కెపాసిటీ నర్మెట ఆయిల్‌ఫెడ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీకి ఉంది అన్నారు.

ఎకరాకు లక్ష రూపాయలకు పైన ఆదాయం వచ్చే ఏకైక పంట ఆయిల్ పామ్ పంట అని, రైతులకు ఎలాంటి మార్కెటింగ్ ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేస్తున్నామని మంత్రి తుమ్మల నాగేశ్వర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ డైరెక్టర్ మరియు ఆయిల్ ఫెడ్ ఎండి యాస్మిన్ భాష, ఫ్యాక్టరీ మేనేజర్ శ్రీకాంత్, జిల్లా ఉద్యానవన అధికారి సువర్ణ, జిల్లా వ్యవసాయ అధికారి స్వరూప రాణి, జిల్లా మార్కెటింగ్ అధికారి నాగరాజు, ఆయిల్ ఫెడ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# యువతే దేశానికి వెన్నెముక

### యువత కర్తవ్యాన్ని బాధ్యతాయుతంగా నిర్వహిస్తే దేశాభివృద్ధి

### శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిని కలిసిన బిహార్ యువకులు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** యువతనే దేశానికి వెన్నెముక అని, యువత తమ కర్తవ్యాన్ని బాధ్యతాయుతంగా నిర్వహిస్తే దేశాభివృద్ధి జరుగుతుందని తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. చెడు మార్గంలో యువత నడవకుండా చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఆయన సూచించారు. తెలంగాణ శాసనసభ, శాసనమండలి సమావేశ హాల్స్‌ను వారు సందర్శించారు. అనంతరం తెలంగాణ శాసన మండలి చైర్మన్‌తో గ్రూప్ ఫోటో దిగారు. ఈ నెల 3 నుండి 7 వరకు 'మేరా యువ భారత్' రంగారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో 'ఇంటర్ స్టేట్ యూత్ ఎక్చేంజ్' ప్రోగ్రాం జరిగింది. అనంతరం బిహార్ రాష్ట్రానికి చెందిన యువకులు శనివారం తెలంగాణ లేజిస్లేచర్ కార్యాలయాలను సందర్శించారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిని వారు మర్యాద పూర్వకంగా కలిశారు. బిహార్ యువతతో మాటముచ్చట సం దర్భంగా తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ దేశ సేవయే యువత నిజమైన కర్తవ్యం అని మనస్ఫూర్తిగా నమ్ముతున్నట్లు ఆయన తెలిపారు. మరింత బల మైన, ఐక్యమైన, అభివృద్ధి చెందిన భారతదేశం కోసం మనమందరం కృషి చేయాలన్నారు. ప్రపంచంలో ఏ దేశానికి లేని యువ సంపద మన భారతదేశానికి ఉందని గుత్తా సుఖేందర్ రెడ్డి వివరించారు. కార్యక్రమంలో తెలంగాణ శాసనమండలి సెక్రెటరీ డాక్టర్ వి.నరసింహా చార్యులు తదితరులు పాల్గొన్నారు

## రూ.2.5కోట్లు టోకరా

(మొదటి పేజీ తరువాయి)

డిఎస్‌ఆర్ వర్మకు పరిచయం చేశాడు. తమను తాము ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి నేతలుగా జస్టిస్‌కు వాళ్లు పరిచయం చేసుకున్నారు. బిజెపి పార్టీ ఫండ్ రైసింగ్ కమిటి సభ్యులమని జస్టిస్‌ను నమ్మించారు. పార్టీ అవసరాల నిమిత్తం కేంద్రంలోని వ్యక్తులకు డబ్బు చెల్లించాల్సి ఉందని, అందుకు బాండ్లు (బాండ్స్) జారీ చేస్తామని నమ్మబలికి భారీ మొత్తం వసూలు చేశారని తన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో పాటు జస్టిస్‌కు ఏదైనా నామినేటెడ్ పోస్టు ఇప్పిస్తామని, అలాగే అతని మనవళ్లకు అమెరికాలో గ్రీన్ కార్డు ఇప్పించడంతో పాటు అక్కడే మంచి ఉద్యోగాలలో చేరుస్తామని నిందితులు నమ్మించారు. ఈ హామీలను నమ్మిన ఆయన భార్య, కుమారైలు 2021లో వివిధ దశల్లో బ్యాంకు లావాదేవీల ద్వారా మొత్తం రూ.2.5 కోట్లు నిందితులకు చెల్లించారు. ఇందుకు సంబంధించిన వాట్సాప్ సందేశాలు కూడా ఆధారాలుగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అయితే, డబ్బులు తీసుకున్నప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి బాండ్లు జారీ చేయకపోవడంతో పాటు, వాగ్దానం చేసిన లాభాలు ఎవి అందించలేదని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సిసిఎస్ ఆర్థికనేరాల విభాగం ఇన్‌స్పెక్టర్ తులా వంశీకృష్ణరావు నిందితులపై ఐపిసి 406,420, రెడ్‌విత్ 34 ఐపిసి సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**సినీ ప్రముఖులను వదలని నిందితులు..**

జస్టిస్‌ను మోసగించినట్లుగానే ఈ నిందితులు సనీ ప్రముఖులను కూడా మోసగించి కోట్లాది రూపాయలు దండుకున్నట్లు తెలిసింది. అలాగే పలువురు రాజకీయ ప్రముఖులను కూడా మోసగించినట్లు సమాచారం. ఇందులో బడా నేతలు ఉండడంతో వారు తమ పరువు పోతుందనే భయంతో ఫిర్యాదు చేయడానికి ముందు రాలేదని తెలిసింది. నిందితులను అదుపులోకి తీసుకుంటే మరిన్ని సంచలన వివరాలు బయటపడే అవకాశాలు ఉన్నాయి.

## రాజకీయ దురుద్దేశ ఆరోపణే

(మొదటి పేజీ తరువాయి)

చేసే అభియోగమని సోనియా తరపు న్యాయవాదులు ఢిల్లీ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి జస్టిస్ విశాల్ గోగ్నేకు తెలిపారు. వికాస్ త్రిపాఠి దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేయాలని కోరారు. దీనిపై తదుపరి విచారణను ఫిబ్రవరి 21వ తేదీకి కోర్టు వాయిదా వేసింది. 1968లో రాజీవ్ గాంధీతో సోనియాగాంధీకి పెళ్లి జరిగింది. 1983 ఏప్రిల్ 30న ఆమెకు భారత పౌరసత్వం లభించింది.

**పౌరసత్వంపై కోర్టుల విచారణ రాజ్యాంగ విరుద్ధం**

'వికాస్ త్రిపాఠి దాఖలు చేసిన ఈ పిటిషన్ను గతంలో ఢిల్లీ మెజిస్టీరియల్ కోర్టు తప్పుపట్టింది. పౌరసత్వంతో ముడిపడిన వ్యవహారాలన్నీ కేంద్ర ప్రభుత్వం పరిధిలోకి వస్తాయని ఆ కోర్టు వ్యాఖ్యానించింది. ఓటరు జాబితాకు సంబంధించిన అంశంపై ఎన్నికల సంఘానికే ప్రత్యేక హక్కు ఉంటుంది. దీనిపై ఐపిసి/బిఎన్‌ఎస్‌లోని సెక్షన్ల ముసుగులో వికాస్ త్రిపాఠి లాంటి వ్యక్తులు దాఖలు చేసే ప్రైవేటు పిటిషన్లను క్రిమినల్ కోర్టులు పర్యవేక్షించడం సరి కాదు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 329లో ఉన్న అధికారాల వికేంద్రీకరణ సూత్రానికి ఇది పూర్తి విరుద్ధం. ఎన్నికల ప్రక్రియలోకి న్యాయస్థానాల జోక్యాన్ని ఆర్టికల్ 329 నిలువరిస్తుంది' అని సోనియాగాంధీ తరపు న్యాయవాదులు ఢిల్లీ సెషన్స్ కోర్టులో వాదన వినిపించారు.

**40 ఏళ్ల కిందటి ఆధారాలు తేవడం అసాధ్యం**

'సోనియాగాంధీకి భారత పౌరసత్వం వచ్చి దాదాపు 40 ఏళ్లు గడిచిపోయాయి. ఇంత పెద్ద గ్యాప్ తర్వాత, 40 ఏళ్ల కిందటి ఓట్ల రికార్డును సేకరించి, ఆధారాలను సమర్పించడం అనేది ఎవరికీ సాధ్యమయ్యే విషయం కాదు. అందుకే ఇది చెల్లుబాటు కాని అభియోగం. దీన్ని కోర్టు ఉపేక్షించకూడదు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 అనేది జీవిత భద్రత, వ్యక్తిగత స్వేచ్ఛ గురించి చెబుతుంది. ఈ తరహా పిటిషన్లు ఆర్టికల్ 21 స్ఫూర్తికి భంగం కలిగిస్తాయి. కాబట్టి దీన్ని కోర్టు తిరస్కరించాలి'' అని న్యాయస్థానాన్ని సోనియాగాంధీ తరపు న్యాయవాదులు కోరారు.

## సైబర్ మోసాల బారిన పడొద్దు

(మొదటి పేజీ తరువాయి)

ఆవేదన వ్యక్తం చేశారు. సైబర్ నేరాల వల్ల కలిగే నష్టం ఎంత తీవ్రంగా ఉంటోందంటే, ఆ బాధ నుండి కోలుకోవడానికి బాధితులకు జీవితకాలం కూడా సరిపోవడం లేదని ఆయన పేర్కొన్నారు. ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని పిఎస్‌ఆర్ శ్లోక కన్వెన్షన్‌లో 'జాగృత్ హైదరాబాద్ సురక్షిత్ హైదరాబాద్' కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సైబర్ క్రైమ్ అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై, ప్రసంగించారు. పెరుగుతున్న సైబర్ నేరాలను అరికట్టాలంటే ప్రజల్లో చైతన్యం రావడం అత్యవసరమని, ముఖ్యంగా విద్యావంతులే లక్ష్యంగా నకిలీ సెబీ సర్టిఫికేట్లు చూపిస్తూ స్టాక్ మార్కెట్, ట్రేడింగ్ పేరుతో జరుగుతున్న మోసాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

నగరంలో రోజుకు సు మారు రూ.1 కోటి వరకు ప్రజలు ఇలాంటి మోసాల వల్ల నష్టపోతున్నారని గణాంకాలతో వివరించిన సజ్జనర్, బంగారం, వెండి ధరల హెచ్చుతగ్గులను సాకుగా చూపి అపరిచితులు చేసే ట్రేడింగ్ ప్రతిపాదనలను నమ్మవద్దని కోరారు. సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత చిత్రాలను, సమాచారాన్ని పంచుకునేటప్పుడు అత్యంత జాగ్రత్తగా ఉండాలని, తెలియని వ్యక్తులు పంపే హానికరమైన ఎపికే ఫైల్స్ డౌన్‌లోడ్ చేయవద్దని, ఓటిపిలను ఎవరితోనూ పంచుకోవద్దని హెచ్చరించారు.

**డిజిటల్ అరెస్ట్ పేరుతో బెదిరింపులు..**

ఇటీవల కాలంలో నకిలీ పోలీసుల పేరుతో 'డిజిటల్ అరెస్ట్' అంటూ వీడియో కాల్స్ చేస్తూ భయభ్రాంతులకు గురిచేసి డబ్బులు వసూలు చేస్తున్నారని గుర్తు చేశారు. తక్కువ వడ్డీకే రుణాలు ఇస్తామనే అపరిచిత లోన్ యాప్స్ పట్ల కూడా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఆయన హెచ్చరించారు. ఎవరైనా దురదృష్టవశాత్తూ సైబర్ మోసానికి గురైతే ఏమాత్రం ఆలస్యం చేయకుండా 'గోల్డెన్ అవర్'లో 1930 నంబర్‌కు కాల్ చే యాలని, తద్వారా పోగొట్టుకున్న సొమ్ము ను నేరగాళ్ల ఖాతాల్లో ఫ్రీజ్ చేసి, వెనక్కి రప్పించే అవకాశం ఉంటుందని సజ్జనర్ వివరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ సిపి (లా అండ్ ఆర్డర్) సౌత్ రేంజ్ తఫ్సీర్ ఇక్బాల్, శంషాబాద్ డిసిపి బి. రాజేష్, సైబర్ క్రైమ్ డిసిపి వి.అరవింద్ బాబు, శంషాబాద్ ఎసిపి శ్రీకాంత్ గౌడ్, ఆదిభట్ల ఎసిపి ప్రదీప్ కుమార్ రెడ్డితో పాటు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఫర్టిలైజర్ షాపులది!

(మొదటి పేజీ తరువాయి)

రైతును ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వరినాట్లు వేసి పంటను కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన కీలక సమయంలో యూరియా అందక రైతు తీవ్ర ఆందోళనకు గురవుతుండగా, ఈలోపాలనే ఆసరాగా చేసుకుని ప్రైవేట్ ఫర్టిలైజర్ వ్యాపారులు ధరల దోపిడీకి పాల్పడుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.ఒక వైపు ప్రకృతి ప్రతికూల పరిస్థితులు వెంటాడుతుంటే,మరో వైపు యూరియా కోసం పడుతున్న అవస్థలు రైతును మానసికంగా, ఆర్థికంగా కుంగదీస్తున్నాయి. సాంకేతికత పేరుతో ప్రవేశపెట్టిన యూరియా యాప్ క్షేత్రస్థాయిలో రైతుకు శాపంగా మారిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం సహకార సంఘాలకు నేరుగా రవాణా సౌకర్యంతో యూరియాను సరఫరా చేస్తుండగా, ప్రైవేట్ ఫర్టిలైజర్ షాపులకు అలాంటి సదుపాయం లేకపోవడంతో రవాణా, లేబర్ చార్జీల పేరుతో అదనపు భారం పడుతోందని రైతులు వాపోతున్నారు. ఈ భారం చివరకు రైతు జేబుపైనే పడుతోందని ఆరోపిస్తున్నారు. ఇదే ఆసరాగా చేసుకుని కొందరు ప్రైవేట్ షాపుల యజమానులు ప్రభుత్వం నిర్ణయించిన రూ.266.50 ఎమ్మార్పీని పక్కనపెట్టి, అదనపు చార్జీల పేరుతో ఒక్కో యూరియా బస్తాకు రూ.280 నుంచి రూ.320 వరకు వసూలు చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్నిచోట్ల రూ.350 వరకు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. ఎమ్మార్పీ ధరకే విక్రయించినట్లు రసీదులు రాస్తూ వాస్తవానికి అధిక ధరలు వసూలు చేస్తున్నారని రైతులు చెబుతున్నారు.

**ఎమ్మార్పీ ధరలు ఎక్కడ..? అదనపు వసూళ్లే లక్ష్యం**

ప్రభుత్వం యూరియా బస్తాకు ఎమ్మార్పీ ధరను రూ.266.50గా నిర్ణయించింది. అయినా క్షేత్రస్థాయిలో రైతులకు ఈ ధరకు యూరియా అందడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రైవేట్ ఫర్టిలైజర్ షాపులు రవాణా, లేబర్ చార్జీల పేరుతో ఎమ్మార్పీకి మించి ధరలు వసూలు చేస్తున్నారని రైతులు చెబుతున్నారు.ఒక లారీలో సుమారు 444 యూరియా బస్తాలు వస్తుండగా, మిర్యాలగూడ నుంచి వివిధ ప్రాంతాల వరకు దూరాన్ని బట్టి ఒక్కో లారీకి రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు రవాణా ఖర్చు అవుతోందని నిర్వాహకులు చెబుతున్నారు.బస్తాలు దించేందుకు లేబర్ చార్జీలుగా ఒక్కో బస్తాకు రూ.7 నుంచి రూ.10 వరకు ఖర్చవుతోందని పేర్కొంటున్నారు. ఈ ఖర్చులను సాకుగా చూపుతూ రైతుల నుంచి అధిక ధరలు వసూలు చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి.

**అదనపు వసూళ్లు చేసే షాపులపై చర్యలు తీసుకోవాలి : తెలువారిగూడెం రైతు గర్ధ సతీష్**

యూరియాను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుని కొనుగోలు చేసినా ఎమ్మార్పీకి మించి వసూలు చేయడం వల్ల నష్టపోయాను. ప్రభుత్వం ప్రకటించిన ధరలకే యూరియా ఇవ్వాడంలేదు అని తెలువారిగూడెం రైతు గర్ధ సతీష్ అన్నారు అదనపు వసూళ్లు చేసే షాపులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**ఆధారాలు ఉంటే పరిశీలిస్తాం : కట్టంగూర్ ఏవో గిరిప్రసాద్**

ఫర్టిలైజర్ షాపుల్లో ఎమ్మార్పీకి మించి ధరలు వసూలు చేస్తున్నట్లు ఆధారాలు ఉంటే పరిశీలిస్తాం. ప్రస్తుతం ఎన్నికల విధుల్లో ఉన్నాను, తర్వాత విషయం చూద్దాం అని కట్టంగూర్ ఏవో గిరిప్రసాద్ చెపుకోచారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com